
www.andhrajyothy.com పేజీలు: 14
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 59



శుక్రవారం 14-6-2024
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి రా. 12.04 తదుపరి నవమి; నక్షత్రం: ఉత్తర ఫల్గుణి; వర్జ్యం: మ. 1.15-3.0, దుర్ముహూర్తం: ఉ. 8.20-9.13, మ.12.41-1.33; అమృతఘడియలు: రా. 12.06-1.54; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.46
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అమరావతి నిర్మాతకు అపూర్వ స్వాగతం!

సీఎం చంద్రబాబుపై రాజధానిలో పూలవర్షం
టన్నులకొద్దీ పూలతో బాటలు పరిచిన రైతులు



5 సంతకాల సంబరం

సీఎంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు
తొలి రోజునే ఐదు కీలక హామీల అమలు

మెగా డీఎస్సీపైనే తొలి సంతకం
16,347 టీచర్ పోస్టుల భర్తీకి నిర్ణయం
డిసెంబరు 31లోగా నియామక ప్రక్రియ పూర్తి

ల్యాండ్ టైటిల్ చట్టం రద్దుపై రెండో సంతకం

పేదలకు పింఛను ఇక 4 వేలు
వెయ్యి పెంచుతూ మూడో చేవ్రాలు

అన్న క్యాంటీన్లకు మళ్లీ శ్రీకారం
వాటి పునరుద్ధరణపైనే నాలుగో సంతకం

స్కిల్ సెన్సెస్‌పై ఐదో సంతకం


సీఎంగా బాధ్యతలు చేపట్టి మెగా డీఎస్సీ ఫైలుపై తొలి సంతకం చేస్తున్న చంద్రబాబు

ఎస్‌జీటీ	6,371
స్కూల్ అసిస్టెంట్	7,725
టీజీటీ	1,781
పీజీటీ	286
పీఈటీ	132
ప్రిన్సిపాల్స్	52
మొత్తం	16,347

అమరావతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల అమలుపై 'తొలి సంతకాల'తో చంద్రబాబు పాలన ప్రారంభమైంది. సంక్షేమం, ఉపాధి, ఉద్యోగం, వ్యవసాయం, నైపుణ్యం... ఈ ఐదు రంగాలకు సంబంధించిన ఫైళ్లపై ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు సంతకాలు పెట్టారు. సంబంధిత జీవోలను కూడా వెంటనే జారీ చేశారు. బుధవారం సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన ఆయన... గురువారం వేద పండితుల ఆశీర్వచనాల మధ్య సచివాలయంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. సతీమణి భువనేశ్వరితో కలిసి తన చాంబర్‌లో అడుగుపెట్టారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఐదు కీలక హామీల అమలుపై నిర్ణయం తీసుకున్నారు. 16,347 ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేసేలా 'మెగా డీఎస్సీ'ని ప్రకటిస్తూ... ఆ ఫైలుపైనే చంద్రబాబు తొలి సంతకం చేశారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఒకేసారి ఇంత భారీ సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేపట్టడం ఇదే తొలిసారి. ఇక... జగన్ సర్కారు రైతుల్లో

మిగతా 11వ పేజీలో...

భ్రష్టు పట్టించారు!

ఐఏఎస్, ఐపీఎస్‌లపై గౌరవం ఉండేది
కానీ, ఐదేళ్లలో మొత్తం డ్యామేజ్ చేశారు
అజెండాతో పనిచేసి వ్యవస్థలను దెబ్బతీశారు
ఏం చేశారో ఆత్మ విమర్శ చేసుకోండి
సీనియర్ బ్యూరోక్రాట్లకు సీఎం 'క్లాస్'

జగన్ భక్త అధికారులకు
కొత్త సీఎం షాక్
'వివాదాస్పద' అధికారుల ఓవరాక్షన్
బాబును ప్రసన్నం చేసుకునేందుకు తంటాలు 14

మార్పు మొదలైంది
పరదాల పాలనకు స్వస్తి 13
మితిమీరిన ఆంక్షలకు సెలవు
రాజధాని ప్రాంతంలో మారిన చిత్రం
బారికేడ్లు, పోలీసు పహరా మాయం
జగన్ ఫొటోలున్నా స్టూడెంట్ కిట్ పంపిణీ
విద్యార్థులకు ఇబ్బంది ఉండొద్దనే!

350 కోట్లు 'సాఫ్ట్'గానే దోచేశారు

ఖనిజాల వేలంలో భారీ గోల్‌మాల్

అస్మదీయులకు బిడ్లు.. తమకు వాటాలు
సాంకేతికతను అడ్డుపెట్టుకుని కుమ్మక్కు దందా
మినరల్స్ వేలంలో ఐటీ విభాగమే కీలకం
ఆ విభాగంలోకి కడప ఎంపీ అవినాశ్ మనిషి
సాఫ్ట్‌వేర్, టెండర్లు, అప్లికేషన్ల తాళాలు, డాంగిల్స్ అన్నీ ఆయన దగ్గరే..
ముందుగానే 'అసలు విలువ' లీకు 14



సాఫ్ట్‌వేర్ ఇంజనీరు నుంచి ఉన్నతాధికారి దాకా రూ. కోట్లలో కమీషన్లు దండుకున్న వైనం

ఏపీ పూర్వవైభవానికి తొలి అడుగు

సీఎం చంద్రబాబు సంతకాలపై పవన్ హర్షం
కూటమి హామీల అమలు మొదలైందని పోస్టు
బొకేలు, శాలువాలు తేవొద్దని నేతలకు వినతి


11



విలువలు, విశ్వసనీయత.. జగన్ నోట మళ్లీ వింత మాటలు

పార్టీ ఎమ్మెల్సీలతో సమావేశం
ఐదేళ్లు కళ్లు మూసుకోండి
పైకి లేస్తాం, అధికారం వస్తుంది
మభ్యపెట్టే మాటలు చెప్పిన జగన్
కొడతా ఉన్నారంటూ ఆక్రోశం

అమరావతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఘోర పరాజయంపై ఆత్మ విమర్శలేదు! అంతా ఆత్మ వంచనే! పైగా... విలువలు, విశ్వసనీయత అంటూ కాకమ్మ కబుర్లు! ఇదీ మాజీ ముఖ్యమంత్రి జగన్ తీరు! గురువారం

మిగతా 14వ పేజీలో...

ఉపాధి కోసం వెళ్లి అగ్నికి ఆహుతి


1 తామాడ లోకనాథం
2 సత్యనారాయణ
3 మీసాల ఈశ్వర్

కువైట్ అగ్నిప్రమాదంలో ముగ్గురు రాష్ట్రవాసుల దుర్మరణం
మాతృభూమి నుంచి వస్తూనే మృత్యు ఒడిలోకి శ్రీకాకుళం వాసి
ఇటీవలే సొంతూరికి.. ఎన్నికల ఫలితాల అనంతరం పయనం
తూర్పుగోదావరి జిల్లాకు చెందిన మరో ఇద్దరు మృతి 11
భవనం నుంచి దూకిన ముగ్గురు తెలంగాణ వాసులు క్షేమం

మృతుల్లో 12 రాష్ట్రాలకు చెందిన భారతీయులు
కాలి బూడిదైన మృతదేహాలు
మృతదేహాల తరలింపునకు వాయుసేన విమానం



ఎంపీటీసీ పదవికి ఎంపీ రాజీనామా

కర్నూలు పార్లమెంటు సభ్యుడిగా గెలుపొందిన బస్తిపాటి నాగరాజు ఎంపీటీసీ పదవికి రాజీనామా చేశారు. కర్నూలు మండలం పంచ లింగాల-1 ఎంపీటీసీ సభ్యుడి పదవికి రాజీనామా పత్రాన్ని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డికి గురువారం అందజేశారు. - కర్నూలు(న్యూసిటీ)



కేంద్రమంత్రి పీయూష్ గోయల్ తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్నారు. రాష్ట్ర మంత్రి నారాయణతో కలిసి ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆయన శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో అప్పటికే ఉన్న సీఎం చంద్రబాబును.. పీయూష్ గోయల్ పలకరించారు. మంత్రి లోకేశ్‌తో కరచాలనం చేసి కాసేపు మాట్లాడారు.





తిరుమల వెంకన్న ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న చంద్రబాబు దంపతులు, బెజవాడ కనకదుర్గమ్మ ఆలయంలో చంద్రబాబు దంపతులకు వేదాశీర్వచనం చేస్తున్న పండితులు

తిరుమల నుంచే ప్రక్షాళన

కొండపై గోవింద నామం తప్ప మరేమీ వినపడొద్దు

- తిరుమల పవిత్రతను దెబ్బ తీశారు
- పైరవీలకు, స్వార్థానికి వాడుకున్నారు
- తిరుమలలో చంద్రబాబు ఉద్ఘాటన

తిరుమల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): 'భారతీయులు నంబర్ వన్‌గా ఉండాలి. అందులో 30 నుంచి 35 శాతం తెలుగువాళ్లుండాలి. అదే తెలుగుదేశం పార్టీ కల. పేదరికం లేని సమాజ స్థాపనే లక్ష్యంగా పనిచేయడానికి ఆశీర్వదించాలని, శక్తిని, సామర్థ్యాన్ని ప్రసాదించాలని శ్రీవారిని కోరాను' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గురువారం తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం ఆయన ఇక్కడి గాయత్రి నిలయం గెస్ట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. తిరుమతి తిరుపతి దేవస్థానంతోనే ప్రక్షాళన ప్రారంభం కావాలి. ప్రసాదాలు, పరిశుభ్రత ఇలా అన్నిటికీ తిలోదకాలు ఇచ్చేశారు. చివరికి నేను దర్శనానికి వస్తే పరదాలు కట్టేశారు. ఇంకా హ్యాంగోవర్ పోలేదు మా వాళ్లకి. మనుషులు వస్తే హ్యాండిల్ చేయడం తెలియక కర్ఫ్యూ పెట్టేస్తున్నారు. ఇలాంటి కల్చర్ చూస్తుంటే బాధేస్తోంది. కక్షసాధింపు చర్యలు ఉండకూడదు. కానీ తప్పు చేసిన వాళ్లను ప్రక్షాళన చేయకపోతే దేవుడు కూడా సహకరించడు. మంచివాళ్లను కాపాడుకోవాలి. చెడు వ్యక్తులను శిక్షించాలి. ఈరోజు అదే సంకల్పం తీసుకున్నా. తిరుమల క్షేత్రాన్ని అపవిత్రం చేయడం భావ్యం కాదు. ఇక్కడ 'ఏడుకొండలవాడా, ఓం నమో వేంకటేశాయా' అనే నినాదాలు తప్ప మరోటి వినిపించకూడదు. ఆ ధ్యేయంతోనే మొత్తం ప్రక్షాళన చేస్తాం. తిరుమలను గంజాయి, అన్యమత ప్రచారం, లిక్కర్, నాన్‌వెజ్, ఇష్టానుసారం పైరవీలు చేసేందుకు కేంద్రంగా మార్చేశారు. ఏదైనా తప్పు చేస్తే వేరే దేవుళ్లు మరో జన్మలో శిక్షస్తారేమో గానీ శ్రీవేంకటేశ్వరస్వామికి అపచారం చేయాలని చూస్తే ఈ జన్మలోనే శిక్ష అనుభవిస్తారు. అనుభవించారు కూడా. ప్రజాస్వామ్యం కోసం పోరాడిన జర్నలిస్టులు నిద్రలేని రాత్రులు గడిపారు. కోర్టుల చుట్టూ తిరిగారు. వాస్తవాలు చెప్పలేని దుస్థితి అనుభవించారు. అలాగే రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు విపరీతమైన క్షోభను అనుభవించారు. ఉద్యోగులు కూడా త్రీవస్థాయిలో ఇబ్బందిపడ్డారు. ప్రజలు తమకు అన్యాయం జరిగిందని చెప్పుకోలేని పరిస్థితుల్లోకి వెళ్లిపోయారు. ఇకపై రాజకీయం ముసుగులో నేరాలు చేయాలంటే కుదరదు. శ్రీవేంకటేశ్వరస్వామి సాక్షిగా చెబుతున్నా. మంచిని ప్రోత్సహిస్తా. చెడును మాత్రం గట్టిగా తుంగలో తొక్కేస్తా. ఇక ప్రజాపాలన మొదలైంది. గడిచిన ఐదేళ్లలో జరిగిన నష్టంతో రాష్ట్రం 30ఏళ్లు వెనక్కి వెళ్లిపోయింది. తిరిగి పునర్నిర్మాణం చేసుకోవాల్సిన అవసరముంది. శ్రీవారి ఆశీస్సులతో అంచెలంచెలుగా ఎదిగాను. 2003లో శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు వచ్చే సమయంలో నాపై క్లైమోర్ మైన్స్ దాడి జరిగింది. ఆ స్వామే నన్ను బతికించారు. నాద్వారా ఇంకా ఈ రాష్ట్రానికి, జాతికి ఏదో చేయాల్సిన అసరముందని గుర్తించి నాకు ప్రాణభిక్ష పెట్టి ఉంటారు. దేశానికి పెద్ద సంపద కుటుంబవ్యవస్థ. ఇది ప్రపంచానికి ఆదర్శం. ఇతర దేశాల్లో ఇలాంటి వ్యవస్థ ఉండదు. ఈ వారసత్వాన్ని కొనసాగించేలా శ్రీవారు ఆశీర్వదించాలి.

శ్రీవారి, దుర్గమ్మ సేవలో చంద్రబాబు దంపతులు

ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం కుటుంబ సభ్యులతో కలసి తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. తర్వాత పెద్దజీయర్ మఠానికి వెళ్లి ఆశీర్వాదం పొందారు. తిరుచానూరులో పద్మావతీ దేవిని వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా చంద్రబాబు దర్శించుకున్నారు. తిరుపతి నుంచి చంద్రబాబు కుటుంబ సభ్యులతో పాటు ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడినుంచి ఇంద్రకీలాద్రికి చేరుకొని కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయ పండితులు, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు, పండితులతో చంద్రబాబు మాట్లాడారు. అమ్మవారి దర్శనం బాగా జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. అమ్మవారి దయతోనే సీఎం అయ్యాయని తెలిపారు. తీర్థప్రసాదాలు తీసుకున్న తర్వాత చంద్రబాబు దంపతులు ఉండవల్లిలోని నివాసానికి బయలుదేరి వెళ్లారు.

ఐదేళ్ల తర్వాత సీఎంను కలిశాం!

- బాబు ఎదుట సచివాలయ మీడియా ప్రతినిధుల సంతోషం

అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం అమరావతి సచివాలయంలో సాయంత్రం 4.41గంటలకు సచివాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల హామీలకు సంబంధించి పలు ఫైళ్లపై సంతకాలు చేశారు. అనంతరం ఇంటికి వెళుతున్న చంద్రబాబు సచివాలయం మొదటి బ్లాక్ వద్ద మీడియా ప్రతినిధులను చూసి కారు ఆపారు. కారు దిగి ముందుకు వచ్చి వారిని పలకరించారు. సీనియర్ రిపోర్టర్లను పేర్లతో పలకరించి ఎలా ఉన్నారంటూ ఆప్యాయంగా మాట్లాడారు. ఐదేళ్ల తర్వాత తాము సీఎంను కలిశామని, స్వేచ్ఛగా దగ్గరకు వచ్చి మాట్లాడుతున్నామని మీడియా ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. సచివాలయంలో ఉండే తాము గత 5ఏళ్లుగా సీఎంను కనీసం కలవలేకపోయామని, పాలనాంశాలపై కూడా మాట్లాడలేదని అన్నారు. 5ఏళ్ల తర్వాత సీఎంను కలిశామని నవ్వుతూ వ్యాఖ్యానించారు. దీనికి చంద్రబాబు ప్రతిస్పందిస్తూ.. 'ఇక నుంచి మీకు ఇక్కడ చాలా పని ఉంటుంది' అన్నారు. పాలనలో సమూల మార్పులుంటాయని, అన్ని చోట్లా మార్పు ఉండబోతోందని చెప్పారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపి.. మళ్లీ కలుద్దాం అంటూ ఉండవల్లి నివాసానికి బయలుదేరారు. అలాగే తనను చూడ్డానికి వచ్చిన వృద్ధుడిని.. చంద్రబాబు కారు ఆపి మరీ అభివాదం చేస్తూ.. ఉద్యోగులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

ఎన్నికల అనంతర హింసపై
వివరాలు సమర్పించండి

- ప్రభుత్వానికి, డీజీపీకి హైకోర్టు ఆదేశం
- వైపీ పిల్‌పై విచారణ 19కి వాయిదా

అమరావతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల అనంతరం ఓ వర్గంపై జరుగుతున్న దాడులను నిరోధించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి దాఖలు చేసిన ప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై వివరాలు సమర్పించాలని రాష్ట్రప్రభుత్వం, డీజీపీని న్యాయస్థానం ఆదేశించింది. విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. ఎన్నికల అనంతరం హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసేలా ఆదేశించాలని, బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించాలని వైవీ పిటిషన్ వేశారు. గురువారం విచారణలో ఆయన తరపున సీనియర్ న్యాయవాది రాజు రామచంద్రన్ వాదనలు వినిపించారు. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ సానుభూతిపరులపై దాడుల జరిగాయని.. అందుకు సంబంధించి పత్రికల్లో ప్రచురించిన కథనాలు, వీడియో ఆధారాలను కోర్టు ముందుంచామని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దాడులను నిరోధించేలా చర్యలు తీసుకోవాలని డీజీపీకి వినతిపత్రం అందజేశామని.. దాడులు, ఆస్తుల ధ్వంసానికి సంబంధించిన ఘటనలపై ఇప్పటివరకు ఏం చర్యలు తీసుకున్నారో స్థాయీ నివేదికను కోర్టు ముందు ఉంచేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. ఈ వ్యవహారంలో ప్రజాప్రయోజన వ్యాజ్యం ఎలా దాఖలు చేస్తారని ప్రశ్నించింది. ప్రాథమికంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. రిట్ పిటిషన్ దాఖలు చేసుకోవాలని అభిప్రాయపడింది. సీనియర్ న్యాయవాది సమాధానమిస్తూ.. పిల్‌లో తాము చేసిన అభ్యర్థనలు రాష్ట్రమంతటికీ వర్తిస్తాయని, దీనికి విచారణార్హత ఉందని తెలిపారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీని ఆదేశించింది.

ఒలింపియాడ్‌లో నారాయణ విజయ దుందుభి

హైదరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ సైన్స్ అండ్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో తమ సంస్థ విద్యార్థులు విజయదుందుభిని మోగించారని నారాయణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శరణి తెలిపారు. ఒలింపియాడ్ ట్రైనింగ్ క్యాంపుకు తమ విద్యార్థులు 45 మంది ఎంపికయ్యారని ఆమె గుర్తు చేశారు. ఆ 45 మందిలో 10 మంది జూనియర్ సైన్స్ ఒలింపియాడ్, ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ ఒలింపియాడ్, ఏషియన్ ఫిజిక్స్ ఒలింపియాడ్, జూనియర్ ఆస్ట్రానమీ ఒలింపియాడ్స్‌లో అంతర్జాతీయ స్థాయిలో భారత దేశానికి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ విషయంలో నారాయణ సంస్థ మొదటి స్థానంలో ఉందని శరణి అన్నారు.

శ్రీవారి ఆశీస్సులతోనే కూటమి విజయం

- కొండవీటి జ్యోతిర్మయి



గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీనివాసుని ఆశీస్సులతోనే ఏపీలో ఎన్‌డీఏ కూటమికి గొప్ప విజయం చేకూరిందని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త కొండవీటి జ్యోతిర్మయి అభిప్రాయపడ్డారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో సమూలమైన మార్పు కోసమే శ్రీవేంకటేశ్వర స్వామి ఈ విజయాన్ని అందించారని ప్రస్తుతం ఆమెరికాలో ఉన్న ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలోని పాలకులు టీటీడీని నిర్లక్ష్యం చేయడం మూలంగానే వారికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. టీటీడీకి కొందరి మూలంగా అంటిన మలినాన్ని ప్రక్షాళన చేసేందుకు పాలక మండలిలో మంచి వారికి చోటు కల్పించాలని జ్యోతిర్మయి కోరారు.

నేటి నుంచి న్యాయవాదులకు శిక్షణ తరగతులు

అమరావతి: ఏపీ బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు శిక్షణ తరగతు లు ఏర్పాటు చేశారు. కేఎల్ యునివర్సిటీ వేదికగా ఈ నెల 14, 15, 16 తేదీలలో జరగనున్న ఈ శిక్ష ణ తరగతులలో వివిధ చట్టాల పై న్యా యవాదులకు అవగాహన కల్పించనున్నారు.



CORRIGENDUM

Reference is made to the main edition of Andhra Jyothi issue dated 12 Jun 2024 regarding walk-in interview for PGT English at Sainik school , Kalikiri. The day of interview was erroneously published as **'Friday' instead of 'Tuesday'**.The same may be changed to 25 Jun, 2024 (Tuesday).

Sd/- PRINCIPAL



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కువైట్ విషాదం

కువైట్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన భారతీయుల సంఖ్య నలభైఐదుకు చేరుకుంది. చాలా మృతదేహాలు గుర్తుపట్టలేనిస్థితిలో ఉన్నందున డీఎన్ఏ పరీక్ష ద్వారా నిర్ధారణ జరుగుతోంది. అయా అంతస్థుల్లో ఎక్కడివారక్కడ నిలువునా తగలబడిపోయిన ఘోరమైన ఘటన ఇది. కొందరు దట్టమైన పొగలో ఊపిరాడక, మెట్లపైనే ఒరిగిపోయి అగ్నికి ఆహుతి అయిపోవాల్సివచ్చింది. కార్మికులను గొడ్లకంటే హీనంగా చూసే యజమానులు, వారి అపరిమిత ధనదాహం ఈ ఘోరానికి కారణం.

ఇటువంటి ఘోరాలు జరిగినప్పుడల్లా సదరు భవనానికి అనుమతులు లేవని, లేదా నిబంధనలు ఉల్లంఘించి దానిని కట్టారని, పరిమితిని మించి జనాన్ని అందులో కుక్కారని మనదేశంలో అధికారులు ఎట్లా అయితే అంటారో, కువైట్‌లోనూ అక్కడి అధికారులు అలాగే అంటున్నారు. అసలు ఆ భవనంలో ఎవరు ఉంటున్నారో, ఎందరు, ఎందుకు ఉంటున్నారో అక్కడి అధికారులకు తెలియదట. ఇంత ఘోరం జరిగిన తరువాతే సదరు బహుళ అంతస్థుల భవనం ఫైర్‌సేఫ్టీ నియమాలకు అనుగుణంగా లేదని వారికి తెలిసివచ్చింది. ప్రమాదం జరిగిన సమయంలో రెండువందలమందికి పైగా కార్మికులు అందులో ఉన్నారని కువైట్ స్థానిక పత్రికలు రాస్తున్నాయి. అధికారులు దీనిని పట్టించుకోకపోవడానికి కారణం వారంతా కార్మికులు కావడమే. కువైట్ జనాభాలో మూడింట రెండువంతులమంది వలస కార్మికులే కనుక, వారి ఆకలిబతుకులను, ఆవాసాలను పట్టించుకొనేంత శ్రద్ధ అక్కడి అధికారులకు, పాలకులకు సహజంగానే ఉండదు. భారతీయులైనప్పటికీ, ఒక రాష్ట్రానికి చెందినవారి ఊసు మరొకరికి పట్టనిస్థితి సైతం అక్కడ ఉన్నదని ఈ ఘటన తెలియచెబుతోంది. కువైట్ భవననిర్మాణరంగంలో అగ్రస్థానంలో ఉన్న ఎన్బీటీసీ గ్రూప్ ఈ భవనాన్ని లీజుకు తీసుకొని, తన కార్మికులను అందులో ఉంచిందని, దాని యజమాని కేరళకు చెందినవాడని తెలిసినప్పుడు మరింత ఆశ్చర్యం కలుగుతుంది. మరణించినవారిలో అధికులు కేరళకు చెందినవారే.


ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే కొన్ని అరెస్టులు జరిగాయి, విచారణామొదలైంది. కిటకిటలాడే ఇటువంటి భవనాలమీద కన్నేసివుంచుతామని, నిబంధనలు ఉల్లంఘించినవారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇస్తున్నారు. కానీ, వలసకార్మికుల విషయంలో తమ అధికారులు, పాలకులు తగినంత శ్రద్ధపెట్టడం లేదని, గతంలోనూ ప్రమాదాలు జరిగినప్పుడు ఇటువంటి హడావుడే చేసి ఆ తరువాత వదిలేశారని స్థానిక పత్రికలు విమర్శిస్తున్నాయి. గల్ఫ్‌దేశాల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం విషయంలో మన ప్రభుత్వాలు ఎంతమేరకు శ్రద్ధవహిస్తున్నాయన్నది అసలు ప్రశ్న. గతంతో పోల్చితే ఇటువంటి ఘోరాలు జరిగినప్పుడు స్పందించడం, వైద్య సహాయాలు అందించడం, నష్టపరిహారాలు ప్రకటించడం సత్వరమే జరుగుతున్నమాట నిజం. కానీ, కువైట్ తదితర గల్ఫ్‌దేశాలు అనుసరిస్తున్న విధానంలో వలస కార్మికుల మంచిచెడులు చూడాల్సిన బాధ్యత పూర్తిగా యజమానిదే కావడం వల్ల కార్మికులకు న్యాయం జరగడం లేదు. వారి హక్కుల ఉల్లంఘన తీవ్రస్థాయిలో జరుగుతున్నదని, యాజమాన్యాలు వారితో అమానవీయంగా, అమానుషంగా వ్యవహరిస్తున్నాయని, అన్ని విషయాల్లోనూ దోపిడీకి పాల్పడుతున్నాయని అనాదిగా ఫిర్యాదులున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు.

భారతదేశానికి చెందిన వలసకార్మికులు కోటికిపైగా గల్ఫ్‌దేశాల్లో నివసిస్తున్నారు. వారు చెమటచిందించి సంపాదించిన లక్షలకోట్ల రూపాయలు విదేశీ మారకద్రవ్యం రూపంలో మనదేశానికి చేరుతోంది. మన పాలకులకు ఎన్నారైలమీద ఉన్న ప్రేమ ఈ వలసకార్మికులమీద లేదు. వీరి సంక్షేమం మన ప్రభుత్వాలకు పట్టదు. గల్ఫ్‌దేశాల్లో ఏటా వందలమంది కార్మికులు ప్రమాదాల్లో చిక్కుకొని కన్నుమూస్తున్నా, గాయపడుతున్నా వారిని కాపాడుకొచ్చే విధానాలు, వ్యవస్థలూ లేవు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రతకోసం ప్రత్యేకమైన బోర్డులు, వ్యవస్థలు ఉండాలి. నేరాలూ ఘోరాలూ జరిగినప్పుడు మాత్రమే స్పందించి, కాస్తంత నష్టపరిహారాన్ని విదిలించడం కాక, నిరంతరం కార్మికులకోసం పాటుపడే వ్యవస్థలు ఉండాలి. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా బడ్జెట్ కేటాయింపులు జరిపి, ఖర్చుచేయాలి. గల్ఫ్ దేశాల ఆర్థికప్రగతిలో మన కార్మికుల పాత్ర కాదనలేనిది. భారత ప్రభుత్వం తనకున్న సత్సంబంధాలను ఉపయోగించి వారి సంక్షేమం కోసం ఒత్తిడితేవాలి.

చంద్రబాబు నాకు తెలుసు!

ఎవరైనా చంద్రబాబు నాయుడు 'నాకు తెలుసు' అని చెప్పుకుంటే, చంద్రబాబు కంటే తనను గురించి చెప్పుకోటానికి చేస్తున్న ప్రయత్నమే అని అనుకోవటంలో ఏ మాత్రం తప్పులేదు. చంద్రబాబు అందరికీ తెలుసుకానీ చంద్రబాబుకు అందరూ తెలవాల్సిన అగత్యం లేదు. నేను ఒక పోలీసు అధికారిగా ఉండటం వల్ల వారితో నాకు పరిచయం ఉందని మాత్రమే చెప్పుకోగలను. అంతేకాదు, పోలీసు ఉద్యోగ విరమణ తర్వాత తెలుగుదేశం పార్టీలో కొన్నేళ్ళు క్రియాశీలకంగా ఉన్నాను.

ఉద్యోగరీత్యా తిరుపతి ఎడిషినల్ ఎస్పీగా ప్రకాశం జిల్లా నుంచి బదిలీ అయినప్పుడు తిరుపతిలో మంత్రిగా ఉన్న వారిని మొదటిసారిగా చూసాను. నన్ను నేను పరిచయం చేసుకున్నప్పుడు – 'దెయిర్ లాస్ ఈజ్ అవర్ గెయిన్' అని నన్ను అనుకోనిరీతిలో ప్రోత్సహించటం నేను తర్వాత ఎప్పుడూ మర్చిపోలేదు. అటుతర్వాత ఆ జిల్లా ఎస్పీగా ఉన్నా ఆయనతో ఉద్యోగరీత్యా కూడా ప్రత్యేకంగా కలిసిన సందర్భాలు చాలా తక్కువ. పోలీసు శాఖలో ఉన్నప్పుడు ఆయన ముఖ్యమంత్రిగా మాత్రమే నాకు తెలుసు.



> చంద్రబాబు పని ఐపోయింది అని జోస్యాలు చెప్పినవారి పని అయిపోయింది కానీ ఆయన ఇంకా పనిని కొనసాగిస్తూనే ఉన్నారు. దానికి కారణం– సంతోషం కలిగితే ఎగిరెగిరిపడటం – కష్టం వస్తే కృంగిపోవటం ఆయన నిఘంటువులో లేనే లేదు.

ఖమ్మం జిల్లాకు చెందిన నేను ఉద్యోగ విరమణ తర్వాత పార్టీలో అనుకోకుండా చేరినప్పుడు ఆయనతో నిజమైన పరిచయం ఏర్పడింది. పద్నాలుగేళ్ళు ఉండటం చేత వారు నన్ను గుర్తుపట్టగలరు. అందుకే తెలుసు అని చెప్పుకోవచ్చు. అందుకే అప్పట్లో ఆయనలో నేను గమనించిన గుణాలు కొన్ని ప్రస్తావిస్తాను.

ఏ పనిలోనైనా కృషిని ఫలితం ఏ విధంగా వచ్చినా తుదివరకూ తీసుకొనిపోగలరు. స్వయంకృషికి చంద్రబాబు నిలువెత్తు నిదర్శనం. బహుశా నిరంతర కృషివల్ల కష్టమైనా సరే ఇష్టంగా చేసే ప్రవృత్తి ఆయనకు అలవడి ఉంటుంది. పనిలో వుంటే రాత్రీ పగలు అనే తేడాలు కూడా గమనించరు. ఒకసారి చాలా పొద్దుపోయే వరకు ఉన్న తరుణంలో – 'ఇంతగా పోలీసు ఉద్యోగంలో కూడా పనిచేయలేదు సార్' అని మెల్లగా చెప్పినప్పుడు, 'అదేమిటీ? మీరు బాగా పనిచేసేవారని అప్పట్లో చెప్పేవారే! అది నిజం కాదన్నమాట' అని జోక్ వేసారు. ఆ మాటలకు అందరూ నవ్వారు. ఆ రాత్రి సమయంలో వాతావరణాన్ని చిన్నపాటి హ్యూమర్‌తో తేలికపర్చారు.

ఎలాంటివారినైనా, ఎంతటి పరిస్థితినైనా సమన్వయపర్చటం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య! విభిన్న దృక్పథాలు కలిగినవారిని గూడా సమన్వయపరిచి ఒక్క తాటిపై నడిపించే నాయకుడి లక్షణం ఎన్నో సందర్భాలలో కనపడింది. అందుకేనేమో నలభై ఏళ్ళ రాజకీయ జీవితం తర్వాత కూడా పాత కొత్తలను సమపాళ్ళలో మేళవించగలిగే సామర్థ్యం ఇంకా ప్రస్ఫుటంగా కనపడుతునే ఉంది.

మామూలువారే కాదు బాగా అనుభవమున్న నాయకులు గూడా సహనం కోల్పోయిన పరిస్థితులను చాలామంది చూసే ఉంటారు. చంద్రబాబు ఆవేశకావేశాలను అదుపులో ఉంచుకొనే నేర్పును ఏ విధంగా సాధించగలిగారో కానీ, అన్నివేళలా సహనం ఆయనను అంటిపెట్టుకొనే వుంటుంది. గొంతెత్తి మాట్లాడినా, ఆవేశం కనపడినా, పరిస్థితిని బట్టి కనపర్చే వైఖరి మాత్రమే అది. ఎంతటి కోపాన్ని అయినా ఆవేశాన్నయినా తనలోనే ఇముడ్చుకొనే శక్తిని ఆయన వశపర్చుకున్నారేమో అని అప్పుడప్పుడూ అనిపించేది.

చంద్రబాబులో ఉన్న సర్దుకొనిపోయే లక్షణం ఎంతోమంది నాయకులలో కనపడదు. లక్ష్యం ముందు అహం అడ్డురాదు. అనేక విధాలుగా ఇబ్బంది పెట్టినవారైనా తిరిగి పార్టీలో చేరటానికి వస్తే, పార్టీకి వారి అవసరం బేరీజు వేస్తారు కానీ – అప్పుడు ఆ విధంగా ప్రవర్తించారు కదా – ఇప్పుడు ఎందుకు ఎకామడేట్ చేయాలి అని ఆలోచించే నైజం కానే కాదు. ఇది చాలా విస్మయం కలిగించే లక్షణం అయినా, నాయకుడి ఉదారత్వాన్ని బయట పెడుతుంది.

చంద్రబాబు పని ఐపోయింది అని జోస్యాలు చెప్పినవారి పని అయిపోయింది కానీ ఆయన ఇంకా పనిని కొనసాగిస్తునే ఉన్నారు. దానికి కారణం సంతోషం కలిగితే ఎగిరెగిరి పడటం – కష్టం వస్తే కృంగిపోవటం ఆయన నిఘంటువులో లేనే లేదు.

ఇతరుల ఆలోచనలలోని విజ్ఞతను గ్రహించి, నిర్ణయాలు తీసుకోటానికి వెనకడుగు వేయకుండా ప్రదర్శించిన ఆయన నైజం ఒకటి రెండు సంఘటనలల్లో గుర్తుకొస్తున్నది.

పరిటాల రవిని హత్య చేసిన ముద్దాయి మొద్దు శీను ఉన్న జైలు చూసి అప్పటి ప్రభుత్వం మీద ఆరోపణలు చేసి రాజకీయ లబ్ధి పొందవచ్చు అని ఒకరిద్దరు సలహాయిస్తే – అందుకు ఒప్పుకోక పోగా, అలాంటి పరిసరాలు తన లాంటి నాయకుడు చూడాల్సిన అగత్యం లేదని ఖండితంగా చెప్పారు. ఇతరులు ఆస్తులు ప్రకటించినా, ప్రకటించకపోయినా, వారితో నిమిత్తం లేకుండా ఆ పని తాను స్వచ్ఛందంగా చేయటాన్ని కొందరు అవసరం లేదని చెప్పినా, నైతిక విలువలకు కట్టుబడి వుండాల్సిన బాధ్యతతో ఆ పని చేశారు. ఇలాంటివి చాలా ఉన్నాయి ఆయన సుదీర్ఘ రాజకీయ జీవనయానంలో!

తనకోసం ముఖ్యమంత్రి కావటం ఆయన లక్ష్యం కాదు. కకావికలైన ఆంధ్రప్రదేశ్‌ను గాడిలో పెట్టే లక్ష్యంతో ఏపీలో కూటమిని గెలిపించారు. రాజకీయాలలో ఎన్నో ఎత్తు పల్లాలు వుంటాయి. కానీ చంద్రబాబు రాజకీయ చరిత్రలో సంభవించిన ఇలాంటి ఎత్తును మరొకరు సాధించలేరు. ఫలాలు ఉన్న చెట్టుకే దెబ్బలు తగులుతాయి. అంతమాత్రాన ఆ చెట్టు ఫలాలు అందించటం మానదు. చెట్టు తనకు నీడ ఉందా అని ఎన్నడూ చూసుకోదు. అందరికీ నీడనివ్వటమే చెట్టు సహజ లక్షణం. సుపరిపాలన ధ్యేయంతో శ్రమించటమే చంద్రబాబు సహజ గుణం!

• రావులపాటి సీతారాంరావు

నరేంద్ర మోదీ శకానికి విరామం!

గొప్ప అభినయం, సుమధుర సంగీతం, కన్నుల పండువ చేసే దృశ్యాల ఇంద్రజాలం ఉన్న సినిమాను వీక్షించడంలో ఉన్న మహదానందాలలో ఒకటి దాని విరామ సమయం. కథా గమనం నాటకీయమైన పతాక స్థాయికి చేరిన క్షణాన ఆ విశ్రాంతి రావడం కద్దు. ఆ విరామ కాలంలో మనం వెండి తెర వెలుగు జిలుగులు, మనలను ఆవరించి ఉన్న చీకటి నుంచి బయటకు వచ్చి సహజ కాంతిని అనుభూతిస్తాం, ఒక ఆశాభావంలోకి ప్రవేశిస్తాం. భారతదేశ ఎన్నికల రాజకీయాలు కూడా చాలా అవసరమైన ఒక విరామ దశలోకి ప్రవేశించాయి. నిరంతర రాజకీయ విన్యాసాలు; హిమలయోన్నత శిఖరాల పైన, హిందూ మహాసముద్ర అగాధాలలోను ప్రతిధ్వనించిన గారడీ మాటలతో ఊగిపోయిన భారతీయ సమాజానికి అటువంటి విశ్రాంతి లభించింది. నరేంద్ర మోదీ 2014లో ప్రధానమంత్రి పదవిని అధిష్ఠించిన నాటి నుంచీ వార్తా జగత్తు అవిరామంగా, అసాధారణంగా ప్రజలను ఆవహించడం ప్రారంభమయింది. నోట్ల రద్దు నుంచి లాక్‌డౌన్‌ల దాకా, పార్లమెంటరీ సస్పెన్షన్ల నుంచి రైతుల నిరసనల వరకు ఊపిరి పీల్చుకునే వ్యవధే ప్రజలకు లేకుండా పోయింది. ఎట్టకేలకు ఓటర్ మహరాజు Pause బటన్ నొక్కాడు. ఇది పూర్ణ విరామం కాదు, తాత్కాలిక విరామం మాత్రమే.

ఈ కారణంగానే 2024 సార్వత్రక ఎన్నికలలో ప్రజా తీర్పును అనుచితంగా అర్థం చేసుకోవడం పెద్ద పొరపాటు అవుతుంది. ప్రధానమంత్రి ఇప్పటికీ తిరుగులేని, నిరాక్షేపణీయ నాయకుడు అని నరేంద్ర మోదీ అభిమానులు నొక్కి చెబుతున్నారు. గత మూడు దశాబ్దాలలో ఏ సార్వత్రక ఎన్నికలలోనైనా కాంగ్రెస్‌కు లభించిన సీట్ల కంటే ఈ సారి బీజేపీకి దక్కిన 240 సీట్లు చాలా అధికమని వారు గంభీరంగా ఉద్ఘాటిస్తున్నారు. సరే, మోదీ వ్యతిరేకులు ఇది అధికారంలో ఉన్న ప్రభుత్వానికి, దాని అధినేతకు వ్యతిరేకంగా వచ్చిన ప్రజా తీర్పు అని ఘంటాపథంగా ఘోషిస్తున్నారు. 400కు పైగా సీట్లు గెలుచుకుంటామని పదే పదే ప్రకటించిన పార్టీ అంతిమంగా కనీస మెజారిటీ (272 సీట్లు)ని అయినా పొందలేకపోవడాన్ని వారు అపహసిస్తున్నారు. సత్యమేమిటి? అది సహజంగా ఈ రెండు వాదనల మధ్య ఉన్నది.

భారతీయ జనతా పార్టీ రాజకీయ అశ్వమేధయాగం చేస్తోంది. అధికార పీఠాలను కైవసం చేసుకుంటూ ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి జయప్రదంగా పురోగమించడమే ఆ రాజకీయ యజ్ఞం. సందేహం లేదు, ఇప్పుడు సార్వత్రక ఎన్నికల ఫలితాలతో అది నిలిచిపోయింది. సగటు పౌరులు అసామాన్య ఓటర్లుగా ప్రభవించిన పర్యవసానమది. మూడు అతి పెద్ద రాష్ట్రాలు– ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్– లలో భారతీయ జనతా పార్టీ ఓట్లు, సీట్ల సాధనలో ద్వితీయ స్థానానికి జారిపోయింది. ఎక్కడ తప్పటడుగు వేశామన్న విచికిత్స, ఆరోపణ ప్రత్యారోపణల మధ్య ఒక వాస్తవం రాజకీయులకు, సామాన్య ప్రజలకు అర్థమయింది: అత్యంత శక్తిమంతమైన పార్టీ ఎన్నికల చాణక్యాలు ఇంకెంత మాత్రం అజేయమైనవి, కార్యసాధకమైనవి కాదు. ప్రధాన మంత్రి ప్రభావ తేజం సైతం మసకబారింది. నాయకత్వం విషయమై ఉత్తరప్రదేశ్‌లో నరేంద్ర మోదీ కంటే రాహుల్ గాంధీ వైపే ప్రజల మొగ్గు స్పష్టంగా ఉందని సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ నిర్వహించిన ఒక పోస్ట్-పోల్ సర్వేలో వెల్లడయింది. గత దశాబ్ద కాలంలో ఒక ప్రధాన హిందీ భాషా రాష్ట్రంలో మోదీకంటే రాహుల్‌కు ఆధిక్యత లభించడం ఇదే మొదటిసారి.

అయినప్పటికీ కాంగ్రెస్ దేశవ్యాప్తంగా సీట్ల సంఖ్యలోనూ,



> భారతీయ ఓటరు ఇప్పుడు ఘర్షణ కంటే ఏకాభిప్రాయాన్ని, అహంకృత వ్యవహారశైలి కంటే మనసా వాచా కర్మణా మర్యాదపూర్వక ప్రవర్తనా రీతిని, ఏకరూపత కంటే వైవిధ్యాన్ని గట్టిగా కోరుకుంటున్నాడు. అతడి అభిలాష సార్వత్రక ఎన్నికల ఫలితాలలో ప్రతిబింబించింది. ఈ అసాధారణ ప్రజా తీర్పును గౌరవించి, దానికి అనుగుణంగా వ్యవహరించే వివేకాన్ని పాలక, ప్రతిపక్షాలు విధిగా అలవరచుకోవాలి. వాటికి అటువంటి విజ్ఞత కొరవడిన పక్షంలో ఇప్పటికే సహనం కోల్పోతున్న ఓటరు మళ్లీ తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా వ్యక్తం చేస్తాడు.

ఓట్ల వాటాలోను బీజేపీ కంటే వెనుకబడే ఉన్నది. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ప్రత్యక్ష పోటీల్లో కాంగ్రెస్, బీజేపీల మధ్య సీట్ల వ్యత్యాసం ఐదు సంవత్సరాల క్రితం వలే భారీగా లేనప్పటికీ ఆ తేడా బీజేపీకి అనుకూలంగా ఉన్నది. ఇటీవలి సార్వత్రక ఎన్నికలలో ప్రత్యక్ష పోటీ జరిగిన నియోజకవర్గాలలో బీజేపీకి 157 దక్కగా కాంగ్రెస్ కేవలం 51 స్థానాలలో మాత్రమే విజయం సాధించింది. కాంగ్రెస్ నిజంగా ఆధిక్యత సాధించిన రాష్ట్రం కేరళ ఒక్కటే. అయితే ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థి వామపక్షమే కానీ బీజేపీ కాకపోవడం గమనార్హం. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్‌లలో సీట్లు, ఓట్ల సాధనలో కాంగ్రెస్ ముందంజ వేయలేకపోయింది.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

సీట్లు, ఓట్ల అంకగణితం 2024 ఎన్నికల కథలో ఒక భాగాన్ని మాత్రమే చెప్పింది. నరేంద్ర మోదీ జనసమ్మోహన శక్తి, 'మోదీకీ గ్యారంటీ'లో ప్రజల అచంచల విశ్వాసమే ఈ సార్వత్రిక ఎన్నికలలో బీజేపీకి అనుకూలంగా నిర్ణయాత్మక తీర్పును సాధిస్తాయని అధికార పార్టీ శ్రేణులు భావించాయి. నిశ్చింతగా ఉన్నాయి. సరిగ్గా ఇక్కడే బీజేపీ ప్రచార సారథులు పొరపడ్డారు. భారత్ లాంటి సువిశాల, వైవిధ్యభరిత దేశంలో ఏ వ్యక్తీ దాని ప్రజల కంటే గొప్పవాడు కాదనే సత్యాన్ని వారు విస్మరించారు. బీజేపీ అభ్యర్థులలో 100మందికి పైగా ఇతర పార్టీల నుంచి 'దిగుమతి' అయినవారే. 132 మంది సిట్టింగ్ ఎంపీలకు మళ్లీ టిక్కెట్ ఇవ్వడానికి పార్టీ అధిష్ఠానం నిరాకరించింది. ఈ చర్యలు సూచిస్తున్నదేమిటి? 'ఒకే నాయకుడు, ఒకే దేశం' చుట్టూ పరిభ్రమించిన రాజకీయ వ్యూహంపై మితిమీరిన విశ్వాసాన్ని ఉంచడమే కాదూ? తత్కారణంగానే మోదీని చూసే ప్రజలు తమకు ఓటు వేస్తారని బీజేపీ నాయకత్వం విశ్వసించింది. మోదీ మినహా ఇతర అభ్యర్థులు అందరూ రాజకీయ వామనమూర్తులేనని, పార్టీ విజయానికి వారు చేసే దోహదం ఉపేక్షణీయమేనని భావించారు.

మోదీ కేంద్రిత రాజకీయ వ్యవస్థ ఇప్పుడు నిస్సత్తువలో పడిపోయింది. బీజేపీ 'బ్యాంకర్' రాష్ట్రాలు గుజరాత్, మధ్య ప్రదేశ్ మినహా దేశంలోని వివిధ ప్రాంతాల ఓటర్లు మోదీ 'మహిమాన్విత వ్యక్తిత్వం' ప్రభావానికి లోను కావడానికి నిరాకరించారు. తమకు సహాయకారులుగా ఉండే నాయకులను ఎన్నుకోవడానికే వారు ప్రాధాన్యమిచ్చారు. మూడు కీలక నియోజకవర్గాల ఫలితాలే ఇందుకు నిదర్శనం. అవి: వారణాసి, ఫైజాబాద్, బన్‌స్వారా. వారణాసి ప్రధానమంత్రి నియోజకవర్గం. ఈ సారి మోదీ రికార్డు స్థాయి మెజారిటీతో గెలుపొందనున్నారని ఊదరగొట్టారు. అయితే మోదీకి అంతిమంగా లభించిన మెజారిటీ గత ఎన్నికలలో కంటే 3.2 లక్షల మేరకు తక్కువగా ఉన్నది. అయోధ్య ఉన్న నియోజక వర్గం ఫైజాబాద్. గత జనవరిలో రామమందిరం ప్రారంభోత్సవాన్ని కాలం, చరిత్రపై హిందుత్వ శాశ్వత సంతకంగా ప్రపంచానికి చాటారు. చివరకు అక్కడ జరిగిందేమిటి? కొత్తగా రాజకీయలలోకి వచ్చిన ఒక దళిత నాయకుడు వరుసగా రెండుసార్లు లోక్‌సభకు ఎన్నికైన ఒక రాజకీయ ఘనాపాఠీని ఓడించాడు. రాజస్థాన్‌లోని బన్‌స్వారాలో ప్రధాని మోదీ ఉద్దేశపూర్వకంగా మతతత్వ భావోద్వేగాలకు ఊపిరిలూదారు. ముస్లింలకు ఇచ్చేందుకై కాంగ్రెస్ వారు హిందూ స్త్రీల మంగళసూత్రాలను సైతం లాక్కుంటారని మోదీ భయపెట్టారు. అయితే ఆ నియోజకవర్గంలో భారత్ ఆదివాసీ పార్టీకి చెందిన ఒక యువ గిరిజన నాయకుడు జయపతాక నెగురవేశాడు.

నరేంద్ర మోదీ రాచరిక తరహా నిరంకుశత్వానికి ఓటర్లు తీవ్ర విఘాతం కలిగించారు. పదవిని నిలబెట్టుకుని అధికారంలో కొనసాగుతున్నప్పటికీ ఆయన రాజకీయ, నైతిక పలుకుబడి క్షీణించింది, సందేహం లేదు. అయితే మోదీ శకం ముగియలేదు, అలసిన, విసిగి వేసారిన ఓటర్ మహాశయుడు బలవంతంగా దానికి విరామం కల్పించాడు. కేంద్రంలో ప్రస్తుతం అధికారానికి వచ్చింది సంకీర్ణ ప్రభుత్వమే అయినా ఇదివరకటి సంకీర్ణ ప్రభుత్వాలలో వలే కాకుండా ఈ సర్కార్ సారథ్య స్థానంలో ఒక శక్తిమంతమైన పార్టీ ఉన్నది. ఇటీవలి సార్వత్రక ఎన్నికలలో బీజేపీ 63 సీట్లను కోల్పోయినప్పటికీ వాస్తవంగా గతంలో కంటే 69 లక్షల ఓట్లను అధికంగా గెలుచుకున్నది. నిర్ణయాలను ఏకపక్షంగా తీసుకునే తీరుతెన్నుల స్థానంలో మరింతగా సర్దుకొనిపోయే రీతిలో పాలనా బాధ్యతలు నిర్వహించే పద్ధతి అమలులోకి రావచ్చుగానీ ఆ మార్పు ఎంతకాలం అనేది చర్చించదగిన అంశం.

సరే, తరువాత ఏమి జరగబోతోంది? ఇది బీజేపీ మిత్రపక్షాల చేతుల్లో లేదు. సంకీర్ణ ప్రభుత్వ భాగస్వామ్య పక్షాలలో చాలా వాటికి పరిమిత ప్రత్యామ్నాయాలు మాత్రమే ఉన్నాయి. కనుక అవి అధికార కూటమిలో తప్పక కొనసాగుతాయి. చెప్పవచ్చిందేమిటంటే ప్రజాతీర్పు పట్ల అపరిమితంగా ఆనందపడుతున్న ప్రతిపక్షాలే తదుపరి నిర్ణయాత్మక అంకానికి తెరలేపాలి. పది సంవత్సరాలుగా మోదీ సర్కార్ చేతుల్లో అవి చావుదెబ్బలు తింటూ వస్తున్నాయి. వివిధ పార్టీలు చీలిపోయాయి. పలు పార్టీల నాయకులను దర్యాప్తు సంస్థలు అదే పనిగా వెంటాడాయి. వారిలో కొంత మందిని జైలుకు కూడా పంపించారు. పార్లమెంటును కేవలం ఒక నోటీస్‌బోర్డ్‌గా కుదించివేశారు. ఎన్నో అవాంతరాలు, అనేక అవస్థలను అధిగమించి ప్రతిపక్షాలు ఎట్టకేలకు ప్రజల మద్దతును కూడగట్టుకున్నాయి, పార్లమెంటులో సంఖ్యా బలాన్ని పెంచుకున్నాయి. జాతీయ భద్రత, ప్రజా శ్రేయస్సుకు సంబంధించిన విషయాలలో తమ వాణిని నిర్ణాయకంగా వినిపించగల సామర్థ్యాన్ని సాధించుకున్నాయి. వివేకశీలురు అయిన ఓటర్లు వినయం, వినమ్రతతో పాలన చేసే ప్రధానమంత్రిని మాత్రమే కోరుకోలేదు; ఒక పటిష్ఠ ప్రతిపక్షం కోసం కూడా వారు ఆరాటపడ్డారు. ప్రజల సమస్యల పరిష్కారానికి మరింత శ్రద్ధాసక్తులు, సమన్వయంతో నిర్మాణాత్మకంగా కృషి చేసే ప్రతిపక్షం పార్లమెంటులో ఉండాలని వారు సంకల్పించారు. సార్వత్రక ఎన్నికలలో ఓటింగ్ తీరు తెన్నులు ఆ సంకల్పానికి అద్దం పట్టలేదా?

మోదీ శకానికి విరామ దశ ఎంతకాలం కొనసాగుతుందన్న విషయమై స్పష్టత లేదు. తదుపరి విడత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై అది ఆధారపడి ఉంటుంది. అయితే భారతీయ ఓటరు ఇప్పుడు ఘర్షణ కంటే ఏకాభిప్రాయాన్ని, అహంకృత వ్యవహారశైలి కంటే మనసా వాచా కర్మణా మర్యాదపూర్వక ప్రవర్తనా రీతిని, ఏకరూపత కంటే వైవిధ్యాన్ని గట్టిగా కోరుకుంటున్నాడు. అతడి అభిలాష ఎన్నికల ఫలితాలలో ప్రతిబింబించింది. ఈ అసాధారణ ప్రజా తీర్పును గౌరవించి, దానికి అనుగుణంగా వ్యవహరించే వివేకాన్ని పాలక, ప్రతిపక్షాలు విధిగా అలవరచుకోవాలి. వాటికి అటువంటి విజ్ఞత కొరవడిన పక్షంలో ఇప్పటికే సహనం కోల్పోతున్న ఓటరు మళ్లీ తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా వ్యక్తం చేస్తాడు. అనిశ్చితంగా ఉన్న భారత రాజకీయ చిత్రం రెండో సగ భాగం ఇంకా మొదలు కాలేదు మరి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

రాజ్యాంగానికి వెన్నెముక 'పీఠిక'

భారత రాజ్యాంగానికి ప్రాణం, వెన్నెముక, కళ్ళు, మెదడు అన్నీ దాని పీఠికే. భారతదేశాన్ని 'సర్వసత్తాక సామ్యవాద, మతసామరస్య ప్రజాస్వామిక రిపబ్లిక్' అని మన రాజ్యాంగ పీఠిక పేర్కొంటోంది. 1949 నవంబరు 26న ఆమోదించిన రాజ్యాంగ పీఠికలో 'సర్వ సత్తాక ప్రజాస్వామిక రిపబ్లిక్' అని మాత్రమే ఉందన్నది వాస్తవం. 'సామ్యవాద, మతసామరస్య' స్వభావాలు మొదట్లో లేవు; ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ కాలంలో 1976 డిసెంబరు 18న 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 'సామ్యవాద, మతసామరస్య' స్వభావాన్ని అడ్డంగా చేర్చారనే వాదనను బీజేపీ చాలా కాలంగా చేస్తోంది. తాము ఇక్కడవున్నది రాజ్యాంగాన్ని మార్చడానికే అని చెప్పిన నాయకులూ ఆ పార్టీలో కొందరున్నారు. దీనికి విరుద్ధమైన వాదన కూడా బలంగానే వుంది. ప్రజాస్వామ్యానికి విస్తృత అర్థమే 'సామ్యవాద, మతసామరస్య' భావనలని గట్టిగా వాదిస్తున్నవారూ ఉన్నారు. రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలు 'తమకుతాము' ఇచ్చుకున్న హామీల్లో, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం ఉన్నాయి. వీటిల్లోనూ అంతర్లీనంగా 'సామ్యవాద, మతసామరస్య' భావనలున్నాయి.



'న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావాలు' భారత సాంప్రదాయం కాదనీ వాటిని బయటి దేశాల నుంచి అరువు తెచ్చి రాజ్యాంగంలో బలవంతంగా జొప్పించారని అప్పట్లోనే ఆరెస్సెస్ వంటి సంస్థలు గట్టిగానే విమర్శించాయి. వాటికన్నా మనుస్మృతియే మన సమాజానికి సరిగ్గా సరిపోతుందని బలంగా వాదించాయి.

'న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావాలు' ఎక్కడి నుండి వచ్చాయి? వాటిని ఎవరు తెచ్చారూ? అనే విషయంలోనూ భిన్నాభిప్రాయాలున్నాయి. 1789 నాటి ఫ్రెంచ్ విప్లవంలో ఈ నినాదాలు మార్మోగాయి. అయితే తాను బుద్ధుని బోధనల నుంచి ఈ నాలుగు ఆదర్శాలను స్వీకరించినట్టు గొప్ప దార్శనికులు, భారత రాజ్యాంగ రచనా సంఘం అధ్యక్షులు బి.ఆర్. అంబేడ్కర్ ఓ సందర్భంలో పేర్కొన్నారు. ఫ్రెంచ్ విప్లవ నినాదాలను జవహర్‌లాల్ నెహ్రూ సైతం విపరీతంగా అభిమానించేవారు.

రెండవ ప్రపంచ యుద్ధం ముగిశాక ఇండియాకు స్వాతంత్ర్యం ఇచ్చేందుకు బ్రిటీష్ ప్రభుత్వం ఆమోదించింది. బ్రిటీష్ ఇండియాను స్వతంత్ర ఇండియాగా మార్చే ప్రక్రియను సజావుగా సాగించడానికి 1946 సెప్టెంబరు 2న భారత తాత్కాలిక ప్రభుత్వం (Provisional Government of India) ఏర్పడింది. అదే రాజ్యాంగ సభగానూ పనిచేసింది. భారత తాత్కాలిక ప్రభుత్వానికి అధినేతగా ఉండిన జవహర్‌లాల్ నెహ్రూ 1946 డిసెంబరు 13న రాజ్యాంగ లక్ష్యాల తీర్మానాన్ని (Objectives Resolution) ప్రవేశపెట్టారు. దాన్ని 1947 జనవరి 22న రాజ్యాంగ సభ ఆమోదించింది. ఈ తీర్మానంలోనే న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావాలు అనే ఆదర్శాలు చాలా వివరంగా వున్నాయి.

పౌరసత్వ సవరణ చట్టానికి (సిఏఏ) వ్యతిరేకంగా 2019 చివర్లో ఢిల్లీ శివార్లలోని షాహీన్‌బాగ్‌లో ఉద్యమం ఆరంభమయినప్పుడు భారత రాజ్యాంగమే ఆధునిక 'మతగ్రంథం'గా మారిపోయింది. ఆందోళనకారులైన ముస్లిం మహిళలు ఒక చేత్తో మువ్వన్నెల జాతీయ జెండాను పట్టుకుని మరో చేతిలో భారత రాజ్యాంగాన్ని గుండెలకు హత్తుకుని, ఒళ్ళో గాంధీజీ, అంబేడ్కర్ల ఫొటోలు పెట్టుకుని 'న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం' అంటూ నినదించారు.

'భారత రాజ్యాంగ పీఠిక' చారిత్రక ప్రాధాన్యాన్నీ, ప్రాసంగికతను గుర్తించి ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ ఈ పుస్తకాన్ని రాశారు. రాజ్యాంగానికి సంబంధించిన అనేక పార్శ్వాలను 18 పర్వాల్లో ఇందులో ఆవిష్కరించారు. భారత రాజ్యాంగం మీద రాయడానికి సరైన ఛాయిస్ మాడభూషి శ్రీధర్ అయితే, ఈ పుస్తకాన్ని ప్రచురించడానికి విజయవాడ 'శ్రీశ్రీ' విశ్వేశ్వరరావు కూడా అంతే సరైన ఛాయిస్. విశ్వేశ్వరరావు ప్రచురణలు సోషల్ బారోమీటర్స్.

'భారత రాజ్యాంగ పీఠిక' పుస్తకాన్ని జూన్ 15 శనివారం సాయంత్రం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ఆవిష్కరిస్తారు. కె. రామచంద్రమూర్తి సభాధ్యక్షులు, ఎమెస్కో విజయ కుమార్ ఆత్మీయ అతిథి.

– డానీ

నేతలు మారారు సరే, మరి ఆ యంత్రాంగం?

పూర్వం పెద్ద పెద్ద కట్టడాలను కూల్చేయాలంటే రకరకాల పేలుడు పదార్థాలు వాడి కూల్చేసేవాళ్ళు అవి తునాతునకలై పేలిపోయేవి. ఇటీవల కాలంలో ముంబై మొదలైన చోట్ల పెద్ద కట్టడాలని కూల్చాల్సి వచ్చినప్పుడు ఇంప్లోజివ్ పద్ధతిలో కూల్చేస్తున్నారు. ఎంత పెద్ద కట్టడమైన ఈ పద్ధతి వలన కుప్పకూలిపోతుంది. సరిగ్గా ఈ అయిదేళ్ల జరిగిన కథలో ప్రభుత్వ వ్యవస్థలు అలాగే నిట్ట నిలువునా కుప్పకూలిపోయాయి. ప్రభుత్వ యంత్రాంగం, అధికారులు గింజల కోసం ఎగబడే పావురాల్లాగా మారిపోయారు. ఇలా అలవాటు పడిన పావురాలు, ఎవరు గింజలు చల్లుతారో అని చూస్తాయే కానీ, వాటంతట అవి ఎగరడం మర్చిపోతాయి. వాటికి రెక్కలు ఉన్నాయని స్వాతంత్ర్యం ఉందని మర్చిపోతాయి. ఇది ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో యంత్రాంగం పరిస్థితి.

బోలెడన్ని కనిపించీ కనిపించని నిర్బంధాల మధ్య, ఏడుపులూ మొత్తుకోళ్ళ మధ్య గుండె మీద బండరాయి లాంటి ప్రభుత్వాన్ని ఒక్క ఓటు పోటుతో జనం విసిరి అవతల పడేసారు. అధికారం ముందు, దర్పం ముందు ప్రజలు వామనుడల్లే కనిపించినట్లున్నా అవసరం అయినప్పుడు పరాక్రమించారు. అయితే అధికార మదంతో ఇన్నాళ్లు అచ్చోసినట్టు తిరిగిన అధికారుల వ్యవస్థ, అలాగే ఉంది. ఈ సందర్భంలో నా సీనియర్ కొలీగ్ ఒకాయన 'నక్సలైట్లు రాజ్యానికి వచ్చినా మనమే పరిపాలిస్తాం', అని చెప్పిన మాట గుర్తుకు వస్తుంది. ప్రభుత్వ నేతలు మారి యంత్రాంగం మారకపోతే చాలా విపరీత పరిణామాలు తలెత్తే అవకాశం ఉంది.

> బోలెడన్ని కనిపించీ కనిపించని నిర్బంధాల మధ్య, ఏడుపులూ మొత్తుకోళ్ళ మధ్య గుండె మీద బండరాయి లాంటి ప్రభుత్వాన్ని ఒక్క ఓటు పోటుతో జనం విసిరి అవతల పడేసారు. అధికారం ముందు, దర్పం ముందు ప్రజలు వామనుడల్లే కనిపించినట్లున్నా, అవసరం అయినప్పుడు పరాక్రమించారు. అయితే అధికార మదంతో ఇన్నాళ్లు అచ్చోసినట్టు తిరిగిన అధికారుల వ్యవస్థ అలాగే ఉంది.



గత అయిదేళ్లలో చిన్న సమస్యలు పెద్ద అధికారులే దగ్గరుండి చేయాల్సి పరిష్కరించాల్సి వచ్చింది. ఉదాహరణకు ఏదైనా ఒక వ్యక్తికి భద్రతకు, స్వేచ్ఛకు భంగం, ఆస్తికి నష్టం కలిగితే, దానికి కారణం అయిన వాళ్ళ మీద చర్య తీసుకోమని పోలీస్ స్టేషన్‌కి వెళ్తే సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి పరిష్కరించాల్సిన విషయం ఐజీలు, డీజీల వరకు వెళ్ళేది. ఉదాహరణకు అసలు ఎఫ్ఐఆర్ కట్టాలా అక్కర్లేదా, నిందితుడిని అదుపు చేయాలా అక్కర్లేదా అనే నిర్ణయాలు; చట్ట రీత్యా విధులు నిర్వహించాల్సిన అధికారికి ఉత్తర్వులు పంపటం స్థానిక ఎమ్మెల్యేలూ, వారి వ్యక్తిగత సిబ్బంది చేతుల్లో ఉండేది. కరోనా సమయంలో మూతికి మాస్క్ అడిగిన డాక్టర్లని, మా అక్కని ఏడిపించకండి అని మామూలుగా వేడుకున్న తమ్ముడిని పొట్టన పెట్టుకున్నది వ్యవస్థ. చాలా సందర్భాలలో న్యాయం చేయాల్సిన వాళ్ళే అన్యాయం చేయడం కన్ను రెప్పే కంటిని మింగేయడం చూసాం.


రెవెన్యూ లెక్కల్లో, మన భూమి తక్కువగా కనపడినా, మన భూమిని నిషేధ జాబితాలో చూపించినా వీఆర్ఓ మరీ మీదుమిక్కిలి అయితే తాసిల్దార్ స్థాయిలో కావాల్సిన పని కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్ల స్థాయిలో కూడా కాకపోవడం, ఎవరూ పట్టించుకోకపోవడం యంత్రాంగాలు కుప్పకూలాయి అనడానికి ఉదాహరణలు. ముఖ్యంగా మండల స్థాయిలో ఉన్న తాసీల్దార్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు లాంటి అధికారులు అందరూ ఎమ్మెల్యే కనుసన్నల్లోనే పోస్టింగ్‌లు, బదిలీలు పొందారు. అందువల్ల ఆ మండలంలో లక్ష మంది జనం ఎటుపోయినా పర్లేదు. ఎమ్మెల్యే చల్లని చూపు మన మీద ప్రసరిస్తే చాలు లాంటి ఒక అభయ స్థితి ఏర్పడింది. అసలు ప్రభుత్వ ఖజానా నుంచి తీసుకునే జీతాలకు, ప్రజల కోసం వారు చేయాల్సిన సేవలకు మధ్య ఉన్న నిత్య సత్య సంబంధం తెగిపోయింది. ప్రజలని, ప్రజాసమస్యలని నేరుగా వినడం, స్పందించడం, పరిశీలించడం మానేశారు. ఆ రకంగా జవాబుదారీతనానికి దూరంగా అధికారులు వెళ్లిపోయారు. స్థానిక మంత్రులు, ఒక గుప్పెడు ఎమ్మెల్యేలు ఎలా చెప్తే అలా నడుచుకునే స్థితి వచ్చింది. సచివాలయ స్థాయిలో పాలసీలతో, చట్టాలతో సంబంధం లేకుండా వివిధ నియామకాలు, బదిలీలు జరిగాయి. నిధుల విషయానికి వచ్చేటప్పటికి ప్రాధాన్యతలు అనేక వివక్షల మధ్య కొనసాగాయి. ఇంకో వైపు సమాజంలో ప్రజాస్వామిక విధి విధానాలు – చర్చలు, విమర్శలు, నిరసనలు ప్రతిదీ – నిర్బంధానికి గురయ్యాయి. ప్రజాస్వామ్యం కత్తుల బావిలో పడిపోయింది. ఇదే సందర్భంలో యువతకు సరైన మార్గనిర్దేశం చేతినిండా పని కల్పించని స్థితి వల్ల గంజాయి మొదలైన మత్తు పదార్థాలు సమాంతర ఉపాధి అవకాశాలుగా మారాయి. కొంతమంది దానికి బలైపోయారు.

పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణం, పిల్లలకు కంప్యూటరు టాబ్స్, యూనిఫారాలు మొదలైనవి బహిరంగంగా కనిపించే మార్పులు కానీ, అసలు చదువుకునే పిల్లలు విద్య విజ్ఞానాలతో విలువలతో సంస్కారంతో వివేకంతో ఎదగవలసింది తరగతి గదిలో. తరగతి గది బడికి అంతరంగం. ఇప్పటి వరకూ బహిరంగంలో కనిపిస్తున్న మార్పులు, తరగతి గదుల దాకా రాలేదు. సర్వ రోగ నివారిణిగా ఇంగ్లీష్ మీడియాన్ని ప్రచారం చేయడం వల్ల చాలా అనర్థాలు జరిగాయి. అధ్యాపకుల శక్తియుక్తులని పెంచకుండా బయట మార్పుల వల్ల ఒరిగేది ఏం లేదు. తెలుగు మీడియంలో ఒక్కసారి వింటే మళ్ళీ చదవాల్సిన అవసరం లేకుండా పాఠం చెప్పే ఉపాధ్యాయులు పూర్తిగా తడబడ్డారు. పిల్లలకు ఇటు విషయ పరిజ్ఞానం లేదు. అటు భాష పరిజ్ఞానం పెరగలేదు.

పరిపాలన అనేది ప్రభుత్వం చేసే ఒక రహస్య కార్యకలాపం కాదు. కానీ కొన్ని జీవోలు, కొన్ని ప్రభుత్వ ఉత్తర్వులు ఆన్‌లైన్‌లో ఉంచకుండానే ప్రభుత్వం నడిచిపోయింది. తొలి గెజిట్ కాలం నుండి ఇప్పటివరకు ప్రతి జీవో ప్రజోపయోగం కోసం. కానీ, కొన్ని జీవోలు మాత్రం కొంత మంది ఉపయోగం కోసం కావడం వల్ల ఆన్‌లైన్‌లో వెలుగు చూడలేదు.

ఈ పరిస్థితిని సరిచేయాలంటే, పోస్టింగ్‌లు, బదిలీలు మొదలైనవి పక్షపాతం, భయం లేని అధికారులకు అప్పచెప్పి, యంత్రాంగాన్ని స్థానిక నాయకుల కబంధ హస్తాల నుంచి విముక్తం చేయాలి. ప్రశ్నించే ఆలోచించే విశ్లేషించే ప్రజాస్వామిక వాతావరణాన్ని పునర్నిర్మించాలి. అన్ని స్థాయిల్లో యంత్రాంగం స్వేచ్ఛగా, స్వచ్ఛంగా పని చేసే వాతావరణం కల్పించాలి. అన్ని స్థాయిల్లో నాయకులు ప్రజాహితం పరమావధిగా ప్రజాస్వామిక దృష్టి ఆచరణగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. కొత్త ప్రభుత్వం నుంచి ప్రజలు పెన్షన్ల లాంటి చిన్న విషయాల కన్నా సామాన్యుడిని గౌరవించగలిగే గొప్ప స్థితిని కోరుకుంటున్నారు.

■ నందివెలుగు ముక్తేశ్వరరావు
విశ్రాంత ఐఏఎస్ అధికారి



● అమ్మ దర్శనం



సీఎం చంద్రబాబు దంపతులకు దుర్గమ్మ చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో కేఎస్ రామారావు. చిత్రంలో ఎంపీ కేశినేని చిన్ని, మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు

సంతోషాలపై సంతకాలు



రెండు జిల్లాల్లో ఆనందాన్ని నింపిన చంద్రబాబు హామీలు

ఐదు సంతకాలతో దాదాపు ఆరు లక్షలమందికి లబ్ధి

4.78 లక్షల మంది పింఛన్‌దారుల్లో సందడే సందడి

50 వేల మంది ఆకలి తీర్చనున్న అన్న క్యాంటీన్లు

60వేల పైచిలుకు నిరుద్యోగులకు మెగా డీఎస్సీ వరం

సంతకాలు ఐదే.. కానీ, ఆరు లక్షల మంది ఆకాంక్షలకు అవే ఆశాదీపికలు.. అన్నీ తొలి సంతకాలే.. కానీ, ఐదేళ్లుగా పడుతున్న వెతలను తీర్చే సంకేతాలు.. ముదుసలుల ఆర్థిక అవసరాలకు అవే అండదండలు.. నిరుద్యోగ యువత భవిత మార్చే కలల వారధులు.. పేదవాడి ఆకలి తీర్చే అక్షయపాత్రలు.. సొంతభూమిపై పెత్తందారుల పెత్తనాన్ని తెగనరికే చురకత్తులు.. ఇన్నాళ్లూ సామాన్యుడు ఆశగా ఎదురుచూసిన పింఛన్ల పెంపు, మెగా డీఎస్సీ నోటిఫికేషన్, స్కిల్ డెవలప్‌మెంట్, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణతో పాటు గత ప్రభుత్వ భూరక్ష పథకాన్ని రద్దు చేస్తూ సీఎం చంద్రబాబు గురువారం తొలి సంతకాలు చేయడంపై రెండు జిల్లాల ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. వీటిద్వారా లబ్ధిపొందే దాదాపు ఆరు లక్షలమంది మోముల్లో చిరునవ్వుల పూలు పూశాయి.
- (విజయవాడ-ఆంధ్రజ్యోతి)

● ఆనందమని 'పింఛెన్'

ఎన్టీఆర్ జిల్లాలో అన్ని రకాల పింఛన్లు పొందే వారి సంఖ్య 2.35 లక్షలు. ప్రతినెలా వీరికి రూ.70.45 కోట్లు వెచ్చిస్తున్నారు. వీరిలో ఎక్కువమంది రూ.3 వేలు పింఛన్ పొందుతుండగా, కొద్దిమంది (40 శాతం కన్నా ఎక్కువ అంగవైకల్యం ఉన్నవారు) దివ్యాంగుల పింఛన్ రూ.4 వేలు పొందుతున్నారు. రూ.3 వేలు పింఛన్‌ను చంద్రబాబు రూ.4 వేలు చేశారు. ఏప్రిల్, మే, జూన్ బకాయిలు రూ.వెయ్యి చొప్పున కలిపి జూలైలో మొత్తం రూ.7 వేలు అందించనున్నారు. దీంతో జూలైలోనే ఎన్టీఆర్ జిల్లాలో పింఛన్లకు రూ.164 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. కృష్ణాజిల్లాలో అన్ని రకాల పింఛన్లు పొందే వారి సంఖ్య 2.42 లక్షలు. ప్రతినెలా వీరికి రూ.71.57 కోట్లు వెచ్చిస్తున్నారు. జూలైలో మొత్తం రూ.167 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది.

● అన్నార్తులకు వరాలు

అన్నార్తుల ఆకలిని తీర్చే అన్న క్యాంటీన్లను అప్పటి టీడీపీ ప్రభుత్వం 2018, జూలై 11న ప్రారంభించింది. పేదోడికి తక్కువ ధరకే కడుపునిండా భోజనం పెట్టాలన్న లక్ష్యంతో ప్రారంభమైన వీటిని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. 2019, జూలై 31 నుంచి మూసేసింది. వాటిలో గ్రామ సచివాలయాలు వంటి వాటిని ఏర్పాటు చేశారు. కొన్నింటిని పాడుబెట్టారు. మూతపడే నాటికి ఉమ్మడి కృష్ణాజిల్లాలో 24 అన్న క్యాంటీన్లు ఉన్నాయి. వాటిలో రోజూ అల్పాహారం కానీ, భోజనాలు కానీ సుమారు 50 వేల మంది చేసేవారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం భోజనాన్ని కేవలం రూ.5కే తినే అవకాశం ఉండేది. వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను రద్దు చేయడంతో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో చాలాచోట్ల టీడీపీ నాయకులు వాటిని సొంత ఖర్చుతో నిర్వహించారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలో టీడీపీ ఎంపీగా గెలుపొందిన కేశినేని చిన్ని సుమారు 50 పైచిలుకు అన్న క్యాంటీన్లను నిర్వహించేవారు. ఉయ్యూరులో టీడీపీ యువ నాయకుడు దండమూడి చౌదరి కూడా అన్న క్యాంటీన్ ద్వారా పేదల కడుపు నింపేవారు. ఎట్టకేలకు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం, మళ్లీ అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై తొలి సంతకం చేయడం పేదల్లో సంతోషాన్ని నింపుతోంది.

● మెగా డీఎస్సీపై చిగురిస్తున్న ఆశలు

వైసీపీ సర్కార్ ఎన్నికలకు కొద్దినెలల ముందు డీఎస్సీ ప్రకటన విడుదల చేసింది. కేవలం 6,100 ఉపాధ్యాయ ఖాళీలతో ఈ ప్రకటన వెలువడింది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల నుంచి సుమారు 60 వేల మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఈలోగా ఎన్నికల కోడ్ రావడంతో డీఎస్సీ నిర్వహణ అటకెక్కింది. తాజాగా చంద్రబాబు సీఎంగా చేసిన తొలి సంతకాల్లో మెగా డీఎస్సీ ఫైలు ఉంది. 16,347 ఉపాధ్యాయ ఖాళీలతో ఈ ప్రకటన విడుదల కానుంది. పెరిగిన పోస్టుల సంఖ్యతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు మరింత మెరుగుపడనున్నాయి.

భూ యజమానుల్లో భయాన్ని పోగొట్టారు



భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయడం ద్వారా సీఎం చంద్రబాబు సామాన్య ప్రజల్లో ఉన్న భయాందోళనను పారదోలారు. ప్రజల రాజ్యాంగ హక్కులను భంగపరిచేలా గత ప్రభుత్వం చేసిన ఈ చట్టం ప్రజల్లో భయాందోళనలకు దారితీసింది. ఈ చట్టం రద్దు కోసం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఎన్నో పోరాటాలు చేసింది.

- సుంకర రాజేంద్ర ప్రసాద్,
ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు

ఇక ఎవరి దగ్గరా చేయి చాపను



చంద్రబాబు తన హామీ నిలబెట్టుకోవడం అభినందనీయం. పింఛన్లను రూ.4 వేలకు పెంచి వృద్ధుల పాలిట పెద్దబిడ్డ అయ్యాడు. ఇకపై చిన్నచిన్న ఖర్చులకు మందులకు ఎవరి దగ్గర చేయి చాపాల్సిన అవసరం లేదు.

- లీల, పాయకాపురం

● అమరావతిలో అపూర్వ స్వాగతం





ఉరుములు.. మెరుపులు..

ఈదురుగాలులు.. భారీ ఉరుములు.. మెరుపులతో గురువారం సాయంత్రం నగరంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయమంతా భానుడి భగభగలతో ఉక్కపోత ఏర్పడగా, సాయంత్రం కురిసిన వర్షంతో కాస్త ఉపశమనం కలిగింది. వర్షం కొద్దిసేపే కురిసినా నగరంలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి.

మోగిన బడిగంట

బడిగంట మోగింది. పాఠశాలల్లో సందడి వాతావరణం కనిపించింది. తొలిరోజే విద్యార్థులు పాఠశాలలకు తరలిరాగా, జిల్లావ్యాప్తంగా 80 శాతం హాజరు నమోదైంది.

జిల్లాలో తొలిరోజే 80 శాతం హాజరు

నేటి నుంచి పాఠ్యపుస్తకాల పంపిణీ



పటమట హైస్కూల్ వద్ద..



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలల వద్ద గురువారం సందడి వాతావరణం కనిపించింది. తొలిరోజే విద్యార్థుల హాజరు 80 శాతం నమోదైందని విద్యాశాఖాధికారులు తెలిపారు. ఇంతకుముందు విద్యార్థులకు జగనన్న విద్యాకానుక ఇచ్చేవారు. కొత్త ప్రభుత్వం దీన్ని స్టూడెంట్స్ కిట్‌గా మార్పు చేసింది. విద్యార్థులకు బ్యాగ్, ఒక జత షూ, బెల్టు, మూడు జతల యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను అందజేస్తారు. ఇప్పటికే ఈ కిట్లు పంపిణీ కేంద్రాల నుంచి జిల్లాలోని అన్ని పాఠశాలలకు చేరుకున్నాయి. విద్యార్థులకు అందజేసే కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు లాంఛనంగా ప్రారంభించారు. కాగా, జిల్లాలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు 4లక్షల87వేల294 పాఠ్యపుస్తకాలు అవసరమవుతాయి. వాటిలో 3లక్షల79వేల864 పుస్తకాలు స్టాక్ పాయింట్లకు చేరుకున్నాయి. ఎనిమిది నుంచి పదో తరగతి వరకు 3లక్షల98వేల172 పాఠ్యపుస్తకాలు అవసరమవుతాయి. వాటిలో 3లక్షల98వేల172 పుస్తకాలు పంపిణీ పాయింట్లకు చేరుకున్నాయి. మొత్తంగా 8లక్షల85వేల466 పుస్తకాలను గాను 7లక్షల78వేల36 పుస్తకాలు వచ్చాయి. ఈ పుస్తకాలు పంపిణీ కేంద్రాల నుంచి మండల స్టాక్ పాయింట్లకు చేరుకున్నాయి. అక్కడి నుంచి పాఠశాలలకు వెళ్తున్నాయి. రెండు, మూడు రోజుల్లో అన్ని పుస్తకాలను అందజేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కాగా, జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు గురువారం విజయవాడలోని పలు పాఠశాలలను తనిఖీ చేశారు.

అయ్యో.. చిన్నారి తల్లి

- 13 ఏళ్లకే కామాంధుడి దాహానికి బలి
- చిన్నవయసులోనే ఓ చిన్నారికి జన్మనిచ్చిన తల్లి
- కీచకుడిపై అలుపెరగని న్యాయ పోరాటం
- ఏడాదిన్నర పాప బాధ్యతలతో సతమతం
- తీవ్ర మానసిక క్షోభకు గురై బలవన్మరణం

పాయకాపురం, జూన్ 13 : కలలు ఉంటాయి. కానీ, కన్నీళ్లు వాటిని మింగేస్తాయి. ఆశలు ఉంటాయి. కానీ, అగచాట్లు వాటిని అధివి ూపెట్టేస్తాయి. చిన్న వయస్సులోనే బతుకు బండలైపోతుంటే.. మృగాళ్ల చేతుల్లో తనువులు గుల్లలవుతుంటే.. పంటి బిగువన బాధను నొక్కిపెట్టి.. కంటిరెప్పల మాటున కన్నీటి సంద్రాలను దాచిపెట్టి.. బతకలేక, చావలేక బతుకుతున్న జీవచ్ఛవాలు ప్రపంచ నలుమూలలా ఉన్నారు. పాయకాపురానికి చెందిన ఈ 'చిన్నారి తల్లి' కథ కూడా అంతే. 13 ఏళ్ల ప్రాయంలోనే కామాంధుడి దాహానికి బలై.. ఓ చిన్నారికి తల్లై.. ఆటపాటల వయస్సులో మానసిక క్షోభకు గురై చివరికి తనువు చాలించిన ఆమె కథ మనసున్న ప్రతి ఒక్కరినీ కదిలిస్తుంది. వివరాల్లోకి వెళితే..



పాయకాపురంలో నివాసముంటున్న ఓ మైనర్ బాలిక (15) రెండేళ్ల క్రితం వన్‌టౌన్ ప్రాంతంలో ఉండేది. తండ్రి లారీడ్రైవర్. తల్లి ఇంటి వద్దే ఉంటుంది. ఆ బాలిక ఎనిమిదో తరగతి చదువుతున్న సమయంలో ఓ కామాంధుడు అత్యాచారం చేశాడు. అప్పట్లో బాలిక ఫిర్యాదు మేరకు పోలీసులు అతనిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఆ తర్వాత తెలిసింది.. అప్పటికే ఆ బాలిక గర్భవతి అని. అవమానాన్ని భరించలేని కుటుంబం పాయకాపురానికి వచ్చేసింది. కొద్దినెలలకే బాలిక ఆడబిడ్డకు జన్మనిచ్చింది. చిన్నవయస్సులోనే తనను ఈ పరిస్థితికి తీసుకొచ్చిన నీచుడిని వదిలిపెట్టకూడదనుకుంది. నిందితుడికి శిక్ష పడేలా చేయాలనే ఆలోచనతో కోర్టుల చుట్టూ తిరిగింది. మరోవైపు పసికందు ఆలనా పాలనా చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి దుస్థితిలో తీవ్ర ఒత్తిడికి గురై ఆరోగ్యం క్షీణించింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఐదు నెలల క్రితం నగరంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించారు. ఇటీవల తిరిగి వచ్చిన బాలిక తీవ్ర మానసిక ఒత్తిడితో గురువారం ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన ఏడాదిన్నర కూతురును అనాథను చేసింది. సమాచారం అందుకున్న నున్న రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మస్తర్ల మాయాజాలం

- మైలవరంలో వెలుగుచూసిన అక్రమాలు
- జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదులు
- వైసీపీ నాయకుల ఇళ్లల్లో, హోటళ్లలో పనిచేసిన వారికి జీతాలు
- విచారణ జరపాలని డిమాండ్

వైసీపీ ప్రభుత్వ హయాంలో మేజర్ గ్రామ పంచాయతీలు అవినీతికి నిలయాలుగా మారాయి. గన్నవరం మేజర్ గ్రామ పంచాయతీలో వెలుగుచూసిన భారీ అవినీతి వ్యవహారాలు మరువకముందే.. తాజాగా మైలవరంలోని మేజర్ గ్రామ పంచాయతీలోని అవినీతి వెలుగులోకి వచ్చింది. పంచాయతీ పారిశుధ్య విభాగంలో మస్తర్ల మాయాజాలం చోటుచేసుకోవటం ప్రకంపనలు సృష్టిస్తోంది. దీనిపై కలెక్టర్ ఢిల్లీరావు, జిల్లా పంచాయతీ అధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. నూతన ప్రభుత్వం ఈ అక్రమాలపై ఉన్నతస్థాయి కమిటీతో విచారణ చేయించాలన్న డిమాండ్ స్థానికంగా వ్యక్తమవుతోంది.

- 6లో..

లైట్ మెట్రో పట్టాలెక్కేనా..?

ఐదేళ్ల తర్వాత చిగురిస్తున్న ఆశలు

ఇన్నాళ్లూ పెండింగ్ పెట్టిన వైసీపీ ప్రభుత్వం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో విజయవాడ లైట్ మెట్రో రైల్ ప్రాజెక్టుపై ఆశలు చిగురిస్తున్నాయి. తుది డీపీఆర్ సిద్ధమైనా వైసీపీ ప్రభుత్వ సమీక్షకు నోచుకోకుండా నాలుగున్నరేళ్లుగా మూలనపడిన ఈ ఫైల్ త్వరలో పట్టాలెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాజధాని మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టుల సమీక్ష సందర్భంగా లైట్ మెట్రో రైల్ ప్రాజెక్టు అంశం కూడా చర్చకు రావటంతో పాటు ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్‌తో త్వరలో సమీక్ష కూడా జరిగే అవకాశం కనిపిస్తోంది. తాజా అంచనా వ్యయంతో సమగ్ర తుది డీపీఆర్‌ను కోరే అవకాశముంది.



తొక్కిపెట్టిన వైసీపీ

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో లైట్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు గ్లోబల్ టెండర్లు పిలవగా, శిస్ట్రా అనే కన్సల్టెన్సీ సంస్థ డీపీఆర్ తయారు చేసింది. దాదాపు రూ.25 వేల కోట్లతో నాలుగు దశల్లో దీన్ని పూర్తి చేయాలనుకున్నారు. నాలుగు కారిడార్లతో మొత్తం 90 కిలోమీటర్ల నిడివితో దీనిని ప్రతిపాదించారు. రాష్ట్ర విభజన అనంతరం విజయవాడకు మెట్రో ప్రాజెక్టును ఇస్తామని ఎన్‌డీఏ ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి మెట్రో రైల్ కార్పొరేషన్ (ఏఎంఆర్‌సీ) ఏర్పాటు చేశారు. అప్పట్లో మీడియం మెట్రో ప్రాజెక్టుకు డీపీఆర్ తయారు చేశారు. టెండర్ల దశకు వెళ్లే క్రమంలో కేంద్రం అనుమతులు ఇచ్చే విషయంలో పేచీలు పెట్టింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం మీడియం మెట్రో ప్రాజెక్టు నుంచి తప్పుకొంది. ఆ తర్వాత లైట్ మెట్రో రైల్ ప్రాజెక్టు దిశగా అడుగులు వేసింది. పీపీపీ విధానంలో చేపట్టాలని నిర్ణయించి డీపీఆర్‌ను తయారు చేయటానికి ఆదేశాలిచ్చింది. అయితే, అప్పట్లో ఏకచత్రాధిపత్యంగా ఎన్‌డీఏ ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వ మాట చెల్లలేదు. ప్రస్తుతం టీడీపీ కూటమి కేంద్రాన్ని శాసించే పరిస్థితి ఉండటంతో లైట్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు పునరుజ్జీవం కలిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి.


చంద్రబాబు, భువనేశ్వరి దంపతులకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చిన్ని దంపతులు

సీఎం దంపతులకు పట్టువస్త్రాల అందజేత

» ఘనంగా సత్కరించిన ఎంపీ కేశినేని చిన్ని, జానకీ లక్ష్మి దంపతులు

వన్‌టౌన్, జూన్ 13 : కనకదుర్గమ్మ దర్శనార్థం సీఎం హోదాలో మొదటిసారి దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి విచ్చేసిన చంద్రబాబు ఆయన సతీమణి భువనేశ్వరిలకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) ఆయన సతీమణి జానకి లక్ష్మిలు పట్టువస్త్రాలు సమర్పించారు. గురువారం అమ్మవారి దర్శనానంతరం ఆశీర్వచన మంటపంలో చంద్రబాబు, భువనేశ్వరి దంపతులకు శివనాథ్ సతీసమేతంగా పట్టువస్త్రాలు, పండ్లు సమర్పించారు. కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, కొమ్మారెడ్డి పట్టాభిరామ్, నాగుల్‌మీరా, ఎంఎస్ బేగ్, కాకు మల్లిఖార్జునయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించిన శివనాథ్ దంపతులు

విజయవాడ కేశినేని శివనాథ్ సతీసమేతంగా గురువారం దుర్గమ్మను దర్శించుకున్నారు. ఎంపీ హోదాలో తొలిసారిగా ఆయన ఆలయానికి విచ్చేయగా ఈవో కేఎస్ రామారావు తదితరులు ఆలయ మర్యాదలు అందజేశారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం, అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం తదితరాలు అందజేశారు. కేశినేని దంపతులు విఘ్నేశ్వరుడిని, దుర్గమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలపై దుర్గమ్మ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా అభివృద్ధి పథంలో పయనించాలని దుర్గమ్మ వారిని వేడుకొన్నట్టు తెలిపారు.

మంత్రి కొల్లు రవీంద్రకు అభినందనలు..

చంద్రబాబు మంత్రివర్గంలో చోటు సంపాదించిన కొల్లు రవీంద్రను కేశినేని శివనాథ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసారు. భాగ్యనగర్ కాలనీలోని మంత్రి నివాసానికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కొమ్మారెడ్డి పట్టాభి రామ్‌లతో కలిసి ఆయన వెళ్లారు. ఈ సందర్భంగా భవిష్యత్తు కార్యచరణపై ముచ్చటించారు.



చంద్రబాబును కలిసిన సీపీఐ నేతలు

విజయవాడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : సీఎంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు నాయుడిని సీపీఐ నేతలు వెలగపూడిలోని సచివాలయంలో గురువారం సాయంత్రం కలిశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యుడు మనోహరనాయుడు కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.


చంద్రబాబు సమక్షంలో సోదరితో కలిసి చెక్కు ఇస్తున్న బుద్దా వెంకన్న

అన్నవితరణకు బుద్దా వెంకన్న విరాళం..

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో అన్నవితరణకు గురువారం దేవస్థానానికి విచ్చేసిన సీఎం చంద్రబాబు సమక్షంలో మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, ఆయన సోదరి జగదీశ్వరిలు రూ. 1,51,116లు చెక్కును విరాళంగా అందజేశారు. ఈవో కేఎస్ రామారావుకు సీఎం ఆ చెక్కును అందజేశారు.

బుద్దా వెంకన్న, నాగుల్‌మీరాకు గజమాలతో సత్కారం

ఎన్నికల్లో ఘన విజయం సాధించి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టినందుకు విజయవాడ హోల్‌సేల్ పూలమార్కెట్ వర్తక సంఘం నాయకులు గురువారం టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, అధికార ప్రతినిధి నాగుల్‌మీరాలను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గుండు అశోక్ కుమార్, కార్యదర్శి విఠల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మీడియా ప్రతినిధులపై సీఐ అత్యుత్సాహం

వన్‌టౌన్, జూన్ 13 : వైసీపీ ప్రభుత్వం మారిన ఇంకా పోలీస్ విభాగంలో కొందరు అధికారులు జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రి అనే భ్రమలోనే ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీసమేతంగా దుర్గమ్మను దర్శించుకోవడానికి దేవస్థానానికి విచ్చేసిన సందర్భంగా కొండపైన స్పెషల్ బ్రాంచ్ సీఐ ఓవర్ యాక్షన్ విమర్శలకు దారితీసింది. దుర్గమ్మ దర్శనానికి ముఖ్యమంత్రి దంపతులు విచ్చేసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు, దేవస్థాన ఈవో కేఎస్ రామారావులతో పాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు భద్రతా ఏర్పాట్లను పరిశీలించి కిందస్థాయి సిబ్బందికి పలు సూచనలు చేశారు. దీనిలో భాగంగానే కొండపై మీడియా పాయింట్‌ను కూడా ఏర్పాటు చేశారు. మీడియా ప్రతినిధులందరూ మీడియా పాయింట్ వద్ద నిలబడి ఉండగా స్పెషల్ బ్రాంచ్ సీఐ వెంకటేశ్వర్లు అత్యుత్సాహం ప్రదర్శించి మీడియా పాయింట్ వద్ద ఎవ్వరూ ఉండవద్దంటూ చెప్పడంతో కొందరు మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. దీంతో ఆయన మరింత ఆవేశంగా మీడియా ప్రతినిధులపై ఊగిపోయాడు. సీఐ మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సేవలోనే ఇంకా తరిస్తున్నారని విమర్శలు వినిపించాయి. ప్రభుత్వం మారినప్పటికీ ఆయన తీరు మారకపోవడం పోలీస్ వర్గంలోనే చర్చానీయాంశమైంది.

కృష్ణానదిలో దూకి మహిళ మృతి



వన్‌టౌన్, జూన్ 13 : కానూరుకు చెందిన ముసునూరి పద్మిని (53) ప్రకాశం బ్యారేజీ కృష్ణా నదీ 55వ ఖానా నుంచి నదీలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. కానూరులో పద్మిని దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఒక కుమారుడు. అమెరికాలో ఉంటున్నాడు. గురువారం మధ్యాహ్నం వరకు పద్మిని ఇంటిలోనే ఉంది. ఆ తరువాత ఆమె తన హ్యాండ్‌బ్యాగ్‌తో బయటకు వచ్చినట్టు సమాచారం. ప్రకాశం బ్యారేజీ 55వ ఖానా వద్ద తనవెంట తెచ్చుకున్న బ్యాగ్‌ను పక్కన పెట్టి బ్యారేజీపై నుంచి నదీలో దూకింది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు ప్రకాశం బ్యారేజీ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులకు తెలియజేశారు. వన్‌టౌన్ పోలీసులు రెస్క్యూ టీం సహాయంతో కృష్ణానదీలో గాలించి పద్మిని మృతదేహాన్ని వెలికితీశారు. బ్యారేజీ వద్ద లభించిన బ్యాగులో ఉన్న ఆధారాల ద్వారా ఆమె భర్త, బంధువులకు సమాచారం తెలియపరిచారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పద్మిని ఆత్మహత్య వివరాలు తెలియాల్సి ఉంది.

షణ్ముఖికి కొరియా కౌన్సిల్ జనరల్ అభినందన



గన్నవరం, జూన్ 13: చంద్రబాబు ప్రమాణాస్వీకారానికి దక్షిణ కొరియా కౌన్సిల్ జనరల్ చాగ్ న్యున్ కిమ్ వచ్చారు. ఆయన్ను గన్నవరానికి చెందిన చిరుమామిళ్ల షణ్ముఖి కొరియా భాషలో పలకరించింది. దీంతో ఒక్కసారిగా ఆశ్చర్యానికి లోనైన చాగ్ న్యున్ కిమ్ కొరియా భాష ఎలా నేర్చుకున్నావని అడిగారు. తనకు ఆ భాషపై మక్కువ ఉండటంతో తల్లిదండ్రులైన సూర్యనారాయణ ప్రసాద్, లక్ష్మీ చేర్పించారని తెలిపింది. పేరు, చదువు గురించి ఆయన కొరియాలో ప్రశ్నించగా ఆమె చక్కగా బదులివ్వడంతో కొరియా భాష బాగా మాట్లాడుతున్నావంటూ చాగ్ న్యున్ కిమ్ అభినందించారు.

దుర్గమ్మ సేవలో కొత్త మంత్రులు..


దుర్గమ్మ దర్శించిన బి.సి జనార్దన్‌రెడ్డి


మంత్రి వంగలపూడి అనిత


మంత్రి గుమ్మడి సంధ్యారాణి

వన్‌టౌన్, జూన్ 13 : దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో కనకదుర్గమ్మ దర్శనార్థం గురువారం పలువురు మంత్రులు విచ్చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, నారా భువనేశ్వరి దంపతులు ఆలయానికి విచ్చేయడంతో పాటు పలువురు మంత్రులు కూడా అమ్మవారిని దర్శించుకోవడానికి రావడంతో ఆలయంలో సందడి వాతావరణం నెలకొంది. కొత్త ప్రభుత్వంలో నూతన మంత్రులు రావడంతో ఆలయ అధికారులు వారి కోసం ఆలయ మర్యాదలను అందించడంలో బిజీ బిజీగా గడిపారు. రాష్ట్ర మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, వంగలపూడి అనిత, బీసీ జనార్ధన్‌రెడ్డిలు వారి వారి కుటుంబసభ్యులతో వేరు వేరుగా అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం వారికి వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఈవో కేఎస్ రామారావు, అధికారులు వారికి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

అమరావతి ఉద్యమం.. గొప్ప జీవిత పాఠం

మాజీఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు


మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

ఉంగుటూరు, జూన్ 13: అమరావతి ఉద్యమం గొప్ప జీవిత పాఠమని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. అమరావతి రైతులు, మహిళలు, ఇతరవర్గాల ప్రజల త్యాగం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్(విజయవాడ చాప్టర్)లో వివిధకోర్సుల్లో స్వయం ఉపాధిశిక్షణ పూర్తిచేసుకున్న యువతీయువకులకు గురువారం ఆయన ధ్రువీకరణ పత్రాలు అందజేసి ప్రసంగించారు. ఈసందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ, అమరావతి రాజధాని కోసం భూములిచ్చిన రైతులు, మహిళలు, ఇతర వర్గాలప్రజలు 1631రోజులపాటు శాంతియుతంగా ఉద్యమం చేయడం గొప్ప విషయం. స్వాతంత్ర్యోద్యమం తర్వాత అంత గొప్పగా జరిగిన ఉద్యమం ఇది. ఎన్ని అడ్డంకులు, ఆటంకాలు ఎదురైనా పట్టుదలతో చారిత్రాత్మక ఉద్యమాన్ని నిర్వహించారు. చివరకు ప్రజల కోరిక నేరవేరడం సంతోషం, అమరావతే రాజధానిగా వుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించిన తర్వాత వారు ఉద్యమదీక్షను ఉపసంహరించుకోవడం అందరూ సంతోషించదగ్గ విషయం. 33వేల ఎకరాలు రాజధానికోసం స్వచ్ఛందంగా ఇవ్వడం దేశ చరిత్రలో ఎక్కడాలేదు. వాళ్ల ఇష్టపడి ఇచ్చారు. తర్వాత కష్టం వచ్చింది. ఇష్టంతోనే కష్టాన్ని ఎదుర్కొన్నారు. ఇప్పుడు మేలు జరిగింది. జీవితంలో మనమందరం నేర్చుకోవాల్సిన పాఠం ఇది అని చెప్పారు. ట్రస్ట్ సీఈవో జె.శరత్‌బాబు, సెక్రటరీ చుక్కపల్లి రామకృష్ణప్రసాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.పరదేశి, వివిధ శిక్షణాసంస్థల డైరెక్టర్లు, శిక్షణార్థులు పాల్గొన్నారు.

విశాఖ-కడప రైళ్ల నెంబర్లు మార్పు

» జూలై 1 నుంచి కొత్త నెంబర్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెజవాడ డివిజన్ పరిధిలోని పలు రైళ్ల నెంబర్లను అధికారులు మార్చారు. జూలై 1 నుంచి పలు రైళ్ల నెంబర్లు మారతాయి. ఈ మేరకు ఐఆర్‌సీటీసీ రిజర్వేషన్ పోర్టల్‌లో కూడా రైల్వే అధికారులు మార్పులు, చేర్పులు చేస్తున్నారు. విశాఖపట్నం-కడప మధ్యన రైలు నెంబర్ ప్రస్తుతం 17488గా ఉంది. ఇక మీదట 18521గా ఉంటుంది. అలాగే కడప-విశాఖపట్నంల మధ్యన నడిచే రైలు నెంబర్ ప్రస్తుతం 17487గా ఉంది. దీనిని 18522గా మార్చారు.

బెజవాడ-విజయవాడ సెక్షన్‌లో ఇటీవల భారీగా రద్దు చేసిన 21 రైళ్లను రైల్వే అధికారులు తిరిగి పునరుద్ధరించారు. ట్రాఫిక్ మెయింటినెన్స్ పేరుతో మొత్తం 21 రైళ్లను రద్దు చేస్తున్నట్టుగా ప్రకటించారు. రద్దు చేసిన ఈ రైళ్లన్నింటినీ పునరుద్ధరిస్తున్నట్టు రైల్వే తాజాగా ప్రకటన విడుదల చేసింది. విజయవాడ - గుంటూరు, గుంటూరు - రేపల్లె, రేపల్లె - తెనాలి, తెనాలి - విజయవాడ, విజయవాడ - గూడూరు, గూడూరు - విజయవాడ, విజయవాడ - మాచర్ల, మాచర్ల - విజయవాడ, విజయవాడ - తెనాలి, తెనాలి - రేపల్లె, రేపల్లె - మాచెర్ల, తెనాలి - రేపల్లె, రేపల్లె - గుంటూరు, గుంటూరు - తెనాలి, రేపల్లె - గుంటూరు, గుంటూరు - తెనాలి, తెనాలి - రేపల్లె, రేపల్లె - మార్కాపూర్, మార్కాపూర్ - రేపల్లె, తెనాలి-గుంటూరు, గుంటూరు - విజయవాడ, విజయవాడ-కాకినాడ పోర్టు రైళ్లన్నింటినీ ఈ నెల 21 వ తేదీ నుంచి ఆగస్టు 15 వ తేదీకి పునరుద్ధరించారు.

చెన్నై సెంట్రల్-సంత్రగచిల మధ్య రద్దీ దృష్ట్యా గురువారం ప్రత్యేక రైళ్లను నడిపింది. ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-సంత్రగచిల మధ్యన ట్రైన్ నెంబర్ 06005, సంత్రగచి-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌ల మధ్యన 06006లను రైల్వే అధికారులు నడిపారు.

మస్తర్ల మాయాజాలం

- మైలవరంలో వెలుగుచూసిన అక్రమం
- జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదులు..
- వైసీపీ నాయకుల ఇళ్లల్లో, హోటళ్లలో పనిచేసిన వారికి జీతాలు


మైలవరంలోని మస్తర్ రిజిస్టర్ కాపీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మైలవరం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని శానిటేషన్ విభాగంలో మొత్తం 72 మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు. వీరిలో ప్రతిరోజూ పనిచేసేవారు 60 - 65 మధ్యనే ఉంటారు. వీళ్లంతా పంచాయతీ పరిధిలో శానిటేషన్ విధులు నిర్వహించాలి. కానీ వైసీపీ ప్రభుత్వ హయాంలో నేతల ఇంటి దగ్గర పనిచేసేవారు. నగరంలోని హోటళ్లలో పనిచేసేవారు. వీరంతా గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్నట్టుగా మస్తర్లు వేస్తున్నారు. మూడు నెలలుగా పంచాయతీ సిబ్బంది.. పట్టణంలో పూర్తిగా పనిచేయనే లేదు. కానీ మస్తర్లు వేసి జీతాలు డ్రా చేసుకున్నట్టు నిర్ధారణ అవుతోంది. వాస్తవానికి 72 మందికి జీతాలు డ్రా చేస్తున్నారు. 68మందిని మాత్రమే చూపిస్తున్నారు. మరి మిగిలిన నలుగురు జీతాలను ఎవరు తీసుకుంటున్నారు? వారేమయ్యారు? వివరాల్లేవు. ప్రతి గ్రామ పంచాయతీలో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఎక్కడెక్కడ శానిటరీ సిబ్బందికి విధులు వేస్తున్నారన్నదానికి రికార్డులు లేవు. ఏమేం పనులు చేయిస్తున్నారనేదానికి రికార్డులు లేవు. ఎంతసేపు పనిచేస్తున్నారో కూడా నమోదు లేదు. ఒక రకంగా చెప్పాలంటే.. శానిటేషన్ విభాగాన్ని మైలవరం గ్రామ పంచాయతీ అధికారులు మకిలి పట్టించారన్న మాట. వర్కర్లను కల్యాణ మండపాలకు సరఫరా చేయటం, పంక్షన్లు, పెళ్లిళ్లకు, దినకర్మల సందర్భంగా ఆహార వ్యర్థాలను తొలగించేందుకు ప్యాకేజీలు నిర్ణయించి పారిశుద్ధ్య సిబ్బందిని, వాహనాలను పంపించటం వంటివి చేస్తున్నారు. డబ్బులు మాత్రం పంచాయతీ అధికారుల జేబుల్లోకి వెళ్లిపోతున్నాయి. ఇలా పారిశుధ్య వ్యవస్థను భ్రష్టుపట్టించిన పంచాయతీ అధికారులపై చర్యలు చేపట్టాల్సిందిగా జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు రావటంతో ఈ బాగోతాలు వెలుగులోకి వచ్చాయి.

శ్మశాన వాటిక పనుల్లో అవినీతి కంపు

మైలవరం పట్టణ పరిధిలోని బీసీ శ్మశాన వాటిక అభివృద్ధి నిమిత్తం రూ.3.70 లక్షలు మంజూర య్యాయి. పనులు అత్యంత లోపభూ యిష్టంగా జరుగుతున్నాయి. ఫెన్సింగ్ నిమిత్తం వేసిన స్తంభాలు విరిగిపోయాయి. ఫెన్సింగ్ కోసం ఐరన్ రాడ్ బెండింగ్ చేసి జాలీలను లోపల ఉంచి పోల్స్ తయారు చేసిన వాటినే ఉపయోగించాలి. ఒక్క ఐరన్ రాడ్డు కూడాలేని స్తంభాలను ఉపయో గించారంటే ఏ స్థాయిలో అవినీతి జరిగిందో అర్థం చేసుకోవాల్సిందే. ఇంత నాసిరకం పనులు చేపట్టినా పంచాయతీ అధికారులు మాట్లాడకపోవటం గమనార్హం. వేసిన స్తంభాలు విరిగిపోతుంటే పంచాయతీ అధికారులు ఏ విధంగా బిల్లులు చెల్లిస్తారన్నది నిగ్గు తేలాల్సిన విషయం.

'రాజీ' కోసం వచ్చి వివాదం

- కోర్టుకు సమీపంలో ఇరువర్గాల కొట్లాట



విజయవాడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కొట్లాట కేసు రాజీ ప్రయత్నం మరో కొట్లాటకు దారితీసింది. కోర్టు వాయిదాకు వచ్చిన ఇరువర్గాలు కోర్టు బయట కర్రలతో దాడులు చేసుకున్నాయి. ఈ ఘటన నగరంలోని కోర్టుల సముదాయ భవనం ఎదురుగా ఉన్న వీధిలో గురువారం జరిగింది. కృష్ణలంక కల్పనా ప్రింటర్స్ వీధికి చెందిన పవన్, రాజేష్ అన్నదమ్ములు. అదే ప్రాంతంలోని స్వర్గపురికి చెందిన కొర్రా సత్యనారాయణ వండ్రంగి పని చేస్తుంటాడు. ఈ ముగ్గురికి 2017లో ఎంజీ రోడ్డులోని మనోరమ హోటల్ వద్ద వివాదం జరిగింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. సత్యనారాయణ గవర్నరుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. విచారణ నగరంలోని సివిల్‌కోర్టుల్లో సాగుతోంది. కేసు విచారణ ట్రయల్ దశకు వస్తున్నందున గురువారం జరిగిన వాయిదాకు హాజరయ్యాడు. పవన్, రాజేష్ కూడా హాజరయ్యారు. కేసు వాయిదా పడిన తర్వాత బయటకు వచ్చారు. కోర్టు ముందున్న వీధిలో నుంచి ఐవీ ప్యాలస్‌కు వెళ్లేమార్గంలో ఇరువర్గాలు ఘర్షణపడ్డాయి. సత్యనారాయణ.. పవన్, రాజేష్‌పై కర్రలు, చెక్కముక్కలతో దాడిచేశాడు. ఈ ఘటనలో అన్నదమ్ములిద్దరికీ గాయాలయ్యాయి. అక్కడే టీ స్టాల్ వద్ద టీ తాగుతున్న న్యాయవాదులు గమనించి అక్కడికి చేరుకుని గాయపడిన వారిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రకాశం జట్టుకు రెండో విజయం



విజయవాడ స్పోర్ట్స్, జూన్ 13: మూలపాడు ఏసీఏ క్రికెట్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఏసీఏ సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల పురుషుల అండర్-23 వన్డే క్రికెట్ మ్యాచ్‌ల్లో భాగంగా ప్రకాశం జట్టు గురువారం రెండో విజయం నమోదు చేసింది. పశ్చిమగోదావరి- ప్రకాశం జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాట్‌పట్టిన ప్రకాశం నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 349 పరుగులను చేసింది. బ్యాటర్స్ జి.రోహిత్ (115) సెంచరీతోను, ఎం.లేఖజ్‌రెడ్డి (52) అర్థసెంచరీతో రాణించారు. 350 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన పశ్చిమగోదావరి 41.5 ఓవర్లలో 196 పరుగులకు కుప్పకూలి పరాజయం పాలైంది. బ్యాటర్ హరీష్ 63 పరుగులతో జట్టును ఆదుకున్నాడు. ప్రకాశం బౌలర్లలో పార్థసారథి 4వికెట్లను తీశాడు.

ఆడుదాం-ఆంధ్రా పోటీల్లో భారీ అక్రమాలు

- రోజా, సిద్ధార్థరెడ్డిపై సీఐడీ విచారణ చేయాలి
- ఆత్యా-పాత్యా రాష్ట్ర అసోసియేషన్ సీఈవో రంభా ప్రసాద్


ఫిర్యాదు ప్రతులను చూపుతున్న ఆత్యా-పాత్యా సీఈవో రంభాప్రసాద్

విజయవాడ స్పోర్ట్స్, జూన్ 13: రాష్ట్రంలో ఆడుదాం-ఆంధ్రా పేరిట మాజీ మంత్రి ఆర్కే రోజా, శాప్ మాజీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి రూ.100 కోట్ల మేర అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, ఈ అవకతవలపై సీఐడీ విచారణ చేయాలని మంగళగిరిలోని సీఐడీ అదనపు డీజీకి ఫిర్యాదు చేసినట్టు ఆంధ్రప్రదేశ్ ఆత్యా-పాత్యా అసోసియేషన్ సీఈవో, జాతీయ మాజీ కబడ్డీ ప్లేయర్ రంభా ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఐజీఎంసీ స్టేడియంలోని బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం ఫిర్యాదు ప్రతులను అందజేసి మాట్లాడారు. వైసీపీ వినోదం కోసం ఐదు అంశాల్లో నిర్వహించిన క్రీడా పోటీల నిర్వహణలో క్రీడా సామగ్రి వ్యవహారంలో పెద్ద ఎత్తున అవకతవలు జరిగాయన్నారు. క్రీడాకారులకు అందజేసిన నగదు బహుమతులపై విచారణ జరిపితే వాస్తవాలు బయటపడతాయన్నారు. సీఎం కప్ నిర్వహణ, క్రీడా ప్రాంగణాల అభివృద్ధి పనుల టెండర్లలో ఇంజనీరింగ్ అధికారులు, బైరెడ్డి అనుచరులకు, బినామీలకు కట్టబెట్టారన్నారు. ఈ ఐదేళ్లలో జరిగిన లావాదేవీలు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది నియామకాలపై రిటైర్డు ఏవోలు సంతకాలు చేసి నడిపిన ఫైళ్లను కింద స్థాయిల్లో డీఎస్‌ఏల నుంచి సీజ్ చేసి వాటిపై సీఐడీ విచారణ జరిపి బాధ్యులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని రంభా ప్రసాద్ డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు జోక్యంచేసుకుని శాప్‌లోని ప్రజాప్రతినిధులు, అధికారులు, రిటైర్డు అధికారులు చేసిన అవకతవలకపై పూర్తి విచారణకు ఆదేశించాలని కోరారు. మోడరన్ ఖోఖో రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.అప్పలస్వామి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ మాజీ సెక్రటరీ నాంచారయ్య, టెన్నిస్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బాలు నాయక్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ మూకల దాడి

ఘంటసాల, జూన్ 13 : లంకపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గువ్వాబత్తిన బాలకృష్ణపై అదే గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ మాడెం నాగరాజు, అతడి కుటుంబసభ్యులు, అనుచరులు బుధవారం రాత్రి దాడి చేశారు. సేకరించిన వివరాల ప్రకారం.. సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకార సందర్భాన్ని పురస్కరించుకుని గ్రామంలో విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో టీడీపీ కార్యకర్తలతో వస్తున్న బాలకృష్ణపై మాడెం నాగరాజు, మాడెం బాలాజీ, మాడెం కోటేశ్వరరావు, కొండపల్లి ఆంజనేయులు, కళ్లేపల్లి శ్రీనివాసరావులు కర్రలతో దాడి చేశారు. దాడిలో బాలకృష్ణ తల, మెడపైన తీవ్ర గాయాలు కావటంతో 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలకృష్ణ ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రతాప్ రెడ్డి తెలిపారు.

బాలికను వేధించిన కేసులో జైలు శిక్ష

మచిలీపట్నం టౌన్, జూన్ 13 : కలిదిండి మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన నారగాని అయ్యప్ప అనే వ్యక్తి మైనర్ బాలికను వేధించినందుకు మచిలీపట్నం పోక్సో కోర్టు జైలు శిక్ష విధించింది. 2021 మే 22న మైనర్ బాలిక కిరాణా షాపుకు వెళుతుండగా అయ్యప్ప మద్యం సేవించి వేధించాడు. దీనిపై పోక్సో కోర్టు న్యాయమూర్తి గాజుల వెంకటేశ్వర్లు విచారణ అనంతరం తీర్పు ఇచ్చారు. అయ్యప్పకు 6 నెలల జైలు శిక్ష, రూ. 21వేల జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ ముంజులూరు వెంకట మహేష్‌కుమార్ 8 మంది సాక్షులను విచారించి వాదనలు వినిపించారు.


సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ దిల్లీరావు

విలువలతో కూడిన విద్యతో విద్యార్థుల సమగ్రాభివృద్ధి

» 100 శాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేయాలి

» వసతి గృహాలపై సమీక్షలో కలెక్టర్ దిల్లీరావు

కృష్ణలంక, జూన్ 13 : సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, విలువలతో కూడిన విద్య ద్వారా విద్యార్థుల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో కలెక్టర్ దిల్లీరావు, ప్రి మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ సాంఘిక సంక్షేమ, సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులతో సమావేశం నిర్వహించారు. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో వసతి గృహాల్లో ప్రవేశాలు, బోధన, నిర్వహణ, గత పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ఫలితాలు తదితరాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వసతి గృహాల్లో పూర్తిస్థాయిలో ప్రవేశాలు జరిగేలా చూసి నాణ్యమైన బోధన అందించేందుకు, వసతి కల్పించేందుకు అనువుగా తీర్చిదిద్దాలన్నారు. జిల్లాలో ప్రీ మెట్రిక్ 25, పోస్ట్ మెట్రిక్ 13 వసతి గృహాల్లో 2,095 మంది విద్యార్థులకు అవకాశముందని, మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రవేశ ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. వసతి గృహాలల్లో వుండి చదువుకొంటున్న ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేకంగా దృష్టి సారించాలని, కెరీర్ పరంగా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకొనేలా నైపుణ్యాలను అందించాలన్నారు. గత పరీక్షల్లో ఫలితాలను విశ్లేషించుకొని ఏవైనా లోపాలు వుంటే సరిదిద్ది 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా బోధన సిబ్బంది కృషి చేయాలన్నారు. విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి, విలువలతో బయటకు వచ్చినప్పుడు వారి తల్లిదండ్రులకు కలిగే ఆనందం వర్ణనాతీతమని పేర్కొన్నారు. సబ్జెక్టు నిపుణులు, ట్యూటర్లతో ప్రత్యేక శిక్షణ ఇప్పించడం, విద్యార్థులు ఏ అంశాల్లో వెనుకబడి వున్నారో ఆయా అంశాలపై పట్టు సాధించేలా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు పోషక విలువలతో కూడిన మంచి ఆహారాన్ని అందించాలని కలెక్టర్ దిల్లీరావు సూచించారు. తరచుగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ కె.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనిల్, సూపరింటెండెంట్ ఎ.ఆంజనేయులు, సాంఘిక సంక్షేమ, సహాయ సాంఘిక సంక్షేమ, వసతి గృహపు సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

కృష్ణలంక, జూన్ 13 : ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం (ఏబీపీ) కింద కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాల్లో అభివృద్ధి వ్యూహాలను ప్రణాళికాయుతంగా అమలు చేయడం ద్వారా లక్ష్యాలను చేరుకోవచ్చని, ఇందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ దిల్లీరావు అధికారులకు సూచించారు. గురువారం న్యూఢిల్లీ నుంచి నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం ఆకాంక్షిత జిల్లాలు, బ్లాక్‌లలో పురోగతిపై ఆయా జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశానికి కలెక్టర్ దిల్లీరావు అధికారులతో కలిసి ఆర్అండ్‌బీ భవంతిలోని ఎన్ఐసీ కార్యాలయం నుంచి హాజరయ్యారు. ఆకాంక్షిత బ్లాక్‌లలో వివిధ సూచికల్లో ప్రగతిపై నీతి ఆయోగ్ సీఈవో మార్గనిర్దేశనం చేశారు. అనంతరం కలెక్టర్ దిల్లీరావు క్షేత్రస్థాయి అధికారులకు సూచనలు చేశారు. ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాల్లో సామాజిక, ఆర్థిక సూచికల్లో ప్రగతికి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఐదు కేటగిరీలకు సంబంధించి ఆరోగ్యం, పోషణ, విద్య, వ్యవసాయం, అనుబంధ రంగాలు, తాగునీరు, పారిశుధ్యం, ప్రాథమిక మౌలిక వసతులు, సామాజిక అభివృద్ధి, ఆర్థిక సమ్మిళిత రంగాల్లో మొత్తం 40 సూచికల్లో ప్రగతిని నీతి ఆయోగ్ ఎప్పటికప్పుడు సమీక్షించడం జరుగుతుందన్నారు. అందుబాటులో ఉన్న సామాజిక, ఆర్థిక వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఈ సూచికల్లో ప్రగతిని కనబరచవచ్చని, ఇందుకు విద్య, వైద్య, ఆరోగ్యం, గ్రామీణ నీటిసరఫరా, వ్యవసాయం తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గర్భిణుల ఆరోగ్యం, ఆసుపత్రుల్లో ప్రసవాలు, హైపర్ టెన్షన్ స్క్రీనింగ్, ఐసీడీఎస్ కార్యక్రమాల ద్వారా పోషకాహారం పంపిణీ తదితర సూచికలపై దృష్టి సారించాలన్నారు. వర్చువల్ సమావేశంలో పెనుగంచిప్రోలు ఎంపీడీవో సాయిహర్ష, ఈవో (పీఆర్ అండ్ ఆర్‌డీ) ఎం.వరప్రసాద్, ఏబీపీ బ్లాక్ కో-ఆర్డినేటర్ మోహన్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.


విజేతగా నిలిచిన కృష్ణా జట్టు

సీనియర్ మహిళా వన్డే టోర్నీ విజేత కృష్ణా

విజయవాడ స్పోర్ట్స్, జూన్ 13 : నర్సరావుపేట పేరిచర్లలో జరుగుతున్న ఏసీఏ సీనియర్, అండర్-23 ఉమెన్ వన్డే అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీ విజేతగా కృష్ణా ఉమెన్ జట్టు నిలిచింది. గురువారం గుంటూరుతో జరిగిన ఫైనల్స్‌లో కృష్ణా టీమ్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాట్‌పట్టిన గుంటూరు 50 ఓవర్లలో 196/8 పరుగులు చేయగా, కృష్ణా జట్టు 42.3 ఓవర్లలో 3 వికెట్లను కోల్పోయి 197 పరుగులను చేసి విజేతగా నిలిచింది. బ్యాటర్స్ ఎం.భావన 65 పరుగులు, అంజుమ్ 46, వర్ధిని 40 పరుగులతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. సెంట్రల్ జోన్ విజేతగా నిలిచిన కృష్ణా మహిళా టీమ్‌ను కేడీసీఏ అడహక్ కమిటీ చైర్మన్ టి. త్రినాథ్‌రాజు అభినందించారు.

సీఎం చంద్రబాబుకు దూండీ అభినందనలు



వన్‌టౌన్, జూన్ 13 రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబునాయుడుకు గురువారం టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దూండీ రాకేష్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబునాయుడును కలిసిన శుభాకాంక్షలు తెలిపి శాలువతో సత్కరించారు.

ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

పటమట, జూన్ 13: ఫాదర్స్ డేను పురస్కరించుకుని ఈనెల 16న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అశోక్‌నగర్ సోమనాథ్ హాస్పిటల్‌లో రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 45 ఏళ్లు నిండిన తల్లిదండ్రులకు ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు రూట్స్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పోలవరపు విజయభాస్కర్ తెలిపారు. హెచ్‌సీజీ క్యూరీ కేన్సర్ సెంటర్, సోమల రాజు ఫౌండేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయన్నారు. పురుషుల్లో ప్రోస్టేట్ కేన్సర్‌ను గుర్తించే పీఎస్ఏ, ట్యూమర్స్‌ను గుర్తించే సీఏ 125, మహిళల్లో సర్వైకల్ కేన్సర్‌ను గుర్తించే పాప్‌స్మియర్, బీఎండీ, రక్తపోటు, బ్లడ్‌షుగర్ పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. పేర్లను 9849545117లో నమోదు చేసుకోవాలని సూచించారు.



నృత్యకారిణులతో సీఎం చంద్రబాబునాయుడు, భువనేశ్వరి

చంద్రబాబు దంపతులకు ఘన స్వాగతం

వన్‌టౌన్, జూన్ 13: దుర్గామల్లేశ్వరస్వామి దేవ స్థానంలో కనకదుర్గమ్మను దర్శించుకోవడానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులకు విజయవాడ నటరాజ నృత్యాలయం నాట్యాచార్య రాయన శ్రీనివాసరావు శిష్య బృందం నృత్యం చేస్తూ గురువారం ఘన స్వాగతం పలికింది. నృత్యకారిణులను చంద్రబాబు అభినందించారు. నృత్యకారిణుల బృందంతో చంద్రబాబు దంపతులు ఫొటోలు దిగారు.

ఆదర్శ నాయకుడు పర్సా సత్యనారాయణ



సత్యనారాయణపురం శివాజీకేఫ్ సెంటర్‌లో పర్సా సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీహెచ్ బాబూరావు

సత్యనారాయణపురం, జూన్ 13: రాష్ట్రంలో కార్మిక ఉద్యమాలకు నాయకత్వం వహించిన అగ్రగణ్యుడు దివంగత పర్సా సత్యనారాయణ అని ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమని సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. సత్యనారాయణపురం శివాజీకేఫ్ సెంటర్‌లో గురువారం కార్మికనేత సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు సీపీఎం రాష్ట్రనాయకుడు పర్సా సత్యనారాయణ శతజయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బాబూరావు పూలమాల వేసి నివాళులర్పించారు. మూడు దశాబ్దాల పాటు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా కార్మికుల సంక్షేమానికి పర్సా విశేష కృషి చేశారన్నారు. నూతన ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అను గుణంగా పని చేయాలన్నారు. సీఐటీయూ, సీపీఎం నేతలు ఎన్సీహెచ్ శ్రీనివాస్, బి.రమణ, మురళి, సాగర్, బాలాజీ పాల్గొన్నారు.

తొలిరోజే ఐదు సంతకాలు

చరిత్రాత్మకం



ప్రజలకు మేలు చేయాలనే ఈ నిర్ణయం: బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 13: ప్రజలకు మేలు చేయాలనే సదుద్దేశంతో నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా చంద్రబాబు నాయుడు చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మొదటి రోజునే ఐదు చరిత్రాత్మక ఫైళ్లపై సంతకాలు చేశారని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు అన్నారు. మొగల్రాజపురంలోని తన నివాసంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పెన్షన్ రూ.4 వేలకు పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, స్కిల్ సెన్సస్ ఫైళ్లపై ఐదు సంతకాలు చేశారని తెలిపారు. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో మెజారిటీ సీట్లు ఇచ్చిన రాష్ట్ర ప్రజలకు మేలు చేయాలనే మొదటి రోజు నుంచే తపనపడే గొప్ప సీఎం చంద్రబాబు అని పేర్కొన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన తెలుగు రాష్ట్రాల మంత్రులకు ఉమా శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఎంబీవీకేలో పర్సా శత జయంతి సభ

మాచవరం: పర్సా సత్యనారాయణ శత జయంతి సభను శుక్రవారం ఎంబీవీకేలో నిర్వహిస్తారని, సభకు బి.రాఘవులు ప్రధాన వక్తగా హాజరవుతారని, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సీఐటీయూ తూర్పు సిటీ ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వాస్పత్రి సెక్యూరిటీ గార్డ్స్, శానిటేషన్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం గురువారం ఆస్పత్రిలో నిర్వహించారు. కార్యక్రమంలో రాజు, భాస్కరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని ఆత్మహత్య

వన్‌టౌన్, జూన్ 13: కృష్ణలంక పోలీసుస్టేషన్ పరిధిలోని రాణిగారితోట కంచర్లకోటయ్య వీధికి చెందిన బిందెల వెంకటేశ్వరరావు(42) తాగుడుకు బానిసై తన ఇంట్లో ఉరేసుకుని మృతి చెందాడు. భార్య అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వెంకటేశ్వరరావు క్యాటరింగ్, ఇతరపనులు చేస్తుండేవాడని, తాగుడుకు బానిసై కొన్ని రోజులుగా భార్యను, పిల్లలను చూడలేకపోతున్నానంటూ మానసికంగా కుంగిపోతున్నాడని, పనికి వెళ్లిన డబ్బును ఇంట్లో ఇచ్చేవాడు కాదని, మద్యం తాగడంకోసం డబ్బు ఖర్చు చేసేవాడని అరుణ ఫిర్యాదులో పేర్కొంది. మద్యం తాగొద్దని ఎన్నిసార్లు చెప్పినా వినలేదని, కొన్ని రోజులుగా తాగివచ్చిన భార్య, పిల్లలను చూడలేకపోతున్నానంటూ మనస్తాపంతో ఉంటున్నాడని పేర్కొనంది. గురువారం ఉదయం స్నానం చేసి వస్తానని తాను ఉంటున్న బిల్డింగ్ రెండో అంతస్తులోకి వెళ్లాడని, ఉదయం 6.30 గంటలకు వెంకటేశ్వరరావు తమ్ముడు చిన వెంకటేశ్ పైకి వెళ్లగా వెంకటేశ్వరరావు ఉన్న రూమ్ లోపల గడియ వేసి ఉందని, తలుపులను గట్టిగా కొట్టి తీయగా బెడ్‌రూమ్‌లో లుంగీతో ఉరివేసుకుని ఉన్నాడని తెలిపింది. 108 వాహనాన్ని పిలిపించగా, అందులోని సిబ్బంది వెంకటేశ్వరరావు చనిపోయినట్లు తెలిపారని పేర్కొంది.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

వన్‌టౌన్, జూన్ 13: కృష్ణలంక హైవేపై ఈనెల 9 వతేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కృష్ణలంక పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బలరాంపూర్‌కు చెందిన ఫరూక్ భార్య మహమ్మద్ అఫ్సర్ జహాన్(34), పిల్లలతో కలిసి తాడేపల్లి మహానాడు రోడ్డులో ఉంటున్నారు ఈనెల 9వతేదీన భార్యాభర్తలు బీసెంట్‌రోడ్డులో సరుకులు తీసుకుని బైక్‌పై తిరిగి వెళుతున్న సమయంలో అమెరికన్ ఆస్పత్రి ఎదురుగా హైవేపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో మహ్మద్ అఫ్సర్ జహాన్‌కు తలకు గాయమైంది, 108లో ఆమెను జీజీ హెచ్‌లో చికిత్స నిమిత్తం చేర్చారు. చికిత్స పొందుతూ మృతిచెందింది

కుమార్తె కనిపించడం లేదని తల్లి ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 13: తన కుమార్తె కనిపించడం లేదని ఓ తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. రామకృష్ణాపురం ప్రాంతానికి చెందిన యువతి(20) ఇంటర్ వరకు చదివి ఇంటి వద్దనే ఉంటోంది. గురువారం ఉదయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. దీంతో తల్లి పోలీసులకు ఫిర్యాదుచేసింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడు కనిపించడం లేదని..

నెల రోజులుగా తన కొడుకు కనిపించడం లేదని అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు గురువారం ఓ తల్లి ఫిర్యాదు చేసింది. తోటవారి వీధి ప్రాంతానికి చెందిన కొమరపురి రామకృష్ణ(17) క్యాటరింగ్ పనులు చేస్తుంటాడు. తల్లిదండ్రులు అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. గత నెల 16న టిఫిన్ తెచ్చుకుంటానని ఇంటి నుంచి బయటకు వెళ్లిన రామకృష్ణ తిరిగి రాలేదు. ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో కుటుంబ సభ్యులు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులను ఆశ్రయించారు. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



దుర్గగుడిలో దక్షిణామూర్తికి పూజ చేస్తున్న పండితులు

దక్షిణామూర్తికి విశేషపూజలు

వన్‌టౌన్, జూన్ 13: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో మల్లేశ్వరాలయ ప్రాంగణంలో ఆలయ కుడ్యంపై కొలువైన దక్షిణామూర్తికి గురువారం పండితులు విశేష పూజలు చేశారు. స్వామికి షోడశోపచారాలు చేశాక అర్చనాది కార్యక్రమాలను నిర్వహించి మంత్ర పుష్పం, హారతులు సమర్పించారు.

దర్శిపేటలో విజయోత్సవాలు



కేక్ కట్ చేస్తున్న జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు అమ్మిశెట్టి వాసు, బొప్పన భవకుమార్, నాగేశ్వరరావు

పటమట, జూన్ 13: ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘన విజయాన్ని సాధించిన సందర్భంగా దర్శిపేట రాజరాజేశ్వరి కల్యాణ మండపంలో గురువారం రాత్రి జనసేన 14వ డివిజన్ అధ్యక్షుడు యడ్లపల్లి నాగరాజు ఆధ్వర్యంలో విజయోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టీడీపీ నాయకుడు బొప్పన భవకుమార్, జనసేన తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి అమ్మిశెట్టి వాసు, బీజేపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి పోతంశెట్టి నాగేశ్వరరావు హాజరయ్యారు. చంద్రబాబు సెంట్రల్ జైల్లో ఉన్నప్పుడు, రాష్ట్రం కష్టాల్లో ఉందని గ్రహించి తనంతట తానుగా జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ముందుకు వచ్చి పొత్తుకు శ్రీకారం చుట్టి, ఇంతటి ఘన విజయానికి నాంది పలికారని అమ్మిశెట్టి వాసు అన్నారు. చిన్న, చిన్న విభేదాలు ఉంటే పక్కన పెట్టి అందరం రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెడదామన్నారు. అనంతరం నాయకులు కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. కార్యకర్తలు బాణాసంచా కాల్చారు. రాధారపు యల్లబాబు, గరికపాటి శ్రీనివాస్, సూరిబాబు, తిరుపతి నాయుడు, కాల్వ ప్రసాద్. రంగనాయకమ్మ, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అన్న వితరణకు రూ.లక్ష విరాళం



విరాళమిచ్చిన దాత బొమ్మారెడ్డి శివమ్మకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో కేఎస్ రామారావు

దుర్గగుడిలో నిర్వహించే అన్న వితరణకు గుంటూరుకు చెందిన బొమ్మారెడ్డి శివమ్మ గురువారం రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో ఈవో కేఎస్ రామారావుకు అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వారికి వేద పండి తులు వేదాశీర్వచనం చేశారు. దాతకు అమ్మవారి ప్రసాదం, చిత్ర పటం, శేషవస్త్రంను ఈవో అందజేశారు.

ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ముమ్మనేని ప్రసాద్

పటమట. జూన్ 13: ప్రజలు ఏ సమస్యపై వచ్చినా వారిని ఇబ్బంది పెట్టకుండా పరిష్కరించి ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా పని చేయాలని సచివాలయ సిబ్బందికి కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ సూచించారు. 13వ డివిజన్ పరిధిలోని 54, 55, 56, 57 సచివాలయాలను గురువారం ఆయన సందర్శించి సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జూలైలో పెన్షన్ దారులకు అందించే రూ.7వేలను లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. టీడీపీ డివిజన్ అధ్యక్షుడు గద్దె ప్రసాద్, శొంఠి నాగేశ్వరరావు, కొర్రపాటి శ్రీనివాస్, శొంఠి సాయిలక్ష్మి, నూతి శ్రీనివాస్, వేములపల్లి శ్రీను, మరీదు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

భగవద్గీతను పఠిస్తే గోవిందుడిని పూజించినట్టే

భవానీపురం, జూన్ 13: "చిన్నారుల నుంచి పెద్దల వరకు భగవద్గీతపై మక్కువ పెంచుకుని పఠిస్తే అది ఆ గోవిందుడిని పూజించడంతో సమానం. ఇది మంచి పుణ్యకార్యం." అని తెనాలి విద్యాపీఠం స్వామిజీ ప్రజ్ఞానంద సరస్వతి అన్నారు. గోవిందనామ ప్రచార సేవా సంఘం టి.సునీతామధుసూదన్ ఆధ్వర్యంలో సంస్థ వార్షికోత్సవాన్ని భవానీపురంలోని ఒక కల్యాణ మండపంలో గురువారం రాత్రి నిర్వహించారు. విద్యార్థులతో భగవద్గీత శ్లోక పఠనం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. భగవద్గీత కంఠస్థ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో ప్రజ్ఞానంద మాట్లాడారు. దేవుడి కార్యక్రమాలను, భగవద్గీ తపై చాలా సంవత్సరాలుగా విస్తృత ప్రచారం కల్పించడంలో సునీతా మధుసూదన్ దంపతులు చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ధర్మ ప్రచార పరిషత్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వేదాంతం రాజ గోపాలచక్రవర్తి స్వామిజీ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు.



భగవద్గీత పోటీల బహుమతి ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న ప్రజ్ఞానంద సర్వసతి

'అన్నదమ్ముల అనుబంధం అంటే ఇదే' అన్నారు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వేదికపై చిరంజీవితో ప్రధాని మోదీ ఆత్మీయంగా ముచ్చటించిన సంఘటన ఎంతోమందిని ఆకర్షించిన విషయం తెలిసిందే. 'ఆ హడావిడి సమయంలో అంత ఆసక్తిగా ఆయన చిరుతో ఏం మాట్లాడి ఉంటారబ్బా' అని జనాలు అనుకున్నారు. ఆ సంఘటనపై చిరంజీవి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఎన్నికల్లో ఘన విజయం తర్వాత పవన్ కల్యాణ్ చిరంజీవి ఇంటికి వెళ్లారు. ఆ సందర్భంలో అన్నయ్య కాళ్లకు పవన్ కల్యాణ్ నమస్కరించడం, సంతోషంతో నాగేంద్రబాబు కళ్లు చెమర్చడం, కుటుంబ సభ్యులంతా పవన్ విజయాన్ని తమ గెలుపుగా భావించి ఒక్కచోట చేరి సంబరాలు చేసుకోవడం అందరినీ ఆకట్టుకున్నాయి. ఆ ఘటన తాలూకు వీడియోను తాను చూసినట్లు మోదీ ఆ రోజు చిరంజీవికి చెప్పారట. 'మీ అన్నదమ్ముల అనుబంధం నన్ను భావోద్వేగానికి గురి చేసింది. మన సంస్కృతి సంప్రదాయాలు, కుటుంబ విలువలకు ఆ సంఘటన అద్దం పట్టిందని ప్రశంసించారట. అలాంటి మధుర క్షణాలు అన్నదమ్ములందరికీ ఆదర్శంగా నిలుస్తాయి అని ప్రధాని మోదీ చెప్పటం నాకెంతో ఆనందం కలిగించింది అని చిరంజీవి పేర్కొన్నారు.

'జేమ్స్‌బాండ్ ఇన్ కుప్పం'



ప్రేమ కథల్లో ఎక్కువగా నటించే సుధీర్‌బాబు.. రూటు మార్చి నటించిన కంప్లీట్ యాక్షన్ ప్యాక్‌డ్ చిత్రం 'హరోం హర'. ఈ చిత్రానికి జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించగా, సుమంత్.జి.నాయుడు నిర్మించారు. నేడు సినిమా విడుదలవుతున్న సందర్భంగా హీరో సుధీర్‌బాబు మీడియాతో ముచ్చటించారు.

"హరోంహర' సరికొత్తగా చేసిన కమర్షియల్ సినిమా. ప్రేక్షకులకు ఈ కథా నేపథ్యం, మాటలు, సన్నివేశాలు కొత్త ప్రపంచాన్ని చూసిన అనుభూతిని ఇస్తాయి. నా దృష్టిలో కమర్షియల్ సినిమాల్లో కథ హీరో నుంచి మొదలైతేనే బాగుంటుంది. ఈ సినిమాను 'జేమ్స్‌బాండ్ ఇన్ కుప్పం' అనొచ్చు. ఇందులో నేను పోషించిన సుబ్రమణ్యం పాత్ర అన్ని వర్గాల ప్రేక్షకులకి నచ్చుతుంది. ఇప్పటివరకూ తెలుగులో వచ్చిన పది ఉత్తమ యాక్షన్ చిత్రాల్లో 'హరోం హర' ఒకటిగా మిగిలిపోతుందనే నమ్మకం ఉంది. చాలా రోజుల తర్వాత కమెడియన్ సునీల్ ఈ సినిమాలో గుర్తుండిపోయే పాత్ర చేశారు. హీరోయిన్ మాళవిక శర్మ తన పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయింది. చేతన్ భరద్వాజ్ ఇచ్చిన సంగీతం థియేటర్స్ నుంచి బయటకు వచ్చాక కూడా ప్రేక్షకులని వెంటాడుతుంది" అని చెప్పారు.

ముందుగానే దేవర రాక



ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దేవర'. గురువారం చిత్రబృందం కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. రెండు భాగాలుగా రూపొందుతోన్న ఈ చిత్రంలో తొలి భాగం 'దేవర: పార్ట్ 1'ను అక్టోబర్ 10న విడుదల చేస్తున్నట్లు గతంలో చిత్రబృందం ప్రకటించింది. అయితే ఇప్పుడు విడుదల తేదీ ముందుకు మారింది. సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు గురువారం తెలిపింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ఎన్టీఆర్ మాస్ లుక్‌లో కనిపించారు. జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. ప్రకాశ్‌రాజ్, శ్రీకాంత్, నరైన్ కీలకపాత్రలు పోషించారు. మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ కె. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

రేవ్‌పార్టీ కేసులో నటి హేమకు బెయిల్



బెంగళూరు రేవ్‌పార్టీ కేసులో అరెస్ట్ అయి జైలు జీవితం గడుపుతున్న నటి హేమకు ఊరట లభించింది. బుధవారం ఆమెకు బెయిల్ లభించింది. రేవ్ పార్టీలో డ్రగ్స్ వాడకంపై బెంగళూరు ఎన్‌డీపీఎస్ కోర్టులో విచారణ జరిగింది. 'హేమ డ్రగ్స్ వాడినట్లు పోలీసులు ఎలాంటి సాక్ష్యాలు న్యాయస్థానానికి సమర్పించలేదు' అని ఆమె తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. 'హేమపై ఆరోపణలు వచ్చిన పది రోజుల తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించారని, ఆమెకు నెగెటివ్ వచ్చిందని, ఆమె వద్ద ఎలాంటి డ్రగ్స్ లభించలేదు అని న్యాయవాది కోర్టుకు నివేదించారు. సీసీబీ (బెంగళూరు నేర నియంత్రణ దళం) న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ, 'హేమ మరికొంత మంది టాలీవుడ్ సినీ ప్రముఖులను ఈ పార్టీకి తరలించే ప్రయత్నం చేశారు, నోటీసులు పంపినా అనారోగ్య కారణాలను సాకుగా చూపి విచారణకు హాజరుకాలేదు, అందువల్లే ఆమెను అరెస్ట్ చేయాల్సి వచ్చింది' అని కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి హేమకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. ఆమె ఏ క్షణంలోనైనా విడుదలయ్యే అవకాశాలున్నాయి. అరెస్ట్ తర్వాత తెలుగు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ హేమ సభ్యత్వాన్ని రద్దు చేసింది.

ఇది సినిమా కాదు జీవితం



అజయ్‌ఘోష్, చాందినీ చౌదరి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'మ్యూజిక్ షాప్ మూర్తి'. శివ పాలడుగు దర్శకత్వం వహించగా, జి.హర్ష, జి.రంగారావు నిర్మించారు. నేడు సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అజయ్‌ఘోష్ మాట్లాడుతూ "జీవితంలో ఏదో సాధించాలని అనుకునే వారికి. ఏదో సాధించాలనుకొని ఆగిపోయిన వారికీ ఈ సినిమా విపరీతంగా కనెక్ట్ అవుతుంది. ఇది సినిమా కాదు జీవితం" అని అన్నారు. "కల కనడానికి వయసు అడ్డంకి కాదని నిరూపించే చిత్రమిది" అని చాందినీ చౌదరి చెప్పారు.



అందాల రాక్సీ వచ్చింది

నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. దీపికా పదుకొనే, దిశా పటానీ కథానాయికలుగా నటిస్తున్నారు. గురువారం దిశా పుట్టిన రోజు సందర్భంగా యూనిట్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో ఆమె రాక్సీ అనే పాత్ర పోషిస్తున్నట్లు తెలిపింది. ట్రైలర్‌లో పోరాట ఘట్టాల్లో మెరిసిన దిశా ఈ పోస్టర్‌లో సైతం పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించారు. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మిస్తున్నారు.

ఈ ప్రశంసలు ఊహించలేదు



వంశీ జొన్నలగడ్డ దర్శకత్వంలో నూతన నటీనటులతో రూపొందిన చిత్రం 'నీ దారే నీ కథ'. ప్రియతమ్ మంతిని, విజయ విక్రాంత్, అనంత పద్మశాల, వేద్, అంజన బాలాజీ ప్రధాన పాత్రల్లో నటించారు. వంశీ జొన్నలగడ్డ, తేజేష్ వీర, శైలజ జొన్నలగడ్డ నిర్మించారు. నేడు సినిమా విడుదలవుతోన్న సందర్భంగా ప్రీమియర్ షో ఏర్పాటు చేశారు. ఈ షో ముగిశాక డైరెక్టర్ వంశీ మాట్లాడుతూ "సంగీతంలో అనుకున్నది సాధించడం కోసం నలుగురు యువకులు చేసే ప్రయత్నాల్ని అందర్నీ ఆకట్టుకునేలా, ఎంతో ఆసక్తికరంగా చూపించారని.. ప్రీమియర్‌లో సినిమాను చూసిన ప్రేక్షకులందరూ ప్రశంసిస్తున్నందుకు ఆనందంగా ఉంది. అందరూ సినిమాను ఇంతగా ఆదరిస్తారని అస్సలు ఊహించలేదు. థియేటర్లలోనూ ప్రేక్షకులు ఇదే విధంగా సినిమాను ఆదరిస్తారని కోరుకుంటున్నాను" అని అన్నారు.

బాలల పోరాటం



చిత్తజల్లు ప్రసాద్ దర్శకత్వంలో కేపీ ప్రొడక్షన్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం 'బాలతేజం'. దిలీప్ రాథోడ్, ఇరిగే రమేష్, హీరోయిన్‌లుగా అరవింద, షన్ను, చెన్నకేశవ నాయుడు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గురువారం ఈ సినిమా షూటింగ్ కూకట్‌పల్లి-ఆల్విన్ కాలనీలో ప్రారంభమైంది. డ్రగ్స్ సరఫరా చేసి యువతను నిర్వీర్యం చేస్తున్న ముఠాపై బాలలు చేసిన పోరాటమే ప్రధాన ఇతివృత్తంగా సినిమా ఉంటుందని డైరెక్టర్ చిత్తజల్లు ప్రసాద్ తెలిపారు.

మాజీ ప్రేమికుల కథ



అడివి శేష్, శ్రుతి హాసన్ జంటగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'డెకాయిట్'. షానీల్ డియో దర్శకత్వం వహిస్తుండగా, సుప్రియ ఆర్లగడ్డ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ సినిమాలోని కీలక షెడ్యూల్ షూటింగ్ హీరో హీరోయిన్లపై జరుగుతోంది. ఈ సందర్భంగా హీరో అడివి శేష్‌తో తీసుకున్న సెల్ఫీని శ్రుతి హాసన్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. కాగా, ఇద్దరు మాజీ ప్రేమికులు.. తమ జీవితాల్ని మార్చుకోవడానికి ఓ దోపిడీ కోసం ఎలా ఒక్కటయ్యారనేది 'డెకాయిట్' సినిమా కథని మేకర్స్ తెలిపారు.

నవ్య నివేదన

శుక్రవారం • 14 జూన్ 2024



సందేశం

త్యాగానికి ప్రతిరూపం బక్రీద్

బక్రీద్- ముస్లింలు జరుపుకొనే అతి పెద్ద పండుగ. ఇస్లాంలో త్యాగానికి ఒక ప్రత్యేకమైన స్థానముంది. ఈ పండుగ ఆ త్యాగానికి ఒక సూచికగా నిలుస్తుంది. అందుకే ఇద్ అల్ అదా అంటే- త్యాగం సందర్భంగా చేసుకొనే విందు అని అర్థం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు అందరూ ఈ పండుగ జరుపుకోవటం వెనక కదిలించే ఒక కథ ఉంది.

ఇస్లాం సంప్రదాయం ప్రకారం- సుమారు నాలుగు వేల సంవత్సరాల క్రితం మక్కా వ్యాలీ (ప్రస్తుతం సౌదీ అరేబియా) ప్రాంతమంతా కొండలతో కూడిన ఎడారిగా ఉండేది. అల్లా తన భక్తుడైన అబ్రహంకు తనపై ఉన్న నమ్మకాన్ని పరీక్షించాలనుకున్నాడు. అబ్రహంను, అతని భార్య హిజార్‌ను, కొడుకు ఇస్మాయిల్‌ను మక్కా ప్రాంతానికి వెళ్లి- అక్కడ భార్య, కొడుకులను వదిలేసి రమ్మని ఆదేశించాడు. అబ్రహం అల్లా ఆజ్ఞ ప్రకారం మక్కా వ్యాలీకి వెళ్లి అక్కడ వారిని వదిలేసి వచ్చాడు. వారికి కొన్ని రోజులకు సరిపడా ఆహార పదార్థాలు, నీళ్లు వదిలి- బరువైన గుండెతో తన స్వస్థలం కానాన్‌కు తిరిగి వెళ్లిపోయాడు. రోజులు గడిచాయి. ఆహారపదార్థాలు, నీళ్లు అయిపోయాయి. దీనితో ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో హిజార్ తమను రక్షించమని అల్లాను ప్రార్థించింది. ఊహించని విధంగా ఒక అద్భుతం జరిగింది. ఇస్మాయిల్ కాళ్ల దగ్గర నుంచి ఒక నీటి ప్రవాహం ఉవ్వెత్తున ఎగసింది. దీనితో వారి కష్టాలు తీరిపోయాయి. ఇలా కొన్నేళ్లు సాగిన తర్వాత- అబ్రహంను మక్కా వ్యాలీకి వెళ్లమని.. అక్కడ ఒక ప్రార్థనా మందిరాన్ని నిర్మించమని అల్లా ఆజ్ఞాపించాడు. అబ్రహం, ఇస్మాయిల్ - కాబా ప్రాంతంలో ఒక ప్రార్థనా మందిరాన్ని నిర్మించారు. అయితే దీని నిర్మాణం కూడా అంత సులభంగా జరగలేదు. ఈ మందిరాన్ని నిర్మించకుండా సైతాన్ అడ్డుపడ్డాడు. అప్పుడు ఇస్మాయిల్ ఆ సైతాన్‌ను గులకరాళ్లు విసరటం ద్వారా తరిమేశాడు. ఈ రోజుకు ఇస్లాంలో సైతాన్‌ను తరిమివేయటానికి గులకరాళ్లను విసరటం ఒక ప్రధానమైన ఘట్టం.

మరో పరీక్ష..

అబ్రహంకు 99 ఏళ్లు వచ్చాయి. ఆ సమయంలో అల్లా - ఇస్మాయిల్‌ను బలి ఇవ్వమని - మరో పరీక్ష పెట్టాడు. అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకును బలి ఇవ్వటానికి ఏ తండ్రికి మనసు ఒప్పుతుంది? కానీ అబ్రహం మాత్రం ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా ఇస్మాయిల్‌ను బలి ఇవ్వటానికి నిర్ణయించుకున్నాడు. అయితే బలి కావటానికి ఇస్మాయిల్ అంగీకారం కూడా అవసరమే కదా! ఎందుకంటే- అల్లా పట్ల ఇస్మాయిల్‌కు ఉన్న నమ్మకానికి.. తన జీవితాన్ని త్యాగం చేయటానికి అంగీకరించటానికి ఇది ఆఖరి పరీక్ష. ఇస్మాయిల్‌కు బలి విషయం చెప్పినప్పుడు అతను ఏ మాత్రం వెనకడుగు వేయలేదు. "అల్లా నీకు ఇచ్చిన ఆజ్ఞ శిరోధార్యం. ఏ మాత్రం ఆలోచించకు" అని బలికి సిద్ధపడ్డాడు. అబ్రహం కత్తితో ఇస్మాయిల్ తల నరకటానికి ప్రయత్నించాడు. అక్కడ మరో అద్భుతం జరిగింది. ఇస్మాయిల్‌కు ఎటువంటి హాని జరగలేదు. కింద ఒక కొండ జంతువు తల పడి కనిపించింది.

అబ్రహం, ఇస్మాయిల్ - తమకు అల్లా పట్ల ఉన్న విశ్వాసాన్ని చాటుకోవడానికి బలికి సిద్ధపడి ప్రపంచానికి తెలియజేశారు. అయితే కరుణామయుడైన అల్లా తన భక్తులను శిక్షించడు. ఎప్పుడూ రక్షిస్తూనే ఉంటాడు. అయితే భక్తుల విశ్వాసం ఎంత ఉందో తెలుసుకోవటానికి పరీక్షలు పెడుతూనే ఉంటాడు. అబ్రహం, ఇస్మాయిల్‌లు- ఇస్లాం చరిత్రలో విశ్వాసానికి, త్యాగానికి ప్రతీకగా నిలుస్తారు. వారి త్యాగానికి గుర్తుగా- ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముస్లిములందరూ ఈ పండుగను జరుపుకుంటారు. దీనితో పాటు కొందరు- ఖురాన్ పూర్తయి.. మానవాళికి అందిన రోజుగా బక్రీద్‌ను భావించి పండుగ చేసుకుంటారు. అల్లాకు ప్రార్థనలు చేస్తారు.

(16న 'బక్రీద్')

స్వానుభవం

నేను దేవుడి సర్వెంట్‌ని

వైద్యరంగంలో ప్రత్యేక పరిచయం అవసరం లేని పేరు... **డాక్టర్ ఎ.వి. గురవారెడ్డి**. కీళ్ళ వ్యాధుల శస్త్రచికిత్సా నిపుణుడు, కిమ్స్-సన్‌షైన్ ఆసుపత్రుల మేనేజింగ్ డైరెక్టర్ అయిన గురవారెడ్డి మంచి రచయిత కూడా. ఆయన 'నివేదన'తో తన ఆధ్యాత్మిక ఆలోచనలను పంచుకున్నారు.



మీ ఉద్దేశంలో దేవుడు ఎవరు?

ఒక సూపర్ నేచురల్ పవర్ ఉందనేది నా నమ్మకం. అది దేవుడా, మరొకటా అనేది నాకు తెలీదు. నేను దేవుడు లేడనే నాస్తికవాదిని కాను. అలాగని ప్రతి గుడికీ వెళ్ళడం, ఉపవాసాలు ఉండడం, మొక్కులు మొక్కుకోవడం లాంటి భక్తి నాకు లేదు. మనల్ని నడిపించే ఒక అతీతమైన శక్తి ఉందని నేను నమ్ముతాను. వృత్తిపరంగా... క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్న పేషెంట్లకు ఆపరేషన్ చేసేటప్పుడు... ఆ పనిలో దేవుడు లేదా ఒక సూపర్ పవర్ నాకు సాయం చేస్తున్నారనేది నా నమ్మకం.

ఆలయాలకు వెళ్తారా?

వెళ్తాను. కానీ నా అంతట నేను వెళ్ళను. ప్రతినెలా ఒక గుడి, ప్రతి శనివారం ఒక గుడి, ఆరునెలలకొకసారి తిరుపతి వెళ్ళేవారు ఉంటారు. నేను అలా లెక్క ప్రకారం వెళ్ళను. నా భార్య పుట్టినరోజు నాడో, లేదా మా కోడలు రమ్మన్నప్పుడో వాళ్ళతోపాటు వెళ్తాను. మా ఇంట్లో ప్రత్యేకంగా పూజ గది కూడా లేదు. ఒక అలమరాలో దేవుడి ఫొటోలు పెట్టుకుంటాం. నిలబడి, నమస్కారం పెట్టి... అగరుబత్తి వెలిగిస్తాం, అంతే! అలాగే దేవుడితో నాకు అనుభవాలనేవి కూడా ప్రత్యేకంగా ఏవీ లేవు. దేవుడు కలలోకి రావడం లాంటివేవీ లేవు. నేను 'మానవసేవే మాధవసేవ' అని నమ్ముతాను. 'నేను ఇంతమందికి మంచి చేస్తున్నాను, వీళ్ళందరూ నాకోసం ప్రార్థిస్తారు' అనేది నా విశ్వాసం.

మీ భారం వాళ్ళ మీద వేస్తున్నారా...

అంతేకదా! నా భారాన్ని నా పేషెంట్ల మీద వేస్తాను. పెద్దవారైతే ఆశీర్వదిస్తారు. మీరు ఇంకా ఎంతోమందికి సేవ చెయ్యాలంటారు. నా తరఫున వాళ్ళు ప్రార్థిస్తున్నారు. ఇందాక చెప్పినట్టు 'మానవసేవే మాధవసేవ' అని నాకు గట్టి నమ్మకం. నాకు చేతనైతే సేవ చేస్తాను. నాకు తెలిసి నేను ఏ ఒక్క వ్యక్తికీ చెడు చెయ్యలేదు. తెలియక చేసింది ఏదైనా ఉండొచ్చేమో... కాబట్టి దేవుడు నాకు మంచే చేస్తాడు. అదే నాకు గట్టి ధైర్యం, నమ్మకం. అందుకే 'ఐయామ్ బ్లెస్డ్' అని ఎప్పుడూ అంటూ ఉంటాను. ఆ ఆశీస్సులు అందించినది... దేవుడైనా కావచ్చు, మరే శక్తయినా కావచ్చు. మంచి జీవితం ఇచ్చాడు, మంచి కుటుంబాన్ని ఇచ్చాడు, మంచి స్నేహితులనిచ్చాడు, నలుగురికి సేవచేసే మార్గం ఇచ్చాడు. ఇవన్నీ కూడా నాకు దక్కిన దీవెనలే అనుకుంటాను. ఇవన్నీ అందరికీ ఉండవు కదా...

మీరు సైన్స్ స్టూడెంట్ కావడం కూడా మీ దృక్పథం మీద ప్రభావం చూపించిందా?

మీరన్నది నిజమే. కొంత సైన్స్ ప్రభావం కూడా ఉంది. వైద్యాన్నే తీసుకుంటే... ఈ వ్యాధికి ఈ మందు వేస్తే... అది తగ్గిందని నాకు తెలియాలి. ఆ ఎవిడెన్స్ మీదే మొత్తం వైద్యరంగం ఆధారపడి ఉంటుంది. మరి దేవుడు ఉన్నాడనడానికి ఎవిడెన్స్ ఎలా చూపించగలం? కానీ నేను రాముడున్నాడనుకుంటాను, కృష్ణుడు ఉన్నాడనుకుంటాను. దేవుడు ఉన్నాడనే అనుకుంటాను. ఇక బాబాల మీద నాకు నమ్మకం లేదు. కానీ వాళ్ళు చేసిన మంచిపనులను నమ్ముతాను. సత్యసాయిబాబా తన హిప్ జాయింట్ ఆపరేషన్ కోసం నన్ను పిలిపించుకున్నారు. ఉంగరాలు కూడా ఇచ్చారు. అనంతపురం మొత్తానికి నీటి సౌకర్యం కల్పించడం, ఆసుపత్రి కట్టించి రోగులకు సేవ లాంటివి చేశారు. ఆ మంచిపనులను నేను విశ్వసిస్తాను. వాటిని మెచ్చుకుంటాను.

మీ చిన్నప్పుడు ఇంట్లో ఆధ్యాత్మిక వాతావరణం ఉండేదా?

ఉండేది. మా కులదైవం నరసింహస్వామి. మా నాన్న పెద్ద భక్తుడు. పూజలు ఎక్కువగా చేసేవారు. నా వరకూ వస్తే... విద్యార్థి దశలో కూడా నేనెప్పుడూ దేవుణ్ణి ఏదీ కోరుకోలేదు. దేవుణ్ణి అడగడం, కోరింది జరగకపోతే అలగడం... అలాంటివేవీ లేవు. మొదటినుంచి ఇప్పటివరకూ అదే కొనసాగుతోంది. దేవుడైనా, సూపర్ పవరైనా... మన పని మనం చేసుకుంటే... దాని పని అది చేసుకుంటుంది. నేను చెప్పేది ఒక్కటే... ఈ జీవితం ఒక నాటకరంగం. మనమందరం మన పాత్రలు పోషిస్తాం. దేవుడు స్క్రిప్ట్ రాస్తాడు. మనం నటిస్తాం. వెళ్ళిపోతాం. 'మనం ఏదో చేశాం, సాధించాం' అనుకోకూడదు. ఇదంతా ముందుగానే నిర్దేశించి ఉండే విషయం.

అంటే దేవుణ్ణి నమ్ముతున్నట్టే కదా...

ఒక పవర్‌ని నమ్ముతున్నాను. కానీ అందరూ దేవుడు అంటున్నదానికి నేను దేన్నీ ఆపాదించను. మొత్తం ప్రపంచంలో వివరణకు అందనివి జరుగుతూ ఉంటాయి. 'ఈ రోజు ఇంతమంది రోగులకు సేవచెయ్యి. ఇంతమందికి మోకాళ్ళ శస్త్రచికిత్సలు చెయ్యి' అని ఆయన స్క్రిప్ట్ రాశాడు. నేను చేస్తున్నాను. అందుకే ఏ అచీవ్‌మెంట్ సాధించినా... ఇదంతా నా ఘనతేనని నేను అనుకోను. ఆయన రాశాడు, నేను చేశాను... అంతే.

వైద్యో నారాయణో హరిః అంటారు. మీ ద్వారా స్వస్థత పొందినవాళ్ళు మిమ్మల్ని దేవుడిలా చూస్తున్నపుడు మీకెలా అనిపిస్తుంది?

అలా అనేవాళ్ళు ఉంటారు. నేను అభ్యంతరం చెబుతూ ఉంటాను. "నేను దేవుణ్ణి కాదు. దేవుడి సర్వెంట్‌ని. దేవుడు మమ్మల్ని ఇక్కడికి పంపించాడు. మీ అందరికీ సాయం చెయ్యడానికి, సేవ చెయ్యడానికి. అలాగే వైద్యుల్ని దేవుళ్ళనీ అనుకోవద్దు, రాక్షసులనీ అనుకోవద్దు. మామూలు మనుషులని అనుకుంటే చాలు" అని చెబుతాను. విద్య నేర్చుకున్నాను. దాంతో ఉపయోగపడే పని చేస్తున్నాను. నా విద్య, నా అనుభవం, నేను తీసుకున్న శిక్షణతో... నాకు సముచితం అనిపించిన నిర్ణయం తీసుకుంటాను. ఇదంతా ఆ దేవుడు నా చేతుల మీదుగా చేయిస్తున్నాడని అనుకుంటాను. నేను చికిత్స చేస్తున్నాను, ఆయన నయం చేస్తాడు. కాబట్టి వైద్యంలో... నా వంతు నాది, ఆయన వంతు ఆయనది.

సమాజంలో భక్తి ప్రదర్శన ఇటీవల ఎక్కువయిందనే విమర్శను ఎలా చూడాలి?

ఇప్పుడు ఆధ్యాత్మికత, దేవుళ్ళు వ్యాపారంగా మారాయి. భక్తులకు డ్రెస్ కోడ్ లాంటివి కూడా ఎక్కువగానే చూస్తున్నాం. అలాగే ఫ్యాషన్ కూడా అయింది. దాంతో ఇది వరకటికన్నా భక్తికి ప్రదర్శన పెరిగింది. పూర్వం కుటుంబంతో గుడికి వెళ్ళి, కొబ్బరికాయ కొట్టి, బయటికి వచ్చేవాళ్ళు అక్కడితో అయిపోయేది. ఇప్పుడు అలా కాదు... ఏదైనా పండగ వచ్చినప్పుడు... వంద మంది ఫొటోలతో బ్యానర్లు ఎక్కడ చూసినా కనిపిస్తాయి. భక్తిని వ్యక్తీకరించే పద్ధతులు మారాయి.

మీ దృష్టిలో ఆధ్యాత్మికత అంటే...

ఆధ్యాత్మికత అంటే... ప్రపంచాన్ని యథాతథంగా స్వీకరించడం. భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పినట్టు... ఫలితం మంచిదైనా, చెడుదైనా మన పని మనం చిత్తశుద్ధితో చెయ్యాలి. ఇది చేస్తే ఏం వస్తుందనేది ఆలోచించకుండా చెయ్యాలి. ఫలితం మన చేతుల్లో లేదు.

సంభాషణ: కృష్ణశర్మ



హరేకృష్ణ

తీపి దండన

ప్రపంచమంతటా నిర్వహించే దండన మహోత్సవం గురించి మీరు ఎప్పుడైనా విన్నారా? ప్రతి సంవత్సరం జూన్ నెలలో వచ్చే ఈ పండుగను బ్రహ్మ-మధ్వ-గౌడీయ సంప్రదాయాన్ని అనుసరించేవారందరూ కన్నులపండువగా జరుపుకొంటారు. ఈ సంప్రదాయానికే చెందిన... ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న హరేకృష్ణ మూవ్‌మెంట్‌లో కూడా ఈ ఉత్సవాన్ని 'పానిహటి చిడా-దహి దండన మహోత్సవం'గా నిర్వహిస్తారు. దండన అంటే అపరాధికి వేసే శిక్ష. మరి దాన్ని ఉత్సవంగా నిర్వహించుకోవడం ఏమిటి? ఈ వేడుక విశేషాలను తెలుసుకుంటే... ఆ ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది.



20న 'చిడా-దహి మహోత్సవం'

ఈ ఉత్సవాన్ని మొట్టమొదటిసారిగా... అయిదువందల ఏళ్ళ క్రితం 1516లో... పశ్చిమ బెంగాల్‌లోని పానిహటి అనే ప్రదేశంలో... శ్రీచైతన్య మహాప్రభువుల కాలంలో నిర్వహించారు. వేలాది భక్తులకు అటుకులు (చిడా), పెరుగు (దహి)తో తయారు చేసిన మధురమైన పదార్థాలను అందజేశారు.

బహ్మ-మధ్వ-గౌడీయసంప్రదాయంలో కృష్ణ నామ సంకీర్తన మార్గాన్ని విశేషంగా ప్రచారం చేసిన మహాభాగవతోత్తములైన ఆచార్యులు ఎందరో ఉన్నారు. వీరిలో 'షడ్గోస్వాములు'గా పిలిచే బృందావనంలోని ఆరుగురు స్వాములు... అత్యంత ప్రముఖులు. ఆకర్షణీయమైన లౌకిక భోగాలన్నిటినీ గులకరాళ్ళలా పరిగణించి, పరిత్యజించిన భక్తశిఖామణులు. బృందావనంలో కనుమరుగైపోయిన అనేకానేక పవిత్రస్థలాలను వెలికితీసి, కృష్ణతత్త్వాన్ని అద్భుతమైన తమ రచనలతో వారు లోకానికి అందించారు. వారిలో ఒకరైన శ్రీల రఘునాథ దాస గోస్వామి ఈ ఉత్సవానికి మూలకారకులు.

గొప్ప సంపన్నులైన జమీందారీ కుటుంబానికి చెందిన రఘునాథదాసుకు చిన్ననాటినుంచి శ్రీచైతన్య మహాప్రభువులన్నా, శ్రీకృష్ణుడన్నా అమితమైన ఇష్టం. అపారమైన సంపదలు ఉన్నప్పటికీ, వాటి మీద ఆయనకు ఆసక్తి ఉండేది కాదు. నామాచార్యులైన శ్రీల హరిదాస ఠాకూరును బాల్యంలో ఆయన కలుసుకున్నారు. కొంతకాలానికి. శ్రీచైతన్య మహాప్రభువు సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించిన తరువాత... శాంతిపూర్ గ్రామానికి వచ్చారు. అప్పుడు శ్రీచైతన్యులను దర్శించుకున్న రఘునాథదాసు... తన సర్వస్వాన్నీ మహాప్రభువు సేవకే అంకితం చేయాలని నిర్ణయించుకున్నారు. ఆ తరువాత జగన్నాథపురిలో శ్రీచైతన్యులను ఆశ్రయించడానికి అనేకమార్లు ప్రయత్నించి విఫలమయ్యారు. ఒకరోజు... రఘునాథదాసు మనసులో ఒక ఆలోచన మెదిలింది. ముందుగా శ్రీనిత్యానంద ప్రభువును సందర్శిస్తే... చైతన్యులను చేరే మార్గం సుగమం అవుతుందని అనుకున్నారు.కొన్నాళ్ళకు పానిహటి గ్రామంలో శ్రీ నిత్యానంద ప్రభువును రఘునాథదాసు దూరం నుంచి దర్శించుకున్నారు. ముందుగా గురువును ఆశ్రయించనందుకు రఘునాథదాసును నిత్యానందులు మందలిస్తూ "దొంగలా దూరంగా దాక్కున్న నీకు దండన విధిస్తున్నాను. ఇక్కడ భక్తులందరికీ అటుకులు, పెరుగుతో చేసిన మధుర పదార్థాలను వెంటనే వడ్డించు" అని ఆజ్ఞాపించారు. ఎంతో సంతోషించిన రఘునాథదాసు... పాలు, పెరుగు, అటుకులు, అరటిపండ్లు తదితరాలతో రుచికరమైన వంటకాలను సిద్ధం చేసి, భక్తులందరికీ వడ్డిస్తూ... మహా ఉత్సవాన్నే ఏర్పాటు చేశారు. సాక్షాత్తూ బలరాముడి అవతారస్వరూపంగా పేర్కొనే శ్రీనిత్యానంద రాములవారు తన భక్తుడికి వేసిన తీపి దండన ఇది. దేవదేవుని దండన సైతం ఎంత మధురంగా ఉంటుందో కదా! జీవుల పట్ల భగవంతుడికి ఉన్న అపారమైన కరుణకు ఇది నిదర్శనం.

తన భక్తిభావానికి అత్యంత ప్రసన్నులైన శ్రీ నిత్యానందుల కృపతో... రఘునాథుడు తదనంతర కాలంలో శ్రీచైతన్య మహాప్రభువుల సంకీర్తనోద్యమ ప్రచారంలో ప్రథమస్థానంలో నిలిచారు. గోస్వామి స్థాయికి చేరారు. ఆనాటి తీపి దండనకు గుర్తుగా ఈ ఉత్సవాన్ని 'చిడా-దహి మహోత్సవం'గా ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. ఈ ఉత్సవాన్ని ప్రతిఒక్కరూ కుటుంబంతో సులభంగా నిర్వహించుకోవచ్చు. అటుకులు, పాలు, పెరుగు, చక్కర లేదా బెల్లం, పండ్లను కలిపి వంటకాలు సిద్ధం చేసుకోవాలి. వాటిని స్వామికి నివేదించి, స్వీకరించడం ద్వారా భగవంతుడి ఆశీస్సులను పొందవచ్చు. మీకు సమీపంలోని హరేకృష్ణ మందిరంలో జరిగే ఈ ఉత్సవంలో కూడా తప్పక పాల్గొనండి. ముఖ్యంగా... 'హరేకృష్ణ' మంత్రాన్ని జపిస్తూ, ఆనందంగా జీవించండి.



శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984

సద్బోధ

అడగాల్సింది ఆయననే

ఒక రాజ్యంలోని అడవిలో ఒక సన్యాసి ఆశ్రమం ఏర్పాటు చేసుకొని ఉండేవాడు. ఆయనను చాలామంది ప్రజలు దర్శించుకొనేవారు. వారిని చూసినప్పుడల్లా 'అయ్యో! వీరందరూ నా కోసం ఇక్కడికి వస్తున్నారు. అడవిలో ప్రయాణించి అలసిపోతున్న వీరికి నేను ఎలాంటి సదుపాయాలూ చేయలేకపోతున్నాను' అని ఆయన బాధపడేవాడు. కానీ వందల మందికి వసతి కల్పించే స్థోమత సన్యాసి అయిన అతనికెక్కడిదీ? కాబట్టి రాజ్యాన్ని పాలించే రాజు దగ్గరకు వెళ్ళి.. సహాయం కోరాలనుకున్నాడు.

ఆ సన్యాసి ఒక రోజు... రాజ మందిరానికి వచ్చాడు. సాధువులకు, సన్యాసులకు ఆ చక్రవర్తి మందిర ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉండేవి. ద్వారపాలకులు ఆయనకు స్వాగతం పలికారు. ఆ సమయంలో ఆ రాజు తన ధ్యానమందిరంలో ప్రార్థన చేస్తున్నాడు. సన్యాసిని ద్వారపాలకులు అక్కడికి తీసుకువెళ్ళి, ఆసనం మీద కూర్చోబెట్టారు.

"ఓ దైవమా! నాకు ధనాన్ని ఇవ్వు. సంపదను అనుగ్రహించు" అంటూ దేవుణ్ణి ఆ రాజు వేడుకోవడం ఆ సన్యాసికి వినిపించింది. వెంటనే కుర్చీలోంచి లేచాడు.



ఆ శబ్దానికి వెనక్కి తిరిగిన రాజు.. ఆయనను కూర్చోమని సైగ చేశాడు. ప్రార్థన ముగించుకొని సన్యాసి దగ్గరకు వచ్చి "మీరు నన్ను కలుసుకోవడానికి వచ్చారు. కానీ నాతో ఒక్క మాట మాట్లాడకుండా తిరిగి వెళ్ళిపోతున్నారు. ఇంతకీ మీకు ఏం కావాలి?" అని అడిగాడు.

"ప్రభూ! ఆ సంగతి చెప్పి మిమ్మల్ని ఇబ్బంది పెట్టదలచుకోలేదు. నేను బయలుదేరుతున్నాను" అన్నాడు సన్యాసి.

"కాదు. మీరు చెప్పి తీరాల్సిందే" అని బలవంతపెట్టాడు రాజు.

"చాలామంది జనం నా ఆశ్రమానికి వస్తూ ఉంటారు. వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పించలేకపోతున్నాను. అందుకని మిమ్మల్ని డబ్బు అడగడానికి ఇక్కడికి వచ్చాను" అని చెప్పాడు సన్యాసి.

"మరి నన్ను అడగకుండానే వెళ్ళిపోతున్నారేం?" అని ప్రశ్నించాడు రాజు.

"నేను మిమ్మల్ని యాచించడం కోసం వచ్చాను. మీరు కూడా యాచకుడేనని తెలుసుకున్నాను. మీరు డబ్బు కోసం, సంపదల కోసం దేవుణ్ణి ప్రార్థిస్తున్నారు. అప్పుడు నాకు అనిపించింది... ఒక యాచకుణ్ణి నేనెందుకు యాచించాలి? నేరుగా ఆ భగవంతుణ్ణే యాచిస్తే సరిపోతుంది కదా!" అని చెబుతూ బయటకు నడిచాడు.

ఒక సందర్భంలో... రామకృష్ణ పరమహంస తన శిష్యులకు ఈ కథ చెబుతూ... "పేదవారు తమ ఇబ్బందులు తీరాలని కోరుకుంటారు. సంపన్నులు ఇంకా సంపద కావాలని తపిస్తారు. దానికోసం ఇరువురూ దేవుణ్ణి రకరకాలుగా ప్రార్థిస్తారు. సర్వప్రాణులకూ పోషకుడు ఆ భగవంతుడే. మన కర్మను మనం ఆచరిస్తూ, ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తే మనకు కావలసినవన్నీ ఆయనే ఇస్తాడు. కాబట్టి మనకు ఏది కావలసినా కోరాల్సిందీ, ప్రార్థించాల్సినదీ ఆయననే" అని ఉపదేశించారు.

సుభాషితం

విద్యతోనే వినయం

యదా కించిద్‌జ్ఞోహం ద్విప ఇవ మదాంధః సమభవం
తదా సర్వజ్ఞోస్మీత్యభవ దవలిప్తం మమ మనః
యదా కించిత్కించిద్బుధజన సకాశాదవగతం
తదా మూర్ఖోస్మీతి జ్వర ఇవ మదో మే వ్యపగతః

విద్యతోనే వినయం వస్తుందని వివరిస్తూ భర్తృహరి తన నీతిశతకంలో చెప్పిన ఈ శ్లోకాన్ని...

తెలివి యొకింత లేని యెడ దృప్తుడనై కరి భంగి సర్వమున్
దెలిసితి నంచు గర్వితమతిన్ విహరించితి దొల్లి, యిప్పుడు
జ్వలమతులైన పండితుల సన్నిధి నించుక బోధశాలినై
తెలియనివాడనై మెలంగితిన్, గతమయ్యె నితాంత గర్వమున్...

అంటూ తెలుగులోకి అనువదించారు ఏనుగు లక్ష్మణకవి.

భావం! నాకు స్వల్పమైన జ్ఞానం ఉన్నప్పుడు... అంతా నాకే తెలుసనే గర్వంతో మదించిన ఏనుగులా కన్నూ మిన్నూ కానకుండా ప్రవర్తించాను. ఆ తరువాత పండితుల సన్నిధిలో... వాళ్ళు చెప్పినవి వింటూ ఉంటే కొంచెం కొంచెంగా అన్నీ తెలిసి వచ్చాయి. అప్పుడు నాకేదీ తెలియదని తెలుసుకున్నాను. నా గర్వాన్ని వదిలిపెట్టాను. ఏదీ తెలియనివాడిలా మెలిగాను. వివేకవంతుణ్ణి అయ్యాను" అంటున్నాడు భర్తృహరి. విద్యతో వినయాన్ని పెంచుకోవాలి. మిడిమిడి జ్ఞానంతో అహంకారంగా ప్రవర్తించకూడదు.

బిజినెస్

విజయవాడ ● శుక్రవారం 14 జూన్ 2024

శాటిలైట్ ఇంటర్నెట్ సేవల్లోకి జియో

న్యూఢిల్లీ: త్వరలో అత్యంత వేగవంతమైన శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించేందుకు జియోకు మార్గం సుగమమైంది. ఈ సేవలందించేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన జియో ప్లాట్‌ఫామ్, లక్సెంబర్గ్‌కు చెందిన ఎస్ఈఎస్ ఏర్పాటు చేసిన ఉమ్మడి భాగస్వామ్య సంస్థ 'ఆర్బిట్ కనెక్ట్ ఇండియా'కు భారత అంతరిక్ష నియంత్రణ మండలి ఇన్-స్పేస్ అనుమతి మంజూరు చేసింది. ఈ కంపెనీకి శాటిలైట్ కమ్యూనికేషన్ సర్వీసెస్ లైసెన్స్‌తోపాటు ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ లైసెన్సును టెలికాం శాఖ ఇప్పటికే జారీ చేసింది. తాజాగా ఇన్-స్పేస్ నుంచీ క్లియరెన్స్ లభించిన నేపథ్యంలో ట్రయల్ సేవలను ప్రారంభించేందుకు స్పెక్ట్రమ్‌ను కేటాయించాలని టెలికాం శాఖను ఆర్బిట్ కనెక్ట్ కోరింది.

'డాలర్' ప్రచారకర్తగా మహేశ్ బాబు




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బ్రాండెడ్ హోసరీ ఉత్పత్తుల సంస్థ డాలర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ దక్షిణాది రాష్ట్రాల మార్కెట్లో పట్టును చేజిక్కించుకునేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా వచ్చే మూడేళ్ల కాలంలో కొత్తగా 50 ఎక్స్‌క్లూజివ్ బ్రాండెడ్ ఔట్‌లెట్స్‌ను ప్రారంభించనున్నట్లు గురువారం నాడిక్కడ సంస్థ ఎండీ వినోద్ కుమార్ గుప్తా వెల్లడించారు. అంతేకాకుండా దక్షిణాదిలో వినియోగదారులకు మరింత చేరువయ్యే ఉద్దేశంతో టాలీవుడ్ హీరో మహేశ్ బాబును ప్రచారకర్తగా నియమించుకున్నట్లు ఆయన వెల్లడించారు. దక్షిణాది బ్రాండెడ్ హోసరీ మార్కెట్లో ప్రస్తుతం డాలర్ ఇండస్ట్రీస్ వాటా 8 శాతంగా ఉందని దీన్ని 20 శాతానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గుప్తా తెలిపారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తం విక్రయాల్లో దక్షిణాది వాటాను 50 శాతానికి చేర్చాలని చూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందుకు మహేశ్ బాబు ప్రచారం ఎంతగానో దోహదపడుతుందని భావిస్తున్నట్లు గుప్తా తెలిపారు.

అదానీ గూటికి పెన్నా సిమెంట్

డీల్ విలువ రూ.10,422 కోట్లు

100% వాటా కొనుగోలు చేసిన అంబుజా సిమెంట్



దక్షిణ భారత మార్కెట్‌పై మరింత పట్టు

శ్రీలంక మార్కెట్లోకి ప్రవేశం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశ సిమెంట్ రంగంలో మరో భారీ కొనుగోలు చోటు చేసుకుంది. అదానీ గ్రూప్ సిమెంట్ కంపెనీ అంబుజా సిమెంట్.. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే పెన్నా సిమెంట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (పీసీఐఎల్)ను కొనుగోలు చేసింది. పెన్నా సిమెంట్ ప్రధాన ప్రమోటర్ పీ ప్రతాప్ రెడ్డి, అతని కుటుంబ సభ్యుల నుంచి 100 శాతం వాటాలను రూ.10,422 కోట్ల ఎంటర్‌ప్రైజ్ వాల్యూకి (అప్పులు, నగదు నిల్వలతో కలిపి) చేజిక్కించుకున్నట్లు అంబుజా సిమెంట్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. ఈ మేరకు పెన్నా సిమెంట్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది.

నాలుగు నెలల్లో డీల్ పూర్తి: ప్రభుత్వ, రెగ్యులేటరీ సంస్థల నుంచి వెంటనే అనుమతులు లభిస్తే మూడు నుంచి నాలుగు నెలల్లోనే ఈ కొనుగోలు ప్రక్రియ పూర్తవుతుందని అంబుజా సిమెంట్ సీఈఓ, హోల్‌టైమ్ డైరెక్టర్ అజయ్ కపూర్ వెల్లడించారు. ఈ కొనుగోలుకు అవసరమైన నిధులను పూర్తిగా అంతర్గత వనరుల నుంచి సమకూర్చుకోనున్నట్లు ఆయన తెలిపారు. కాగా పెన్నా సిమెంట్ కొనుగోలుతో అదానీ గ్రూప్ వార్షిక సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం మరో 1.4 కోట్ల టన్నులు పెరిగి మొత్తం 8.9 కోట్ల టన్నులకు చేరనుంది. ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ అల్ట్రాటెక్ సిమెంట్ తర్వాత దేశంలో మరే సిమెంట్ కంపెనీకి ఇంత ఉత్పత్తి సామర్థ్యం లేదు. దక్షిణాది మార్కెట్లో వాటాను పెంచుకునేందుకు పీసీఐఎల్ కొనుగోలు ఎంతగానో దోహదపడటమే కాకుండా దేశవ్యాప్తంగా సిమెంట్ రంగంలో అగ్రస్థానాన్ని దక్కించుకునేందుకు మార్గం సుగమం కానుందని కపూర్ తెలిపారు.

4 రాష్ట్రాల్లో పెన్నా సిమెంట్ యూనిట్లు: 1991లో కార్యకలాపాలు ప్రారంభించిన పెన్నా సిమెంట్.. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని తలారిచెరువు, బోయరెడ్డిపల్లి, తెలంగాణలోని గణేశ్‌పహడ్, తాండూరు, మహారాష్ట్రలోని పటాస్ వద్ద సిమెంట్, క్లింకర్ యూనిట్లను నిర్వహిస్తోంది. మరోవైపు శ్రీలంకలో నేరుగా, స్థానిక అనుబంధ సంస్థ ద్వారా పెన్నా సిమెంట్ కార్యకలాపాలు సాగిస్తోంది. ఈ ప్లాంట్ల వార్షిక సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం కోటి టన్నులుగా ఉంది. పెన్నా సిమెంట్‌కు చెందిన ప్లాంట్లలో ఎక్కువ భాగం రైల్వే లైన్లకు సమీపంలో ఉన్నాయి. కాగా కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నం వద్ద ఏటా 20 లక్షల టన్నుల సామర్థ్యం గల ప్లాంట్‌తో పాటు రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ వద్ద ఏటా 20 లక్షల టన్నుల సామర్థ్యంతో కొత్త ప్లాంట్లను ఏర్పాటు చేస్తోంది. వచ్చే ఆరు నుంచి 12 నెలల కాలంలో ఈ ప్లాంట్లు వాణిజ్యపరంగా అందుబాటులోకి రానున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో పెన్నా సిమెంట్ కన్సాలిడేటెడ్ టర్నోవర్ రూ.1,241 కోట్లుగా ఉంది.

మార్కెట్‌పై మరింత పట్టు: పెన్నా సిమెంట్ కొనుగోలుతో దక్షిణ భారత మార్కెట్లో అదానీ గ్రూప్ వాటా 8 శాతానికి పెరగనుంది. దేశవ్యాప్తంగా చూసినా మార్కెట్ వాటా 2 శాతానికి పెరుగుతుందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోవైపు పెన్నా సిమెంట్‌కు మంచి సున్నపురాయి గనులు కూడా ఉండటం అదానీ గ్రూప్‌నకు కలిసిరానుంది. దీంతో 2028 మార్చి నాటికి వార్షిక సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 14 కోట్ల టన్నులకు పెంచుకోవాలన్న అదానీ గ్రూప్ కల నెరవేరనుంది.

మరిన్ని కొనుగోళ్లు!

పెన్నా సిమెంట్ కొనుగోలు పూర్తి కావడంతో అదానీ గ్రూప్ ఇప్పుడు సౌరాష్ట్ర సిమెంట్, జైపీ అసోసియేట్స్ సిమెంట్ ప్లాంట్లు, ఏబీజీ షిప్‌యార్డ్ అనుబంధ సంస్థ వద్రాజ్ సిమెంట్ కంపెనీలపై కన్నేసింది. ఇందులో వద్రాజ్ సిమెంట్, జైపీ సిమెంట్స్ దివాలా ప్రక్రియలో ఉన్నాయి. అదానీ గ్రూప్ సరైన ఆఫర్ ఇస్తే ఈ రెండు సంస్థల రుణదాతలు వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు ఆమోదించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

సువెన్ చేతికి సపాలా ఆర్గానిక్స్

రూ.229 కోట్లకు 67.5% వాటా కొనుగోలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రం గా కార్యకలాపాలు సాగిస్తున్న సపాలా ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజ్‌మెంట్ చేతులు మారుతోంది. ఈ కంపెనీ ఈక్విటీలో 67.5 శాతం వాటాలను రూ.229.50 కోట్లకు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సువెన్ ఫార్మా కొనుగోలు చేసింది. రెగ్యులేటరీ సంస్థల నుంచి అనుమతులు లభిస్తే ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికల్లా ఈ కొనుగోలు పూర్తి అవుతుందని సువెన్ ఫార్మా తెలిపింది. మిగతా వాటా కొనుగోలు 2026-27 ఆర్థిక సంవత్సరంలో పూర్తి కానుంది. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఒలిగో బిల్డింగ్ బ్లాక్స్ న్యూక్లిక్ యాసిడ్‌ల తయారీలో సపాలా ఆర్గానిక్స్ కంపెనీకి మంచి పేరుంది. ఈ ఉత్పత్తులను కంపెనీ కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఆర్గనైజేషన్ (సీడీఎంఓ) పద్ధతిలో తయారు చేసి అనేక కంపెనీలకు సరఫరా చేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం కంపెనీ రూ.67 కోట్ల టర్నోవర్‌పై 45 శాతం స్థూల లాభాన్ని నమోదు చేసింది. ఈ కొనుగోలు తర్వాత కూడా సపాలా ఆర్గానిక్స్ ప్రమోటర్ డాక్టర్ పీ ఎల్లారెడ్డి కంపెనీకి సీఈఓగా కొనసాగుతారు. దీనికి తోడు జపాన్ మార్కెట్‌కు సంబంధించి సువెన్-చాన్స్ ప్లాట్‌ఫామ్‌కు వ్యూహాత్మక సలహాదారుగా వ్యవహరిస్తారు.

ఐదేళ్లలో కొత్తగా 75 షోరూమ్‌లు

జోయాలుక్కాస్ ఈడీ మాథ్యూ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆభరణాల రిటైలింగ్‌లోని జోయాలుక్కాస్ వచ్చే ఐదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా కొత్తగా 75 షోరూమ్‌లు ప్రారంభించనుంది. ప్రస్తుతం దేశంలో 97 షోరూమ్‌లు నడుస్తుండగా మరో రెండు వారాల్లో వాటి సంఖ్య 100కి చేరనుంది. గురువారం హైదరాబాద్‌లోని కొండాపూర్ లో కొత్త షోరూమ్ ప్రారంభించిన సందర్భంగా కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ థామస్ మాథ్యూ మాట్లాడుతూ ఈ విషయం వెల్లడించారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం 17 షోరూమ్‌లుండగా కొత్తగా ప్రారంభించిన ఈ షోరూమ్ అతి పెద్దదని ఆయన అన్నారు. తెలుగు రాష్ట్రాలు రెండింటిలో కలిపి తమకు 30 షోరూమ్‌లున్నాయని, వచ్చే వారం విజయవాడలో మరో షోరూమ్ ప్రారంభిస్తున్నట్టు ఆయన చెప్పారు. విదేశాల్లో తమకు 60 షోరూమ్‌లున్నాయని, కొత్త మార్కెట్లలో విస్తరణ అవకాశాలు అన్వేషిస్తున్నామన్నారు. అయితే ఇప్పటివరకు ఎంత పెట్టుబడి పెట్టింది వెల్లడించడానికి నిరాకరించారు. ఇప్పటివరకు పెట్టుబడి అవసరాలన్నింటికీ సొంత నిధుల పైనే ఆధారపడినట్టు ఆయన చెప్పారు. పబ్లిక్ ఇష్యూకి వచ్చే ఆలోచన తక్షణం లేదని మాథ్యూ అన్నారు. కాగా త్వరలో జోయాలుక్కాస్ ఆరోగ్య సంరక్షణ రంగంలోకి కూడా అడుగు పెట్టనుంది. కేరళలోని త్రిసూర్‌లో ఒక ఆస్పత్రి ఏర్పాటు చేయబోతున్నట్టు ఆయన వెల్లడించారు.

బిగ్ సీలో సామ్‌సంగ్ గెలాక్సీ ఏఐ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మొబైల్ ఫోన్ల రిటైల్ విక్రయ సంస్థ బిగ్ సీ.. సామ్‌సంగ్ గెలాక్సీ ఏఐ సిరీస్ స్మార్ట్‌ఫోన్ల విక్రయాలను ప్రారంభించినట్లు ప్రకటించింది. శుక్రవారం నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని అన్ని బిగ్ సీ షోరూమ్‌ల్లో ఈ స్మార్ట్‌ఫోన్లు అందుబాటులో ఉంటాయని సంస్థ ఫౌండర్ బాలు చౌదరి వెల్లడించారు. అత్యంత అధునాతన ఫీచర్లతో కూడిన ఈ ఏఐ సిరీస్ స్మార్ట్‌ఫోన్ల ప్రారంభ ధర రూ.39,999గా ఉందని ఆయన తెలిపారు. సర్కిల్ టు సెర్చ్, లైవ్ ట్రాన్స్‌లేట్, చాట్ అసిస్ట్, 50 ఎంపీ అడాప్టివ్ పిక్సెల్ టెక్నాలజీతో కూడిన కెమెరా, నైటోగ్రఫీ, ఏఐ ఎడిట్ కెమెరా, స్నాప్‌డ్రాగన్ 8జెన్ వంటి ప్రత్యేక ఫీచర్లు ఈ ఫోన్‌లో ఉన్నాయి. ఈ స్మార్ట్‌ఫోన్స్ కొనుగోలుపై రూ.16,000 వరకు ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్, రూ.18,000 వరకు ఎక్స్ఛేంజ్ బోనస్ వంటి ఆకర్షణీయమైన ఆఫర్లతో పాటు జీరో డౌన్‌పేమెంట్, 24 నెలల నో కాస్ట్ ఈఎంఐ వంటి సదుపాయాలు తమ షోరూమ్‌ల్లో అందుబాటులో ఉంటాయని బిగ్ సీ తెలిపింది.

రూ.431 లక్షల కోట్లు

» ఆల్‌టైం రికార్డు స్థాయికి స్టాక్ మార్కెట్ సంపద
» సరికొత్త జీవితకాల గరిష్ఠాలకు సెన్సెక్స్, నిఫ్టీ

ముంబై: గత నెలలో వినియోగదారుల ధరల సూచీ ఏడాది కనిష్ఠ స్థాయి 4.75 శాతానికి జారుకున్న నేపథ్యంలో ఆర్‌బీఐ కీలక వడ్డీ రేట్లను తగ్గించవచ్చన్న అంచనాలు స్టాక్ మార్కెట్‌కు కొత్త ఉత్సాహాన్నిచ్చాయి. దాంతో ఇన్వెస్టర్లు రియల్టీ, క్యాపిటల్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఇండస్ట్రియల్స్ రంగ షేర్లలో కొనుగోళ్లు పెంచడంతో సూచీలు గురువారం సరికొత్త శిఖరాలను అధిరోహించాయి. ఒక దశలో సెన్సెక్స్ 538.89 పాయింట్ల లాభంతో 77,145.46 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 204.33 పాయింట్ల లాభంతో 76,810.90 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ఒక దశలో 158.1 పాయింట్లు ఎగబాకి 23,481.05 వద్ద ఇంట్రాడే రికార్డును, చివరికి 75.95 పాయింట్ల వృద్ధితో 23,398.90 వద్ద కొత్త గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. సూచీలు లాభపడటం వరుసగా ఇది రెండో రోజు. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఈ రెండు రోజుల్లో రూ.4.72 లక్షల కోట్లకు పైగా పెరిగి ఆల్‌టైమ్ రికార్డు స్థాయి రూ.431.67 లక్షల కోట్లకు (5.17 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



14వ తేదీ			
హైదరాబాద్	530	విజయవాడ	530
వరంగల్	532	గోదావరి	525
చిత్తూరు	593	విశాఖపట్నం	530
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	136	గోదావరి	142
వరంగల్	136	విజయవాడ	142
కరీంనగర్	136	గుంటూరు	144
మహబూబ్‌నగర్	136	ఒంగోలు	144
కర్నూలు	136	చిత్తూరు	148
విశాఖపట్నం	134		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,170 ▲	66,160 ▲	95,200 ▼
ముంబై	71,513 ▼	65,506 ▼	87,847 ▼

టాటా పంచ్, నెక్సన్ ఈవీలకు భారత్ ఎన్‌క్యాప్ రేటింగ్

న్యూఢిల్లీ: టాటా మోటార్స్ విద్యుత్ కార్లు పంచ్ ఈవీ, నెక్సన్ ఈవీలు భారత్-ఎన్‌క్యాప్ కార్యక్రమం కింద ఫైవ్ స్టార్ రేటింగ్ పొందాయి. విద్యుత్ కార్ల విభాగంలో ఈ రేటింగ్ సాధించిన తొలి వాహనాలివే. ఈ ఘనత సాధించినందుకు టాటా మోటార్స్‌ను అభినందిస్తూ రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరి ఎక్స్‌లో ఒక సందేశం పోస్ట్ చేశారు. కొనుగోలుదారులు మార్కెట్లో అందుబాటులో ఉన్న వాటిలో అత్యంత సురక్షితమైన వాహనాలు ఎంచుకోవడానికి ఈ రేటింగ్ ఉపయోగపడుతుందని ఆయన అన్నారు.

స్పోర్ట్స్

బంగ్లా రేసులోనే..

నెదర్లాండ్స్‌పై కీలక విజయం

రాణించిన షకీబ్.. టీ20 వరల్డ్‌కప్



షకీబ్ అల్ హసన్ (46 బంతుల్లో 64 నాటౌట్)

కింగ్‌స్టౌన్: బంగ్లాదేశ్ తమ సూపర్-8 ఆశలను మరింత మెరుగుపర్చుకుంది. గ్రూప్ 'డి'లో తమకు పోటీగా ఉన్న నెదర్లాండ్స్‌పై గురువారం జరిగిన మ్యాచ్‌లో 25 రన్స్ తేడాతో విజయం సాధించింది. ప్రస్తుతం నాలుగు పాయింట్లతో ఉన్న ఈ జట్టు చివరి మ్యాచ్‌లో నేపాల్‌తో ఆడనుంది. బ్యాటింగ్‌లో షకీబ్ అల్ హసన్ (46 బంతుల్లో 9 ఫోర్లతో 64 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో రాణించగా.. పేసర్ రిషాద్ హొస్సేన్ (3/33) కీలక వికెట్లతో దెబ్బతీశాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 159 పరుగులు చేసింది. తన్‌జీద్ హసన్ (35), మహ్మదుల్లా (25) రాణించారు. వాన్ మీకెరెన్, ఆర్యన్ దత్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో నెదర్లాండ్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 134 పరుగులు చేసి ఓడింది. ఏంజెల్‌బ్రెట్ (33), విక్రమ్‌జిత్ (26), ఎడ్వర్డ్స్ (25) పర్వాలేదనిపించారు. టస్కిన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా షకీబ్ నిలిచాడు.

ఆఖర్లో తడబాటు: ఛేదనలో నెదర్లాండ్స్ ఆటతీరు బాగానే ఉన్నా చివరి ఆరు ఓవర్లలో తడబాటు దెబ్బతీసింది. పవర్‌ప్లేలో ఓపెనర్లు లెవిట్ (18), ఓడౌడ్ (12) వికెట్లను కోల్పోగా, విక్రమ్‌జిత్ ఉన్నకాసేపు వేగం చూపుతూ మూడు సిక్సర్లతో ఆకట్టుకున్నాడు. ఏంజెల్‌బ్రెట్‌తో తను మూడో వికెట్‌కు 37 పరుగులు అందించాడు. ఆ తర్వాత కెప్టెన్ ఎడ్వర్డ్స్, ఏంజెల్ బంగ్లా బౌలర్లను దీటుగా ఎదుర్కోవడంతో జట్టు విజయం వైపు వెళ్తున్నట్టనిపించింది. 14వ ఓవర్ వరకు సజావుగా సాగిన డచ్ ఛేజింగ్ ఆ తర్వాత పూర్తిగా తడబడింది. 15వ ఓవర్‌లో ఏంజెల్‌బ్రెట్, బాస్ డి లీడ్ (0)లను రిషాద్ అవుట్ చేయడంతో మరిక కోలుకోలేకపోయింది.

షకీబ్ అర్ధసెంచరీ: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్‌ను ఆల్‌రౌండర్ షకీబ్ ఆదుకున్నాడు. నాలుగో ఓవర్‌లోనే బరిలోకి దిగిన తను అజేయ హాఫ్ సెంచరీతో చివరికంటా నిలిచాడు. రెండో ఓవర్‌లోనే కెప్టెన్ షంటో (1)కు స్పిన్నర్ ఆర్యన్ షాకిచ్చాడు. ఇక అతడి తర్వాత ఓవర్‌లో లిట్టన్ దాస్ (1) ఇచ్చిన క్యాచ్‌ను ఏంజెల్‌బ్రెట్ సూపర్ డైవింగ్‌తో అందుకున్న తీరు హైలైట్‌గా నిలిచింది. కానీ మరో ఓపెనర్ తన్‌జీద్ మూడో ఓవర్‌లో 4,6,4తో 18 రన్స్ రాబట్టాడు. అటు షకీబ్ కూడా వేగం కనబర్చుతూ ఆరో ఓవర్‌లో నాలుగు ఫోర్లతో చెలరేగి 19 రన్స్ అందించడంతో పవర్‌ప్లేలో 54/2 స్కోరుతో నిలిచింది. కానీ చక్కగా కుదురుకున్న తన్‌జీద్‌ను పదో ఓవర్‌లో వాన్ మీకెరెన్ దెబ్బతీయడంతో మూడో వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తౌహిద్ (9) విఫలమైనా షకీబ్‌కు మహ్మదుల్లా జత కలిశాడు. 17వ ఓవర్‌లో అతడు 6,4తో ఆకట్టుకున్నా.. తర్వాతి ఓవర్‌లోనే వాన్‌మీకెరెన్ చేతికి చిక్కాడు. నాలుగో వికెట్‌కు వీరి మధ్య 41 పరుగులు సమకూరాయి. చివర్లో జాకెర్ అలీ (14 నాటౌట్) మూడు ఫోర్లు, ఆఖరి ఓవర్‌లో షకీబ్ రెండు ఫోర్లతో స్కోరు 150 దాటింది.

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

అఫ్ఘానిస్థాన్ x పపువా న్యూగినీ (ఉ.6. గం.)
అమెరికా x ఐర్లాండ్ (రా.8. గం.)

పాయింట్ల పట్టిక — గ్రూప్-డి

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
దక్షిణాఫ్రికా	3	3	0	0	6	0.603
బంగ్లాదేశ్	3	2	1	0	4	0.478
నెదర్లాండ్స్	3	1	2	0	2	-0.408
నేపాల్	2	0	1	1	1	-0.539
శ్రీలంక	3	0	2	1	1	-0.777

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

సంక్షిప్త స్కోర్లు

బంగ్లాదేశ్: 20 ఓవర్లలో 159/5. (షకీబ్ 64 నాటౌట్, తన్‌జీద్ హసన్ 35, మహ్మదుల్లా 25; వాన్ మీకెరెన్ 2/15, ఆర్యన్ దత్ 2/17)
నెదర్లాండ్స్: 20 ఓవర్లలో 134/8 (ఏంజెల్‌బ్రెట్ 33, విక్రమ్‌జిత్ 26, ఎడ్వర్డ్స్ 25; రిషాద్ 3/33, టస్కిన్ 2/30

కివీస్ కథ ముగిసినట్టే!

సూపర్-8కు వెస్టిండీస్



రూథర్‌ఫోర్డ్ (39 బంతుల్లో 68 నాటౌట్)

- 13 పరుగులతో ఓటమి
- రూథర్‌ఫోర్డ్ ధనాధన్ అర్ధ శతకం
- జోసెఫ్‌కు 4 వికెట్లు



కేన్

టరోబా (ట్రినిడాడ్): గత టోర్నీ సెమీఫైనలిస్ట్ న్యూజిలాండ్.. టీ20 వరల్డ్‌కప్ తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టడం దాదాపు ఖాయమైంది. గ్రూప్-సిలో గురువారం తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో కివీస్ 13 పరుగుల తేడాతో వెస్టిండీస్ చేతిలో చిత్తయింది. క్లిష్ట సమయంలో షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (39 బంతుల్లో 68 నాటౌట్) అర్ధ శతకంతోపాటు బౌలర్లు చెలరేగడంతో.. విండీస్ సూపర్-8కు దూసుకెళ్లింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి మొత్తం ఆరు పాయింట్లతో తర్వాతి దశకు అర్హత సాధించింది. కాగా, న్యూజిలాండ్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటమిపాలైంది. కివీస్ సూపర్-8కు చేరాలంటే..అఫ్ఘానిస్థాన్ జట్టు మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటమిపాలవ్వాలి. అలాగే మైనస్ రన్‌రేట్‌తో ఉన్న కివీస్ భారీ విజయాలు సాధించాలి. ఇది దాదాపు అసాధ్యమనే చెప్పాలి. ఇప్పటికే భారీ రన్‌రేట్ (+5.225)తో ఉన్న అఫ్ఘాన్ జట్టు పసికూన పపువా న్యూ గినీ, వెస్టిండీస్‌లతో ఆడాల్సివుంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన విండీస్ 20 ఓవర్లలో 149/9 స్కోరు చేసింది. న్యూజిలాండ్ పేసర్లు బౌల్ట్ (3/16), సౌథీ (2/21) విజృంభించడంతో.. విండీస్ 22/4తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో ఆరో నెంబర్‌లో బ్యాటింగ్‌కు దిగిన రూథర్‌ఫోర్డ్ ఎడాపెడా షాట్లతో కివీస్ బౌలింగ్‌ను ఉతికి ఆరేశాడు. చివరి రెండు ఓవర్లలో 19, 18 పరుగులు పిండుకొన్న రూథర్‌ఫోర్డ్ జట్టుకు పోరాడగలిగే స్కోరును అందించాడు. అనంతరం ఛేదనలో న్యూజిలాండ్ ఓవర్లన్నీ ఆడి 136/9 స్కోరు మాత్రమే చేసింది. ఫిలిప్స్ (40), ఫిన్ అలెన్ (26), శాంట్నర్ (21) కొంతసేపు పోరాడారు. అల్జారీ జోసెఫ్ (4/19) నాలుగు వికెట్లు, గుడకేష్ (3/25) మూడు వికెట్లతో కివీస్ బ్యాటింగ్ వెన్నువిరిచారు.

పాయింట్ల పట్టిక — గ్రూప్-సి

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
వెస్టిండీస్	3	3	0	0	6	2.596
అఫ్ఘానిస్థాన్	2	2	0	0	4	5.225
ఉగాండా	3	1	2	0	2	-4.217
పీఎన్‌జీ	2	0	2	0	0	-0.434
న్యూజిలాండ్	2	0	2	0	0	-2.425

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

సంక్షిప్త స్కోర్లు

వెస్టిండీస్: 20 ఓవర్లలో 149/9 (రూథర్‌ఫోర్డ్ 68 నాటౌట్, బౌల్ట్ 3/16, సౌథీ 2/21). **న్యూజిలాండ్:** 20 ఓవర్లలో 136/9 (ఫిలిప్స్ 40, ఫిన్ అలెన్ 26; జోసెఫ్ 4/19, గుడకేష్ 3/25).

క్వార్టర్స్‌లో ప్రణయ్, సమీర్



సిడ్నీ: భారత షట్లర్లు హెచ్ఎస్ ప్రణయ్, సమీర్ వర్మ ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. అలాగే మిక్స్‌డ్‌లో సుమిత్, సిక్కిరెడ్డి జోడీ కూడా ముందంజ వేసిం ది. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రౌండ్-16 మ్యాచ్‌లో ఐదో సీడ్ ప్రణయ్ 21-17, 21-15తో మిషా జిల్బెర్‌మన్ (ఇజ్రాయెల్)ను చిత్తు చేశాడు. హోరాహోరీగా సాగిన మరో మ్యాచ్‌లో సమీర్ 21-14, 14-21, 21-19తో కీన్ యూ (సింగపూర్)కు షాకిచ్చాడు. ఇక..కిరణ్ జార్జ్ 20-22, 6-21తో నిషిమోటో చేతిలో ఓడిపోయాడు. మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్ 21-16, 21-13తో కాయ్ క్వి (ఆస్ట్రేలియా)పై నెగ్గి రౌండ్-8లో అడుగుపెట్టింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సుమిత్ రెడ్డి, సిక్కిరెడ్డి ద్వయం 21-11, 21-11తో కాయ్ చెన్, కాయ్ క్వి (ఆస్ట్రేలియా) జోడీపై విజయంతో క్వార్టర్స్ చేరింది. ఇక..మహిళల సింగిల్స్‌లో అనుపమా ఉపాధ్యాయ, మాళవికా బన్సోడ్, డబుల్స్‌లో రితూ పర్ణ, శ్వేతా పర్ణ పరాజయంతో టోర్నీ నుంచి నిష్క్రమించారు.

వరల్డ్ జూనియర్ చెస్ చాంప్ దివ్య



గాంధీనగర్: వరల్డ్ జూనియర్ బాలికల చెస్ చాంపియన్‌షిప్‌లో దివ్య దేశ్‌ ముఖ్ విజేతగా నిలిచింది. గురువారం జరిగిన ఆఖరి, 11వ రౌండ్‌లో బొలో స్లావా క్రస్టేవా (బల్గేరియా)పై 18 ఏళ్ల దివ్య గెలిచింది. దీంతో మొత్తం 10 పాయింట్లతో టైటిల్‌ను సొంతం చేసుకొంది. 9.5 పాయింట్లతో మరియమ్ (అర్మేనియా) రెండో స్థానంలో, 8.5 పాయింట్లతో అలా వెర్దియేవా (అజర్‌బైజాన్) మూడో స్థానంలో నిలిచారు.

వింబుల్డన్‌కు నడాల్ దూరం



లండన్: వచ్చే నెల ఆరంభం నుంచి జరిగే గ్రాస్ కోర్ట్ గ్రాండ్‌స్లామ్ వింబుల్డన్‌కు దూరమవుతున్నట్టు స్పెయిన్ బుల్ రఫెల్ నడాల్ ప్రకటించాడు. తన దృష్టంతా జూలై 26 నుంచి జరిగే పారిస్ ఒలింపిక్స్‌పైనే కేంద్రీకరించినట్టు తెలిపాడు. తుంటి గాయంతో నడాల్ గత కొంతకాలంగా ఇబ్బందులు పడుతున్నాడు.

బుల్‌డోజర్లు రెడీ!



నసా స్టేడియం కూల్చివేతకు రంగం సిద్ధం

న్యూయార్క్: టీ20 వరల్డ్‌కప్ కోసం తాత్కాలికంగా నిర్మించిన నసా క్రికెట్ స్టేడియం కనుమరుగు కానుంది. బుధవారం అమెరికా-భారత్ పోరుతో ఇక్కడ షెడ్యూల్ చేసిన మొత్తం 8 మ్యాచ్‌లు ముగిశాయి. దీంతో ముందుగా నిర్ణయించిన ప్రకారం స్టేడియం కూల్చివేతకు రంగం సిద్ధం చేశారు. స్టేడియం వద్ద భారీ క్రేన్లు, బుల్‌డోజర్లు ఉన్న వీడియో నెట్‌లో వైరల్ అవుతోంది. 930 ఎకరాల ఐసెన్ హోవర్ పార్క్‌లో 34 వేల సీటింగ్ కెపాసిటీతో ఈ స్టేడియాన్ని కేవలం 100 రోజుల్లో నిర్మించారు. స్టాండ్స్ నిర్మాణం కోసం వినియోగించిన ఇనుప కమ్మీలు, తదితరాలను లాస్‌వెగాస్‌లో జరిగిన ఎఫ్-1, గోల్ఫ్ ఈవెంట్ల నుంచి అరువు తెచ్చారు. ఇప్పుడు వీటిని ఊడదీసి మళ్లీ వారికి అప్పజెప్పనున్నారు. ఈ స్టేడియంలో ఏర్పాటు చేసిన డ్రాప్ ఇన్ పిచ్‌లు మెగా ఈవెంట్‌లో భారీ చర్చకు దారితీశాయి. వికెట్‌లో అసమతుల్యమైన బౌన్స్ కారణంగా బ్యాటర్లు ఎంతో ఇబ్బందిపడ్డారు. ఇండో-పాక్ మ్యాచ్‌కు ఈ మైదానం కిటకిటలాడిపోయింది. నిర్మాణాలను తొలగించడానికి ఆరు వారాల సమయం పడుతుందని అంచనా. అయితే, డ్రాప్ ఇన్ పిచ్‌లను మాత్రం ఇక్కడే ఉంచనున్నారు.

శ్రుతి వోరా రికార్డు



న్యూఢిల్లీ: భారత ఈక్వెస్ట్రియన్ శ్రుతి వోరా.. 3స్టార్ గ్రాండ్‌ప్రీ డ్రెస్సేజ్ విభాగంలో విజేతగా నిలిచిన తొలి భారత క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. స్లొవేనియాలో జరిగిన సీడీఐ-3 ఈవెంట్‌లో శ్రుతి పాల్గొంది. కోల్‌కతాకు చెందిన ఈ వెటరన్ మొత్తంగా 67.761 పాయింట్లతో తొలి స్థానంలో నిలిచింది.

వింబుల్డన్ ప్రైజ్‌మనీ పెంపు

లండన్: వింబుల్డన్ ప్రైజ్‌మనీ రికార్డు స్థాయిలో రూ. 535 కోట్లకు పెరిగింది. ఇది గత ఏడాది కంటే 11.9 శాతం..అంటే రూ. 57 కోట్లు పెరగడం విశేషం. పురుషులు, మహిళల సింగిల్స్ విజేతలకు తలో రూ. 29 కోట్లు అందుతుంది.

పాక్ ఆశలు గల్లంతేనా?

ఫ్లోరిడాలో భారీ వర్షాలు

లాడర్‌హిల్: టీ20 మెగా టోర్నీలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో కేవలం ఒక్క విజయంతో ఉన్న పాకిస్థాన్ జట్టు సూపర్-8 దశకు చేరడం క్లిష్టంగా మారింది. ఆశలు నిలవాలంటే ఐర్లాండ్‌తో జరిగే తమ చివరి మ్యాచ్‌లో విజయం సాధించాల్సిందే. కానీ ఆదివారం జరగాల్సిన పాక్ మ్యాచ్‌పై సందేహాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఫ్లోరిడాలో భారీ వర్షాలతో వీధులన్నీ వరద నీటితో నిండిపోయాయి. అలాగే స్టేడియం ఉన్న బ్రోవార్డ్ కౌంటీలోనూ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఒకవేళ వర్షంతో ఈ మ్యాచ్ రద్దయితే 3 పాయింట్లతో పాక్ నిష్క్రమించాల్సిందే. దీనికి తోడు ఇదే స్టేడియంలో శుక్రవారం యూఎస్ జట్టు ఐర్లాండ్‌తో ఆడాల్సి ఉంది. ఈ మ్యాచ్ ఆటంకం లేకుండా సాగి ఆతిథ్య జట్టు ఓడిపోతేనే పాక్ ఆశలు సజీవంగా ఉంటాయి. అలాకాకుండా వర్షంతో రద్దయినా యూఎస్ ఐదు పాయింట్లతో సూపర్-8కు వెళుతుంది. అప్పుడు ఆదివారం మ్యాచ్‌లో పాక్ గెలిచినా లాభం లేదు.

కోన్ ఐస్‌క్రీమ్‌లో చేతివేలు!



- తింటుంటే నాలుక్కింద గోరుతో కూడిన అర అంగుళం పొడువు ముక్క
- ఓ యువ వైద్యుడికి జుగుప్సాకరమైన అనుభవం.. ముంబైలో ఘటన

ముంబై, జూన్ 13: భోజనం చేశాక తీరిగ్గా కూర్చుని చల్లటి ఐస్‌క్రీమ్‌ను ఆస్వాదిస్తున్న ఆయన నాలుకకు ఏదో గట్టిగా తగిలింది! అది పళ్ల కింద నలగలేదు.. అంటే డ్రైఫ్రూట్ కాదు. అనుమానమొచ్చి చేత్తో బయటకు తీసి చూసి కంగుతిన్నాడు! అది.. మనిషి చేతి వేలు! ముంబైలోని పశ్చిమ మలాడ్ ప్రాంతంలోని ఓర్లెమ్ బెండన్ సెర్రావో అనే 26 ఏళ్ల వైద్యుడికి ఇలా ఒళ్లు గగుర్పొడిచే జుగుప్సాకరమైన, భయానక అనుభవం ఎదురైంది. సెర్రావో బుధవారం ఓ ఆన్‌లైన్ డెలివరీ యాప్‌లో 'యమ్మో' అనే కంపెనీ నుంచి బటర్ స్కాచ్ ఫ్లేవర్ కోన్ ఐస్‌క్రీమ్ ఆర్డర్ పెట్టారు. డెలివరీ బాయ్ తెచ్చిచ్చాక లంచ్ తర్వాత ఆ ఐస్‌క్రీమ్‌ను ఆయన తినడం మొదలు పెట్టారు. నాలుక కింద ఏదో గట్టిగా తగలడంతో దాన్ని బయటకు తీసి చూశారు. అర అంగుళం పొడవు, గోరుతో కూడిన ఓ ముక్క కనిపించింది. స్వయంగా వైద్యుడు కావడంతో అది మనిషి చేతి వేలు అని సెర్రావో నిర్ధారించుకున్నారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారొచ్చి.. ఆ చేతివేలును పరీక్షల కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఆ ఐస్‌క్రీమ్ తయారు చేసిన 'యమ్మో ఐస్‌క్రీమ్ కంపెనీపై కేసు నమోదు చేశారు.

జూలై మూడో వారంలో కేంద్ర బడ్జెట్!

- జూన్ 22న జీఎస్టీ కౌన్సిల్ సమావేశం
- ఈ నెల 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక

న్యూఢిల్లీ, జూన్ 13 : 2024-25 ఏడాదికి సంబంధించిన కేంద్ర బడ్జెట్ జూలై మూడో వారంలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా బుధవారం బాధ్యతలు చేపట్టిన నిర్మలా సీతారామన్ ఆ శాఖ సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. 2024-25 బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. కచ్చితమైన ప్రణాళిక, సమగ్ర విశ్లేషణతో బడ్జెట్‌ను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. దేశ ఆర్థిక ప్రాధాన్యాలు, నిర్దేశించుకున్న లక్ష్యాలు, సవాళ్లకు అనుగుణంగా బడ్జెట్ ఉండాలని సూచించారు. దీంతో కేంద్ర బడ్జెట్ జూలై మూడో వారంలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మరోపక్క, 53వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం న్యూఢిల్లీ వేదికగా జూన్ 22న జరగనుంది. ఈ మేరకు జీఎస్టీ కౌన్సిల్ ఎక్స్‌లో గురువారం ఓ పోస్టు పెట్టింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, ఇతర ప్రతినిధులు పాల్గొంటారు. 52వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం గతేడాది అక్టోబరులో జరిగింది. కాగా, లోక్‌సభ నూతన స్పీకర్ ఎన్నిక జూన్ 26న జరగనుంది. జూన్ 24న పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. 18వ లోక్‌సభ తొలి సమావేశాలు జూలై 3 వరకు కొనసాగే అవకాశముంది.

లోకం తీరు

సినిమాలో ఫస్ట్ హాఫ్ మాత్రమే అయింది: జగన్



5 సంతకాల సంబరం

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర ఆందోళన రేకెత్తించేలా చేసిన 'ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్' రద్దుపై చంద్రబాబు రెండో సంతకం చేశారు. రైతుల భూములను వివాదాస్పదం చేసి, కబ్జాదారులకు కోరలు తొడిగేలా రూపొందించిన ఈ చట్టాన్ని సమాధి చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ చట్టంలోని లోపాలు, లోటుపాట్లను ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు సవివరంగా చెప్పారు. తాము అధికారంలోకి వస్తే ఈ చట్టాన్ని రద్దు చేస్తూ రెండో సంతకం పెడతానని బహిరంగంగా ప్రకటించారు. ఇప్పుడు ఆ మాట నిలబెట్టుకున్నారు.

పేదల పింఛను రూ.4 వేలు

పేదల పింఛన్ మొత్తాన్ని రూ.3వేల నుంచి ఒకేసారి రూ.4వేలకు పెంచారు. చంద్రబాబు తన మూడో సంతకాన్ని ఈ ఫైలుపైనే చేశారు. 2019లోనే చంద్రబాబు పింఛను రూ.2వేలు చేశారు. దీనిని 3వేలకు పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్.. 'విడతలవారీ' పాట పాడారు. ఏటా రూ.250చొప్పున పెంచుతూ... ఐదేళ్లలో రూ.3వేలు చేశారు. కాగా... చంద్రబాబు ఇప్పుడు ఒకే విడతలో రూ.వెయ్యి పెంచేశారు. "దీని వల్ల 66లక్షల మందికి లబ్ధి చేకూరుతుంది. మేం అధికారంలోకి వస్తే ఏప్రిల్ నుంచే పెరిగిన పింఛను అమలుచేస్తామని... ఈ మొత్తాన్ని కూడా కలిపి జూలైలో రూ.7వేలు ఇస్తామని చెప్పాం. దీనిప్రకారం... జూలైలో ఈ 3నెలల బకాయి 3వేలు, పెరిగిన పింఛను రూ.4వేలు కలిపి మొత్తం 7వేలు అందుతాయి. అలాగే దివ్యాంగుల పింఛను రూ.4వేల నుంచి 6 వేలకు పెంచుతున్నాం. వారికి బకాయిలతో కలిపి జూలైలో రూ.12 వేలు అందుతుంది" అని చంద్రబాబు వివరించారు.

'అన్న' క్యాంటీన్ల పునరుద్ధరణ

జగన్ రాగానే మూసేసిన 'అన్న క్యాంటీన్ల'ను పునరుద్ధరిస్తూ చంద్రబాబు నాలుగో సంతకం చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సర్కారు అన్న క్యాంటీన్ల ద్వారా భోజనం, అల్పాహారాన్ని రూ.5కే అందించింది. వందల సంఖ్యలో వీటిని ఏర్పాటు చేశారు. పేదలు, కూలీల తోపాటు వివిధ పనులపై పట్టణాలకు వచ్చే ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించారు. టీడీపీ ప్రభుత్వానికి బ్రాండ్‌గా నిలిచిన అన్న క్యాంటీన్లను జగన్ మూసి వేయించారు. ఆ భవనాలను వార్డు సచివాలయాలు, ఇతర అవసరాలకు వాడుకున్నారు. ప్రస్తుతం ఎన్ని వీలైతే అన్ని అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తామని, దశలవారీగా మిగిలిన వాటిని అందుబాటులోకి తెస్తామని చంద్రబాబు తెలిపారు. ఇక.. రాష్ట్రంలోని యువత, ప్రైవేటు ఉద్యోగుల్లో ఎటువంటి ఉద్యోగ నైపుణ్యాలు ఉన్నాయో తెలుసుకొని... వారికి మరింత నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి ఉద్దేశించిన నైపుణ్య గణన (స్కిల్ సెన్సెస్) నిర్వహణపై చంద్రబాబు ఐదో సంతకం చేశారు. వేడుకలా సాగిన 'తొలి సంతకాల' కార్యక్రమానికి కొత్త మంత్రులు, పార్టీ నేతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

వేడుకగా పదవీ బాధ్యతల స్వీకారం

గురువారం సాయంత్రం 4.41గంటలకు చంద్రబాబు రాష్ట్ర సచివాలయంలోని తన చాంబర్లో ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో గతంలో తాను వినియోగించిన కార్యాలయాన్నే ఆయన ఈసారీ ఎంచుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయాన్ని సుందరంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ బాధ్యతలు స్వీకరించారు. తొలి సంతకాలకు సంబంధించిన లబ్ధిదారులు, సచివాలయ ఉద్యోగులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నేతలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఆయన బాధ్యతల స్వీకరణ కార్యక్రమం పూర్తయిన వెంటనే సచివాలయ ప్రాంతంలో భారీవర్షం కురిసింది.

ఏపీ పూర్వవైభవానికి తొలి అడుగు

- సీఎం చంద్రబాబు సంతకాలపై పవన్ ఆనందం



అమరావతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు మొదలైందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆనందం వ్యక్తం చేశారు. తన ఆనందాన్ని ఎక్స్ వేదికగా పంచుకున్న ఆయన, కూటమి హామీలపై సీఎం చంద్రబాబు సంతకాలు చేసిన అంశాన్ని పోస్టు చేశారు. '16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి మెగా డీఎస్సీ ఫైల్ మీద తొలి సంతకం. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తూ ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై రెండోసంతకం. సామాజిక పింఛన్లు రూ.4వేలకు పెంచుతూ మూడో సంతకం. అన్న క్యాంటీన్లు పునరుద్ధరిస్తూ నాలుగో సంతకం. యువతలో నైపుణ్యాలు గురించి వారికి బంగారు భవిష్యత్తు అందించేందుకు స్కిల్ సెన్సస్‌పై ఐదో సంతకం చేశారు" అని ఎక్స్‌లో పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రంలో ఎన్డీయే కూటమి పాలన సాగుతుందని, రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు తొలి అడుగులుపడ్డాయని ఆనందం వ్యక్తం చేశారు. కాగా, ఎన్డీయే ప్రభుత్వంలో మంత్రిగా ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు తన హృదయపూర్వక కృతజ్ఞతలని పీఏసీ చైర్మన్, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఆయన కూడా ఎక్స్ వేదికగా స్పందించారు. జనసేన పార్టీనాయకులు, వీర మహిళలు, జన సైనికులు అంకితభావంతో, నిస్వార్థంతో క్షేత్రస్థాయిలో అండగా నిలిచి మరచిపోలేని ఫలితాన్ని అందించారని పేర్కొన్నారు. అలాగే, టీడీపీ, బీజేపీ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తెనాలి ప్రజల అమూల్యమైన ప్రోత్సాహానికి, అభిమానానికి ఎప్పుడూ రుణపడి ఉంటానని, మనమందరం రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములమేనని.. రాష్ట్ర సముజ్వల భవిష్యత్తు కోసం సమష్టిగా కృషి చేద్దామని పేర్కొన్నారు.

20 తర్వాత పిఠాపురానికి వస్తా!: పవన్

తనను అఖండ మెజార్టీతో గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు అభినందనలు తెలియజేస్తున్నట్లు జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించాల్సిన ఉందని అందులో పేర్కొన్నారు. అదే విధంగా శాసనసభ సమావేశాలు కూడా ఉన్నాయని, వీటిని పూర్తి చేసుకుని పిఠాపురం వస్తానని పవన్ తెలిపారు. ఈ నెల 20తర్వాత పిఠాపురం నియోజకవర్గ కార్యకర్తలను కలుస్తానని, ఆ తర్వాత దశల వారీగా అన్ని గ్రామాల్లో పర్యటిస్తానని పేర్కొన్నారు. తనను నేరుగా కలిసి అభినందించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆశిస్తున్నారని, త్వరలోనే వారందరినీ జిల్లాల వారీగా కలిసి మాట్లాడాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అభినందనలు తెలియజేడానికి వచ్చేవారు పూల బోకేలు, శాలువాలు తీసుకురావద్దని పవన్ విజ్ఞప్తి చేశారు.

18న కేబినెట్.. 19 నుంచి అసెంబ్లీ..?

- తేదీలు ఖరారు చేసిన కొత్త ప్రభుత్వం!

అమరావతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త ప్రభుత్వానికి సంబంధించిన పనులు చకచకా జరిగిపోతున్నాయి. బుధవారం ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన చంద్రబాబు... గురువారం సచివాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం మంత్రులకు శాఖలు కేటాయించనున్నారు. దరిమిలా అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు కొత్తప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నెల 18న కేబినెట్ తొలి సమావేశం జరపాలని నిర్ణయించింది. మర్నాటి (19వ తేదీ) నుంచే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని దాదాపు నిశ్చయించినట్లు తెలుస్తోంది.

'నీట్' గ్రేస్ మార్కులు రద్దు చేశాం

1,563 మంది మళ్లీ పరీక్ష రాయొచ్చు.. 23న పరీక్ష.. 30న ఫలితాలు

- సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం
- కౌన్సెలింగ్ నిలిపివేతకు సుప్రీం కోర్టు నిరాకరణ




న్యూఢిల్లీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై వెల్లువెత్తుతున్న విమర్శల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షా కేంద్రాల వద్ద సమయాన్ని కోల్పోయిన 1563 మంది అభ్యర్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కులను ఉపసంహరించుకున్నట్లు సుప్రీంకోర్టుకు తెలిపింది. వారందరికీ జూన్ 23న మరోసారి పరీక్ష రాసే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొంది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన వెకేషన్ బెంచ్.. కేంద్రం నిర్ణయాన్ని సముచిత నిర్ణయంగా అభివర్ణించింది. జూలై 6 నుంచి ప్రారంభం కానున్న నీట్-యూజీ కౌన్సెలింగ్‌ను నిలిపివేయడానికి నిరాకరించిన కోర్టు.. వైద్యకళాశాలల్లో అభ్యర్థుల అడ్మిషన్లు నీట్ వ్యవహారంపై దాఖలైన కేసుల ఫలితంపై ఆధారపడి ఉంటాయని స్పష్టం చేసింది. కేంద్రం, జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది కాను అగర్వాల్.. జూన్ 23న నిర్వహించే పరీక్షకు సంబంధించి నోటిఫికేషన్‌ను గురువారమే విడుదల చేయనున్నట్లు ధర్మాసనానికి వెల్లడించారు. ఈ వ్యవహారంపై నియమించిన కమిటీ సిఫారసుల మేరకు.. 1563 మంది అభ్యర్థులకు కలిపిన గ్రేస్‌మార్కులను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. వారందరికీ వారి అసలు మార్కుల వివరాలను పంపుతామని.. మళ్లీ పరీక్ష రాయడానికి ఇష్టపడనివారు, తమకు వచ్చిన అసలు మార్కులతోనే కౌన్సెలింగ్‌కు హాజరు కావొచ్చని స్పష్టం చేశారు. జూన్ 23న వీరికి నిర్వహించే పరీక్ష ఫలితాలను 30న ప్రకటిస్తామని వెల్లడించారు. దీనివల్ల.. ఎంబీబీఎస్, బీడీఎస్ ఇతర కోర్సుల్లో ప్రవేశానికి జూలై 6న నిర్వహించే కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి వారికి ఎలాంటి ఇబ్బందీ ఉండదని పేర్కొన్నారు. ఇక.. నీట్‌లో అవకతవకలపై కోర్టును ఆశ్రయించిన 'ఫిజిక్స్‌వాలా' సంస్థ తరఫున ప్రముఖ న్యాయవాది జె.సాయిదీపక్ వాదనలు వినిపించారు. మళ్లీ నిర్వహించే పరీక్షను 1563 మంది అభ్యర్థులకు మాత్రమే పరిమితం చేయకుండా.. అదే కారణంతో నష్టపోయి, కోర్టుకు రాలేకపోయినవారందరికీ ఆ అవకాశం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కానీ.. కోర్టు ఆయన అభ్యర్థనను తిరస్కరించి, తదుపరి విచారణను జూలై 8కి వాయిదా వేసింది. కాగా.. గ్రేస్ మార్కులను ఉపసంహరిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంతో నీట్ టాపర్ల సంఖ్య 67 నుంచి 61కి తగ్గింది. గ్రేస్ మార్కులు పొందినవారిలో ఆరుగురు ఈ టాపర్ల జాబితాలో ఉన్నారు. వారికి అదనంగా కలిపిన మార్కులు తీసేయడంతో టాపర్ల జాబితాలో వారికి చోటు లేకుండా పోయింది. 1523 మందిలో ఎంతమంది మళ్లీ పరీక్ష రాస్తారో తెలిశాకనే సవరించిన టాపర్ల జాబితాను విడుదల చేస్తామని ఎన్టీయే అధికారి ఒకరు తెలిపారు.

బాధ్యతారాహిత్యమే..: కాంగ్రెస్

నీట్ నిర్వహణలో అవకతవకలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపించాలని కాంగ్రెస్‌పార్టీ గురువారం మరోసారి డిమాండ్ చేసింది. ఈ వ్యవహారంపై దేశవ్యాప్తంగా ప్రజల్లో ఉన్న ఆగ్రహం పార్లమెంటులో కూడా ప్రతిధ్వనిస్తుందని హెచ్చరించింది. ఈ వ్యవహారంలో బీజేపీ తీరు బాధ్యతారహితంగా ఉందని మండిపడ్డ కాంగ్రెస్.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్‌ను తొలగించాలని డిమాండ్ చేసింది. పేపర్‌లీకులు, రిగ్గింగుల ద్వారా మోదీ సర్కారు గడిచిన పదేళ్లలో కోట్లాది మంది యువత భవిష్యత్తును నాశనం చేసిందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. "ఈ వ్యవహారంలో కేంద్రం తన బాధ్యతను ఎన్టీయే భుజాలపైకి నెట్టేసి తప్పించుకోజాలదు. నీట్ కుంభకోణంపై సీబీఐ దర్యాప్తు జరిపించాలి. లేదంటే సుప్రీంకోర్టు పర్యవేక్షణలో నిష్పక్షపాత విచారణ జరిపించాలని కాంగ్రెస్ కోరుతోంది. దోషులకు కఠిన శిక్ష విధించాలి. ఏడాది కాలాన్ని కోల్పోయిన లక్షలాది మంది విద్యార్థులకు పరిహారం ఇవ్వాలి" అని ఖర్గే ట్వీట్ చేశారు. ఇక.. గ్రేస్ మార్కుల ఉపసంహరణ నిర్ణయం సరేగానీ.. అసలు, వాటిని తొలుత ఎందుకు కలిపారో వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ అయిందా? లేదా? తెలపాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను, ఆరోగ్య మంత్రి జేపీ నడ్డాను ఆయన ప్రశ్నించారు. 2019 నుంచి గత ఏడాది దాకా ఏ సంవత్సరంలోనూ నీట్‌లో ముగ్గురికి మించి టాపర్లు లేరని.. అలాంటిది ఈ ఏడాది 67 మంది టాపర్లు ఎలా వచ్చారని ఆయన నిలదీశారు. విపక్షాలు చేస్తున్న విమర్శలను కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్ తోసిపుచ్చారు. పేపర్ లీక్ అయిందనడానికి ఎలాంటి ఆధారాలూ లేవని ఆయన స్పష్టం చేశారు. 1563 మందికి గ్రేస్ మార్కులు కూడా అల్లాటప్పాగా ఇవ్వలేదని.. సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన ఫార్ములా ఆధారంగా ఇచ్చినవేనని ఆయన వెల్లడించారు.

యడియూరప్పకు నాన్‌బెయిలబుల్ వారెంట్

- పోక్సో కేసులో జారీ చేసిన కోర్టు
- సీఐడీ అరెస్టు చేసే అవకాశం



బెంగళూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు యడియూరప్పపై బెంగళూరు కోర్టు నాన్‌బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసింది. దీంతో ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీఐడీ పోలీసులు ఆయనను అరెస్టు చేసే అవకాశం ఉంది. సాయం కోసం కుమార్తె(17)తో కలిసి తాను ఈఏడాది ఫిబ్రవరి 2న యడియూరప్ప ఇంటికి వెళ్లగా తన కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఓ మహిళ ఫిర్యాదు చేయడంతో సదాశివనగర్ పోలీసులు మార్చి 14న ఆయనపై పోక్సో కేసు నమోదు చేశారు. అనంతరం డీజీపీ అలోక్ మోహన్ ఈ కేసు దర్యాప్తును సీఐడీకి అప్పగించారు. కాగా, బాధిత బాలిక తల్లి గతనెలలో అనారోగ్యంతో మృతి చెందారు. ఈ కేసులో చార్జిషీట్‌ను ఈనెల 15వ తేదీ లోగా దాఖలు చేయా ల్సి ఉన్నందున సీఐడీ అధికారులు యడియూరప్పకు నోటీసులు జారీ చేయగా, ఈనెల 17న విచారణకు హాజరవుతానని యడియూరప్ప సమాచారం పంపారు. బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడైన యడియూరప్ప ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నారు. కేసును విచారిస్తున్న ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి రమేశ్ గురువారం యడియూరప్పపై నాన్‌బెయిలబుల్ వా రెంట్ జారీ చేశారు. దీంతో ముందస్తు బెయిల్ కోసం యడియూరప్ప హైకోర్టును ఆశ్రయించారు. కాగా, పోక్సో కేసులో అవసరమైతే యడియూరప్ప ను సీఐడీ విభాగం అరెస్టు చేసే అవకాశం ఉందని హోంమంత్రి పరమేశ్వర్ గురువారం చెప్పారు.

కువైట్ ప్రమాదంలో

ముగ్గురు ఆంధ్రుల దుర్మరణం

మాతృభూమి నుంచి వస్తూనే మృత్యువు ఒడిలోకి శ్రీకాకుళం వాసి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

కువైట్‌లోని మంగఫ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు దుర్మరణంపాలయ్యారు. తెలంగాణకు చెందిన మరో ముగ్గురు అగ్నికీలలు, దట్టమైన పొగను తప్పించుకునేందుకు భవనం పైనుంచి దూకి ప్రాణాలను కాపాడుకున్నారు. బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో 50 మంది మృతిచెందగా.. వారిలో సింహభాగం(45 మంది) భారతీయులు, ముగ్గురు ఫిలిప్పైన్స్ జాతీయులు ఉన్నట్లు కువైట్ అధికారులు ప్రకటించారు.

సెలవులు ముగించుకుని..

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం జంకిభద్రకు చెందిన తామడ లోకనాథం(31) ఆరేళ్లుగా ఎన్‌బీటీసీ సంస్థలో రోలింగ్ ఆపరేటర్ హెల్పర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవలే భారత్ వెళ్లారు. సెలవులు ముగించుకుని, మంగళవారం అర్ధరాత్రి దాటాక కువైట్ చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా తన క్యాంప్‌నకు చేరుకుని, ప్రయాణ బడలికతో ఆదమరిచి నిద్రించారు. బుధవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో.. నిద్రలోనే మృత్యువు ఒడిలోకి జారుకున్నారు. నిబంధనల ప్రకారం ఆయన క్యాంప్‌నకు తిరిగి రాగానే.. ఆ వివరాలను ఎంట్రీ చేయించుకోవాలి. అలా చేయకపోవడం వల్ల క్యాంప్ లిస్టులో అతని పేరును చేర్చలేదు. దాంతో మరణ ధ్రువీకరణలో ఆలస్యమేర్పడింది. ఇదే క్యాంప్‌లో మరో ఐదుగురు తెలుగువారు ఆశ్రయం పొందేవారు. వారిలో తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం అన్నవరప్పాడుకు చెందిన ఈశ్వర్ మీసాల(45), పెరవలి మండలం ఖండవల్లికి చెందిన మొల్లేటి సత్యనారాయణ(45) కూడా చనిపోయినట్లు కువైట్‌లోని భారత రాయబార కార్యాలయం గురువారం రాత్రి అధికారికంగా ప్రకటించింది. వీరిద్దరూ హైవే స్టోర్‌లో డెలివరీ బాయ్స్‌గా పనిచేసేవారని తెలిసింది.

భవనం పైనుంచి దూకి..

మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం, కొమ్మగూడెం గ్రామానికి చెందిన కె.గంగయ్యతో పాటు.. తెలంగాణకు చెందిన మరో ఇద్దరు కూడా ప్రమాదం జరిగిన భవనంలోనే ఉన్నారు. తెల్లవారుజామున ప్రమాదం జరగ్గానే వీరు తప్పించుకునే ప్రయత్నం చేశారు. మెట్లపైన కూడా మాడిపోయిన స్థితిలో మృతదేహాలు కనిపించడం.. దట్టమైన పొగ అలుముకుంటుండడంతో.. భవనం పైనుంచి దూకేశారు. కేబుల్ వైర్ల సాయంతో రెండో అంతస్తు నుంచి దూకినట్లు గంగయ్య 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.



ప్రమాదం నుంచి తప్పించుకున్న గంగయ్య

డీఎన్ఏ పరీక్షలు..

ఈ ఘటనలో మొత్తం 50 మంది మృతిచెందగా.. మృతదేహాలు గుర్తించలేని విధంగా తయారయ్యాయని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో శ్రీహరి అనే కేరళీయుడు మృతిచెందగా.. కువైట్‌లోనే పని చేసే అతని తండ్రి ప్రదీప్ తన కుమారుడి మృతదేహాన్ని గుర్తించడంలో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. చివరకు తన కొడుకు ఒంటిపై ఉండే టాటూ ద్వారా గుర్తించగలిగారు. శరీరమంతా మసిబారిపోయి, ముఖం ఉబ్బి ఉందని, టాటూ లేకుంటే.. గుర్తించడం కష్టమయ్యేదని ఆయన కన్నీటిపర్యంతమయ్యారు. విగతా మృతదేహాల గుర్తింపునకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి. ఆ తర్వాతే స్వదేశాలకు మృతదేహాల తరలింపు ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. కాగా.. మృతుల్లో చాలా మంది పార్ట్‌టైమ్ డెలివరీ బాయ్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగా ప్రభుత్వం వద్ద వీరి వివరాలు పెద్దగా ఉండవు. దీంతో.. మృతదేహాల గుర్తింపులో ఆలస్యమేర్పడినట్లు సమాచారం. మృతుల్లో 45 మంది భారతీయులు, ముగ్గురు ఫిలిప్పైన్స్ వాసులు ఉన్నట్లు అధికారులు చెబుతుండగా.. మరో ముగ్గురి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. భారతీయుల్లో కేరళకు చెందినవారు 23 మంది, తమిళులు 8 మంది ఉన్నారు. మిగతా వారిలో ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్ నుంచి ముగ్గురేసి, ఒడిసా నుంచి ఇద్దరు, హరియాణా, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, కర్ణాటక, బిహార్ రాష్ట్రాలకు చెందిన ఒక్కో బాధితుడు ఉన్నారని భారత విదేశాంగ శాఖ గురువారం రాత్రి విడుదల చేసిన ప్రకటన స్పష్టం చే స్తోంది. భారత విదేశాంగ శాఖ సహాయ మంత్రి కృతి వర్ధన్ సింగ్ గురువారం ఉదయమే కువైట్ చేరుకున్నారు. వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులతో మాట్లాడి, ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను భారత్‌కు తరలించేందుకు కేంద్రం వాయుసేనకు చెందిన విమానాన్ని ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. మరోవైపు కువైట్ రాజు షేక్ మిషాల్ అహ్మద్ అల్-సబా కూడా మృతదేహాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

కేరళీయులకు 14 లక్షల చొప్పున పరిహారం

కువైట్ అగ్నిప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు కేంద్రం రూ.2లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించిన విషయం తెలిసిందే.! తాజాగా గురువారం కేరళ సీఎం పినరయి విజయన్ రూ.5 లక్షల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఇస్తామని మలయాళీ వ్యాపారవేత్త యూసుఫ్ అలీ, రూ. 2 లక్షల చొప్పున అందజేస్తామని మరో వాపారవేత్త రవి పిళ్లై వెల్లడించారు.

దారుణం జరిగిపోయింది: ఇబ్రహీం



ఇబ్రహీం (ప్రత్యక్ష సాక్షి)

కువైట్‌లోని ఓ చమురు సంస్థలో సీనియర్ సేఫ్టీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న హైదరాబాద్ నసన్‌సిటీకి చెందిన మహమ్మద్ ఇబ్రహీం ఇమ్రాన్ బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘటనను గురించి 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. 'ప్రమాదం జరిగిన క్యాంపు భవనం పక్క బ్లాక్‌లోనే మేము నివసిస్తున్నాం. తెల్లవారుజామున 4 గంటల సమయంలో పెద్దఎత్తున ఆర్తనాదాలు.. హాహాకారాలు వినిపించాయి. కిటికీ లోంచి బయటకు చూస్తే.. దట్టమైన పొగ, మంటలు కనిపించాయి. సేఫ్టీ ఆఫీసర్ కావడం వల్ల అవసరమైన సహాయం చేయాలనే ఉద్దేశంతో ప్రమాదస్థలి వద్దకు పరుగులు తీశాను. చూస్తుండగానే.. మూడో అంతస్తు నుంచి ఒకరి తర్వాత ఒకరు.. ఇలా ఐదారుగురు కిందకు దూకుతూ కనిపించారు. వారిలో ఒకరు నా కళ్ల ముందే మరణించారు" అని ఆయన వివరించారు.

మృతులు వీరే

ఎన్నికల ఫలితాలు చూసి..



శ్రీకాకుళం, జూన్ 13(ఆంధ్రజ్యోతి)/సోంపేట: శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం జింకిభద్రకు చెందిన తామాడ లోకనాథం నిరుపేద కుటుంబానికి చెందినవారు. ఇటీవలే తమ ఊళ్లోని గ్రామదేవత సంబరాల కోసం కువైట్ నుంచి వచ్చారు. ఎన్నికల ఫలితాలను చూసి.. అందరితో సరదాగా గడిపి.. మంగళవారం కువైట్ బయలుదేరారు. అర్ధరాత్రి దాటాక కువైట్‌లోని తమ క్యాంపునకు చేరుకుని, నిద్రకుపక్రమించారు. అగ్ని ప్రమాదంతో నిద్రలోనే తిరిగిరాని లోకాలకు చేరుకున్నారు. లోకనాథం మృతితో జింకిభద్రలో విషాదఛాయలు అలుముకున్నాయి. తమను ఆదుకుంటాడనుకున్న కొడుకు ఇకలేడని తెలుసుకుని, లోకనాథం తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. మృతదేహాన్ని వెనక్కి రప్పించేలా కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు చొరవ తీసుకుంటున్నట్లు తెలిసింది.

నాలుగు రోజుల్లో వస్తాడనుకుంటే..



పెరవలి, జూన్ 13: మీసాల ఈశ్వర్ పదేళ్లుగా కువైట్‌లోని హైవే సూపర్‌మార్కెట్‌లో సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇటీవలే కుమార్తెకు వివాహం నిశ్చయమవ్వగా.. విమానం టికెట్ ధరలు ఎక్కువగా ఉండడంతో కువైట్ నుంచి రావడాన్ని మరో నాలుగు రోజులకు వాయిదా వేసుకున్నారు. నాలుగు రోజుల్లో వస్తాడనుకున్న ఈశ్వర్.. విగత జీవిగా వస్తుండడంతో ఆయన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

కుటుంబాన్ని పోషించేందుకు వెళ్లి..



మొల్లేటి సత్యనారాయణ తన కుటుంబాన్ని పోషించేందుకు పదేళ్లుగా కువైట్‌లో పని చేస్తున్నారు. ఈయనకు భార్య, విద్యాభ్యాసం చేస్తున్న ఓ కుమారుడు, వ్యవసాయ పనులు చేసుకునే తల్లిదండ్రులున్నారు. బుధవారం నాటి అగ్నిప్రమాదంలో సత్యనారాయణ తీవ్ర గాయాలపాలయ్యారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతిచెందారు. కుటుంబ సభ్యులకు ఇంకా విషయం తెలియదని ఖండవల్లి గ్రామస్తులు తెలిపారు.

బీజేపీకి తగ్గిన 3% దళిత ఓట్లు

న్యూఢిల్లీ, జూన్ 13: దళితులు జాతీయ పార్టీలకన్నా ప్రాంతీయ పార్టీలవైపు మొగ్గు చూపినట్టు ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెల్లడిస్తున్నాయి. ఫలితాలపై సీఎస్‌డీఎస్ సర్వే సంస్థ జరిపిన అధ్యయనం ప్రకారం దళితులు బీజేపీకన్నా ఇతర పార్టీలను ఆదరించారు. బీజేపీకి దళితుల ఓట్లు 3 శాతం మేర తగ్గాయి. అదే కాంగ్రెస్‌కయితే ఒక శాతం తగ్గుదల ఉంది. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీకి దళిత ఓట్లు ఏకంగా 8% పెరగడం గమనార్హం.

ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపండి

- పూర్తి బలంతో ఉగ్రవాదులను అణచివేయండి: మోదీ

న్యూఢిల్లీ, జూన్ 13: జమ్మూకశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితులపై ప్రధాని మోదీ సమీక్ష నిర్వహించారు. అక్కడ వరుసగా ఉగ్రదాడులు జరుగుతున్న నేపథ్యంలో గురువారం ఆయన జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోభాల్, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. జమ్మూకశ్మీర్‌లో భద్రతా బలగాల మోహరింపు, ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో కూడా మాట్లాడినట్లు ప్రభుత్వవర్గాలు తెలిపాయి. ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలని మోదీ ఆదేశించినట్లు వెల్లడించాయి. కాగా, రియాసీ ఉగ్రదాడికి సంబంధించి 50మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

జీ 7 అతిథులకు ఇటలీ ప్రధాని 'నమస్తే'!

మన సంస్కృతీ సంప్రదాయాల్లో భాగమైన 'నమస్కారం'.. ఇప్పుడు అంతర్జాతీయ వేదికలపైనా కనిపిస్తోంది. జీ7 సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్న ఇటలీ ప్రధాని జార్జియా మెలోని.. సమావేశాల్లో పాల్గొనటానికి వస్తున్న దేశాధినేతలను 'నమస్తే'తో ఆహ్వానించటం విశేషం. జీ7 సదస్సులో పాల్గొనటానికి ప్రధాని మోదీ గురువారం ఇటలీకి వెళ్లారు.

పాఠశాల విద్యలో పైరవీల అధికారి!

- బంగారం కానుకగా ఇచ్చి కోరుకున్న పోస్టులోకి
- ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో మళ్లీ అదే తీరు

అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలో ఓ ఉన్నతాధికారి తీరు చర్చనీయాంశమైంది. గత వైసీపీ ప్రభుత్వంలో కీలకమైన పోస్టింగ్ కోసం అప్పటి ప్రధాన అధికారి కుటుంబ సభ్యులకు బంగారం బహుమతిగా ఇచ్చిన ఆయన ఇప్పుడు మళ్లీ మంచి పోస్టు కోసం పైరవీలు మొదలుపెట్టారు. పెద్దగా అనుభవం లేకపోయినా కీలక పోస్టు కోసం గత ప్రభుత్వంలో అనేక పైరవీలు చేశారు. చివరికి ప్రధాన అధికారి కుటుంబ సభ్యులకు బంగారం బహుమతిగా ఇచ్చి, కోరుకున్న పోస్టింగ్ సాధించారు. అప్పట్లో ఆయనకు ఆ పోస్టు ఎలా వచ్చిందనే దానిపై పెద్ద చర్చే జరిగింది. కానీ అది పెద్ద అధికారితో ముడిపడిన వ్యవహారం కావడంతో ఎవరూ నోరు మెదపలేదు. ఇక ఇప్పుడు కూడా మరో కీలకమైన పోస్టు కోసం ఆయన మళ్లీ పైరవీలు మొదలుపెట్టడంతో గతంలో చేసిన ఘనకార్యంపై చర్చ మొదలైంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కీలకమైన మంత్రితో తాను ఇప్పటికే మాట్లాడానని, తనను ఇక్కడే కొనసాగిస్తామని లేదా మంచి పోస్టింగ్ ఇస్తామని ఆయన హామీ ఇచ్చారని ఆ అధికారి ప్రచారం చేసుకుంటున్నారు.

ఉత్తరాంధ్రను దోచేసిన విజయసాయిరెడ్డి!

- సిగ్గు, శరం ఉంటే వైసీపీని రద్దు చేయాలి: బుద్దా వెంకన్న

విజయవాడ(వన్‌టౌన్), జూన్ 13: 'విజయసాయిరెడ్డి ఒక లుచ్చా. ఉత్తరాంధ్రను దోచేశాడు. విచారణ చేయించి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం' అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుద్దా వెంకన్న చెప్పారు. గురువారం విజయవాడలోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబుకు గతంలో ప్రతిపక్ష పాత్ర అయినా వచ్చిందని, ఇప్పుడు జగన్‌కు అదీ సున్నా అయిందని, సిగ్గు.. శరం ఉంటే వైసీపీని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 'అధికారం పోయినాక ఇప్పుడు విజయసాయిరెడ్డి పిల్లి అరుపులు అరుస్తున్నాడు. కక్ష సాధింపు చర్యలకు, దాడులకు పాల్పడవద్దని పార్టీ అధినాయకత్వం మాకు ముందే చెప్పింది. ఎక్కడో ఏదో ఒక చోట సంఘటన జరిగితే దానిని ఇప్పుడు వైసీపీ వాళ్లు రాద్ధాంతం చేస్తున్నారు. నిజంగా టీడీపీ వాళ్లు దాడులు చేయాలనుకుంటే పరిస్థితి ఇలా ఉంటుందా?' అని ప్రశ్నించారు. అధికారం పోగానే సింహాలు, పులులు పిల్లులైపోయాయన్నారు. వంశీని, విజయసాయిరెడ్డిని వదిలేది లేదని స్పష్టం చేశారు.

టీటీడీలో అక్రమాలపై చర్యలు తీసుకోండి: కేతిరెడ్డి

చెన్నై, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గత కొంతకాలంగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని తమిళనాడు తెలుగు యువశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. 'తిరుమల పవిత్రతను కాపాడాల్సిన విజిలెన్స్ అధికారులు అక్రమార్కులకు కొమ్ముకాశారు. తిరుమలలో మద్యం, సిగరెట్లు, గంజాయి లాంటి మత్తుపదార్థాలు విచ్చలవిడిగా దొరుకుతున్నాయి. వీటన్నింటిపైనా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని కేతిరెడ్డి డిమాండ్ చేశారు.

నీ లేఖ నా మనసును హత్తుకుంది

- నారా రోహిత్ శుభాకాంక్షలకు బాబు స్పందన

అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా ఆయన బంధువు, సినీ హీరో నారా రోహిత్ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. దానిపై ఎక్స్‌లో స్పందించిన చంద్రబాబు... 'నీ లేఖ నా మనసును హత్తుకుంది. మన కుటుంబ సభ్యుల అండ, ఆశీస్సులు సదా నా వెంట ఉన్నాయి కాబట్టే.. ఎన్ని ఒడిదుడుకుల్లో అయినా నిలబడగలిగాను. నీకు ఎల్లప్పుడూ నా శుభాశీస్సులు వెన్నంటి ఉంటాయి... ప్రేమతో నీ పెదనాన్న' అని పేర్కొన్నారు. తన వ్యాఖ్యలకు రోహిత్ శుభాకాంక్షలను జత చేశారు. రోహిత్ తన సందేశంలో.. 'పెదనాన్న... గత నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నారు. ఎన్నో ఒడిదుడుకులను చూశారు. తట్టుకున్నారు. ఆత్మవిశ్వాసంతో నిలబడ్డారు. కానీ, గత ఐదేళ్ల కాలంలో ఎంతో మదన పడ్డారు. పార్టీని, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. మీకు కష్టం వచ్చినప్పుడు వాళ్లు అందరూ కుల, మత, ప్రాంతాలకు అతీతంగా మీ కోసం నిలబడ్డారు. అప్పుడు తెలిసింది... గత నలభై ఏళ్ల మీ కష్టానికి మీరు పొందింది ప్రజల గుండెల్లో కదిలించలేని స్థానం అని. ఈ ఎన్నికల్లో చరిత్రలో ఎవరూ మళ్లీ తిరగరాద్దాం అనే సాహసం చెయ్యలేని విజయాన్ని అందుకున్నారు. ఆ విజయం ఎన్‌డీఏ కూటమిది మాత్రమే కాదు. ఆంధ్ర ప్రజలది, తెలుగు వారిది, మన అందరిదీ' అని పేర్కొన్నారు.

టీడీపీ కార్యాలయంలో సంబరాలు

చంద్రబాబు ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలు స్వీకరించడంతో పాటు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, రూ.4 వేలకు పెన్షన్ పెంపు, అన్నా క్యాంటీన్లు పునరుద్ధరణ, నైపుణ్యాగణన ఫైల్స్‌పై సంతకం చేసిన శుభ సందర్భాన రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు అంబరాన్నంటాయి. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, టీడీ జనార్దన్ కార్యకర్తలతో కలసి బాణాసంచా కాల్చి సంతోషాన్ని వ్యక్తం చేశారు.

సిగ్గు లేకుండా శవ రాజకీయాలా..!: పంచుమర్తి

శవ రాజకీయాలకు పేటెంట్ హక్కు కలిగిన వైసీపీ రాష్ట్రంలో శాంతి భద్రతలు సరిగా లేవంటూ రాష్ట్రపతిని కలవడం సిగ్గుచేటని టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ అన్నారు. గురువారం టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ప్రజలు ప్రతిపక్షహోదా కూడా లేకుండా చిత్తుచిత్తుగా ఎందుకు ఓడించారో ఆత్మపరిశీలన చేసుకోకుండా మరుసటి రోజు నుంచే సిగ్గు లేకుండా శవరాజకీయాలు మొదలుపెట్టారు. టీడీపీ దాడులు చేస్తోందని తప్పుడు ప్రచారం చేస్తే ఖబడ్దార్. వైసీపీ నేతలు ఇకనైనా శవరాజకీయాలు మానుకోవాలి' అని అనూరాధ హెచ్చరించారు.

ల్యాండ్ టైటిలింగ్‌కు పాతర భేష్: నారాయణ

జగన్ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు పాతర వేయడం అభినందనీయం అని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ అన్నారు. ఆయన గురువారం ఒక ప్రకటన చేశారు. 'నా భూమిపై నీ ఫొటో ఏమిటి?' అంటూ రాష్ట్ర వ్యాప్తంగా రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందని అన్నారు. 'దీనిపై రైతులు అనేక సందర్భాల్లో నిరసనలు తెలిపినా జగన్ ఖాతరు చేయలేదు. చివరికి చంద్రబాబు ఆ జీవోను నరికేశారు. తెలంగాణలో ధరణి పోర్టల్ వల్ల కేసీఆర్ పతనం అయితే... ల్యాండ్ టైటిలింగ్‌తో ఆంధ్రలో జగన్ ప్రభుత్వం కూలిపోయింది. ఇదే విషయాన్ని గత డిసెంబరులో పలు సందర్భాలలో నేను ప్రస్తావించా' అని పేర్కొన్న నారాయణ... నాటి వీడియోను తాజాగా సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

సీఎం చంద్రబాబుకు కంభంపాటి అభినందనలు

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబుకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కంభంపాటి రామ్మోహన్‌రావు అభినందనలు తెలిపారు. గురువారం, అమరావతిలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం, చంద్రబాబును కంభంపాటి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి తొలిరోజే ఐదు ఫైళ్లపై సంతకాలు చేసినందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

డీఎస్ఎన్ఎల్‌యూలో ఎల్ఎల్‌బీ కోర్సు ప్రారంభం

సబ్బవరం, జూన్ 13: అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఈ సంవత్సరం నుంచి మూడు సంవత్సరాల ఎల్ఎల్‌బీ కోర్సు ప్రారంభిస్తున్నట్టు ఉప కులపతి ప్రొఫెసర్ డాక్టర్ సూర్యప్రకాశరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో జరిగే ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు జూలై 12వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ (డీఎస్ఎన్ఎల్‌యూ.ఏసీ.ఇన్) చూడాలని వీసీ సూచించారు.

ఆర్నెల్ల పాటు ప్రభుత్వాస్పత్రిలో సంఘ సేవ

- నిందితుడికి కోర్టు వినూత్న శిక్ష

నగరి, జూన్ 13: రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడికి వినూత్న శిక్ష విధిస్తూ చిత్తూరు జిల్లా నగరి కోర్టు మేజిస్ట్రేట్ విష్ణువర్మ గురువారం తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2022లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతికి కారణమైన వెంకటరమణపై నగరి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ నగరి జూనియర్ సివిల్ మేజిస్ట్రేట్ కోర్టులో గురువారం విచారణకు వచ్చింది. నేరం రుజువు కావడంతో ముద్దాయికి శిక్ష పడింది. మృతుని కుటుంబానికి రూ.10 వేలు నష్టపరిహారం చెల్లించాలని, ఆర్నెల్ల పాటు నగరి ప్రభుత్వ వైద్యశాలలో సంఘ సేవ చేయాలని న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

పోలవరం పనులు.. డిసెంబరు దాకా కష్టమే!

- ఎన్నో హెడ్‌వర్క్స్ డిజైన్లకు అనుమతులు రావాలి
- జూలై ఆఖరు నుంచి డిసెంబరు 31 వరకు పలు పనుల డిజైన్లకు ఆమోదం?
- అయినా అంతర్జాతీయ నిపుణులు ఓకే అంటేనే ముందుకు!
- వారెవరో గుర్తించినా ఇంతవరకు నియమించని కేంద్ర జలశక్తి శాఖ
- ఈ నెలాఖరులోపు నియామక ఉత్తర్వులు!
- జగన్ 'రివర్స్' దెబ్బకు ఇప్పటికే ప్రాజెక్టు కుదేలు
- దెబ్బతిన్న డయాఫ్రం వాల్
- కాఫర్ డ్యాంలలో భారీగా సీపేజీ
- కుంగిపోయిన గైడ్‌బండ్
- వీటికి కారణమెవరో దర్యాప్తు చేయాల్సిందే!
- సాగునీటి నిపుణుల డిమాండ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్లలో చేసిన విధ్వంసం పోలవరం ప్రాజెక్టుకు శాపంగా మారింది. మొండిగా రివర్స్ టెండరింగ్ అమలుతో అంతులేని నష్టం జరిగింది. పైపెచ్చు.. బోడి గుండుకు.. మోకాలికి ముడివేసినట్లుగా.. కాఫర్ డ్యాంల ఎత్తును పెంచకపోవడం వల్లనే .. డయాఫ్రం వాల్ దెబ్బతిన్నదన్న మూర్ఖపు వాదనను తెరపైకి తెచ్చారు. 2019 నవంబరులోనే కొత్త కాంట్రాక్టు సంస్థ పనులు ప్రారంభించి ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం నిర్మాణాన్ని చేపట్టి ఉంటే.. 2021 నాటికి ప్రాజెక్టు పూర్తయి ఉండేది. కానీ జగన్ చేసిన విధ్వంసం పోలవరానికి ఆర్థికంగా భారీ నష్టాన్ని చేకూర్చింది. ప్రధాన డ్యాంలోని కీలకమైన కట్టడాలు దెబ్బతినడంతో పునర్నిర్మాణానికి డిజైన్ల కోసం ఈ ఏడాది చివరిదాకా ఆగాల్సిన దుస్థితి నెలకొంది. పోలవరం ప్రధాన కట్టడాలు దెబ్బతినడంతో ప్రత్యామ్నాయ పునర్నిర్మాణ పనుల డిజైన్లను ఆమోదించడం కోసం అంతర్జాతీయ నిపుణులను కేంద్ర జలశక్తి శాఖ గుర్తించింది. పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ద్వారా ఈ ఎంపిక ప్రక్రియను చేపట్టింది. అయితే పీపీఏ వారికి ఇంకా నియామక ఉత్తర్వులను ఇవ్వలేదు. ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ఈ నిపుణులకు నియామక పత్రాలను ఈ నెలాఖరులోగా ఇచ్చే వీలుందని జల వనరుల శాఖ వర్గాలు చెబుతున్నాయి. వారిని నియమిస్తేనే పలు డిజైన్లకు ఆమోద ముద్ర పడుతుంది.

మరింత ఆలస్యం..

పోలవరం ప్రాజెక్టు క్షేత్రస్థాయిలో స్టోన్ కాలమ్స్, వైబ్రో కాంపాక్టెడ్ ఫిల్స్, డీప్ సాయిల్ మిక్సింగ్, ఇతర ప్రత్యామ్నాయ పనుల డిజైన్లను వచ్చే నెలాఖరు నాటికి ఆమోదం తెలిపే వీలుందని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. అయితే.. అంతర్జాతీయ నిపుణులకు నియామక పత్రాలు ఇచ్చి.. వారు ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించి.. ఆయా పనుల తీరును సమీక్షించి.. డిజైన్లను పరిశీలించి ఆమోదిస్తారు. ఇందుకు చాలా సమయం పడుతుందని.. పనులు మరింత జాప్యమయ్యే వీలుందని సాగునీటి రంగ నిపుణులు చెబుతున్నారు. పునాదుల పటిష్ఠత అధ్యయన నివేదిక కూడా వచ్చే నెలాఖరునాటికి రానుంది. డయాఫ్రం వాల్ డిజైన్లను సెప్టెంబరు నెలాఖరునాటికి ఆమోదించే వీలుందని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ఈసీఆర్ఎఫ్ డ్యాం సీపేజీ అధ్యయన నివేదిక అక్టోబరు పదో తేదీ నాటికి, ఈ డ్యాం స్థిరత్వ అధ్యయన నివేదిక అక్టోబరు 30న వస్తుందని.. డ్యాం లేఅవుట్ క్రాస్ సెక్షన్ డిజైన్ నవంబరు నెలాఖరునాటికి వస్తుందని అంచనా వేస్తున్నారు. డైనమిక్ అనాలసిస్, భూకంప తీవ్రతను తట్టుకునే సామర్థ్య అధ్యయన నివేదిక డిసెంబరు 31 నాటికి వస్తుందంటున్నారు. ఇలా ప్రధాన డ్యాంకు సంబంధించిన డిజైన్లన్నీ వచ్చేందుకు ఈ ఏడాదంతా ఆగాల్సిందే. వీటిని సదరు అంతర్జాతీయ నిపుణులు వచ్చి ఆమోదిస్తేనే అడుగు ముందుకు కదులుతుంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు పనులు మొదలుపెట్టేసరికి ఇంకెంత సమయం పడుతుందో తెలియదు. ఇంకోవైపు. డయాఫ్రం వాల్‌ను సమాంతరంగా నిర్మించాలని నిర్ణయించారు. దీనికి కాంట్రాక్టు సంస్థ డిజైన్లను రూపొందించింది. వీటిని అంతర్జాతీయ నిపుణుల కమిటీ ఆమోదించాలి. కాఫర్ డ్యాంలు నిర్మించి ఐదేళ్లు పూర్తయినందున.. కట్టడాలు శిథిలావస్థకు వచ్చాయి. కాఫర్ డ్యాంల నుంచి సీపేజీ తీవ్ర స్థాయిలో ఉంది. దాని నివారణ చర్యలు చేపట్టేందుకు జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్ అవసరం. ఇదే సమయంలో పోలవరం ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రం వాల్, కాఫర్ డ్యాంల నిర్మాణాలు దెబ్బతినడానికి, గైడ్‌బండ్ కుంగిపోవడానికి కారణాలపై చంద్రబాబు ప్రభుత్వం అధ్యయనం చేపట్టాలన్న డిమాండ్ వస్తోంది. సవ్యంగా నిర్మాణ పనులు సాగుతున్న తరుణంలో అర్థాంతరంగా నిర్మాణ సంస్థను తొలగించి.. రివర్స్ టెండర్ పేరిట కొత్త సంస్థకు పనులు అప్పగించడంపైనా దర్యాప్తు చేయాలని నిపుణులు కోరుతున్నారు.

ప్రాజెక్టులనే కాదు.. మానవ వనరులనూ చిదిమేశారు!

- నవంబరునాటికి అన్ని పోస్టులూ ఖాళీ
- 3 ఈఎన్‌సీ, 19 సీఈ, 51 ఎస్‌ఈ పోస్టులు
- 161 ఈఈ, 291 డీఈఈ ఉద్యోగాలు కూడా..
- మొదట ఇవన్నీ భర్తీ చేయండి
- బాబు సర్కారుకు అధికారుల వినతి

అమరావతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల జగన్ పాలనలో ప్రాజెక్టులే కాదు.. మానవ వనరులు సైతం తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులివ్వలేదు. కనీసం ఇంజనీరింగ్ అధికారులనూ నియమించలేదు. ఖాళీలను భర్తీ చేయకుండా దిగువ శ్రేణి అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కాలం వెళ్లదీశారు. ఈ అదనపు బాధ్యతలను కూడా అస్మదీయులకు.. లంచాలు ఇచ్చిన వారికి ఇచ్చారు. భారీగా ముడుపులు సమర్పించినవారికి రెండు నుంచి మూడు అదనపు బాధ్యతలను అప్పగించేశారు. ఈ క్రమంలో పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న వారి సీనియారిటీని, నిబంధనలనూ పక్కన పెట్టేశారు. ఈ ఐదేళ్లలో ఒక్కసారి కూడా జల వనరుల శాఖలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయలేదు. దీంతో ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఈఎన్‌సీ) నుంచి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ) దాకా నియామకాలు ఆగిపోయాయి. ఫలితంగా ఈ ఏడాది నవంబరు నాటికి ఈఎన్‌సీ నుంచి డీఈఈ దాకా పోస్టులన్నీ దాదాపు ఖాళీ కానున్నాయి. ముఖ్యంగా ఈ శాఖలోని మూడు ఈఎన్‌సీ పోస్టులు, 19 చీఫ్ ఇంజనీర్ (సీఈ), 51 సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్‌ఈ), 161 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ), 291 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ) పోస్టులు ఖాళీ కానున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో భారీ విజయం సాధించి బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వం.. పోలవరం, ఇతర ప్రాజెక్టుల నిర్మాణాలపై దృష్టి సారించే ముందు.. తొలుత జల వనరుల శాఖలో ఖాళీగా ఉన్న ఇంజనీర్ల పోస్టులను భర్తీ చేయాలని అధికారులు కోరుతున్నారు. ఈ శాఖలో ఇంజనీరింగ్ అధికారులకు పదోన్నతులు 2018 సెప్టెంబరు 18వ తేదీన ఇచ్చారు. ఆ తర్వాత చాలా మంది పదవీ విరమణ చేశారు. జగన్ అధికారంలోకి వచ్చాక ఈ ఖాళీలు భర్తీచేయకుండా.. ఐదేళ్లపాటు దిగువ స్థాయి అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ వచ్చారు. ఈ అప్పగింతల వెనుక ముడుపులు చేతులు మారాయని, ఈ వ్యవహారంపై దర్యాప్తు జరపాలని ఇంజనీరింగ్ అధికారులు డిమాండ్ చేస్తున్నారు.

పిన్నెల్లి ముందస్తు బెయిల్‌పై విచారణ 20కి వాయిదా

అరెస్టు నుంచి రక్షణ అప్పటివరకు పొడిగింపు

అమరావతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మాజీ ఎమ్మెల్యే, వైసీపీ తరఫున పోటీచేసి ఓడిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణను హైకోర్టు ఈ నెల 20కి వాయిదా వేసింది. అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను అప్పటివరకు పొడిగించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ న్యాపతి విజయ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల సందర్భంగా మే 13న పోలింగ్ కేంద్రంలో ఈవీఎం, వీవీప్యాట్ ధ్వంసం చేసిన వ్యవహారంలో పల్నాడు జిల్లా రెంటచింతల పోలీసులు పిన్నెల్లిపై కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. అలాగే ఆ ధ్వంసాన్ని అడ్డుకున్న టీడీపీ ఏజెంట్ శేషగిరిరావుపై ఆయన దాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి రెంటచింతల పోలీసులు పిన్నెల్లి, ఆయన అనుచరులు మరో 15 మందిపై హత్యాయత్నం(ఐపీసీ 307), మరికొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అదేరోజు నాగశిరోమణి అనే మహిళను ఆయన బూతులు తిట్టారు. ఆమె ఫిర్యాదుతో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇక మే 14న పిన్నెల్లి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి, వారి అనుచరులు సీఐ నారాయణ స్వామిపై దాడి చేసి గాయపరిచారు. దీనిపై హత్యాయత్నం, మరికొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులన్నిటిలో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలపై గతంలో విచారణ జరిపిన కోర్టు జూన్ 13 వరకు ఆయన్ను అరెస్టు చేయవద్దని మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ పిటిషన్లు గురువారం మరోసారి విచారణకు వచ్చాయి. న్యాయమూర్తి స్పందిస్తూ.... నాలుగు పిటిషన్లపై విచారణ పూర్తి చేసినప్పటికీ.. నిర్ణయం వెల్లడించేందుకు కొంతసమయం పడుతుందన్నారు. వ్యాజ్యాలపై విచారణను రెగ్యులర్ బెంచ్ చేపట్టేలా వాయిదా వేస్తే ఎలా ఉంటుందని ఇరువైపుల న్యాయవాదులకు ప్రతిపాదన చేశారు. వారు సమ్మతించడంతో న్యాయమూర్తి విచారణను 20కి వాయిదా వేశారు.



తండ్రిని చంపిన కూతురు

- అట్లకాడతో కొట్టి చంపిన వైనం
- ఇష్టంలేని పెళ్లి చేసుకొమ్మనడమే కారణం!
- హతుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడు



దొరస్వామి (ఫైల్)

మదనపల్లె అర్బన్, జూన్ 13: కన్న తండ్రిని ఓ కూతురు అట్లకాడతో కొట్టి దారుణంగా హత్య చేసింది. బుధవారం రాత్రి మదనపల్లె పీఅండ్‌టీ కాలనీలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం మేరకు... చిత్తూరు జిల్లా సదుం మండలం, చెరుకువారిపల్లెకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇ దొరస్వామి (62) మదనపల్లె పీఅండ్‌టీ కాలనీలో స్థిరపడ్డారు. దిగువ కురవంకలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఆయన జూలైలో పదవీ విరమణ చేయాల్సి ఉంది. భార్య లత ఏడాదిన్నర క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. బీఎస్సీ, బీఈడీ చదివిన కుమార్తె హరిత(24), దొరస్వామి కలిసి ఉంటున్నారు. తాను సన్నిహితంగా ఉన్న ఒకరికి రూ.10 లక్షలు ఇచ్చిన హరిత... కొద్ది రోజుల క్రితం తండ్రిపై ఒత్తిడి తెచ్చి నివాసం ఉంటున్న ఇంటిని తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకుంది. కుమార్తెకు పెళ్లి ప్రయత్నాలు చేస్తున్న దొరస్వామి ఓ సంబంధం చూశారు. అయితే ఆ అబ్బాయి వద్దంటూ హరిత తన తండ్రితో గొడవ పడింది. బుధవారం రాత్రి 11.45 గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి అరుపులు, కేకలు వినపడటంతో చుట్టుపక్కల వారు ఇంటి వద్దకు చేరుకుని, రక్తపు మడుగులో ఉన్న దొరస్వామిని గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. మదనపల్లె వన్‌టౌన్ సీఐ వల్లీబసు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. విచారణలో మొదట్లో పొంతన లేని సమాధానాలు చెప్పిన హరిత తరువాత నేరాన్ని అంగీకరించింది. అట్లకాడతో తలపై బలంగా మోది హత్య చేసినట్లు ఒప్పుకుంది. నిందితురాలిని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. హత్య జరిగిన ఇంటిని, పరిసరాలను గురువారం ఉదయం మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి సందర్శించారు. ఈ సంఘటనపై మదనపల్లె రూరల్ సీఐ శేఖర్, వన్‌టౌన్ సీఐ వల్లీబసు, టూటౌన్ సీఐ యువరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు. హతుడి బంధువు డాక్టర్ నారాయణయ్య ఫిర్యాదు మేరకు హరితపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఆటోను ఢీకొట్టి.. ఆపబోయిన వ్యక్తినీ ఢీకొట్టి..

- మద్యం మత్తులో కారుతో బీభత్సం సృష్టించిన ముగ్గురు యువకులు
- చికిత్స పొందుతూ వ్యక్తి మృతి.. చావు బతుకుల్లో ఆటోడ్రైవర్
- నాంపల్లి మెట్రో స్టేషన్ వద్ద ఘోరం.. ఆలస్యంగా వెలుగులోకి



అజయ్ (ఫైల్)

మంగళ్‌హాట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పీకలదాకా మద్యం తాగి, ఆ మత్తులో కారును మితిమీరిన వేగంతో దూకించి ఆటోను ఢీకొట్టరా ముగ్గురు యువకులు! ఈ దారుణాన్ని చూసి.. కారుకు ఎదురెళ్లి ఆపేందుకు యత్నించిన యువకుడ్నీ నిర్దాక్షిణ్యంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో కారును ఆపబోయిన వ్యక్తి తీవ్రగాయాలతో ప్రాణాలొదిలితే, ఆటో డ్రైవర్ చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నాడు. హైదరాబాద్ నాంపల్లిలో ఈనెల 9వ తేదీ అర్ధరాత్రి జరిగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘటన వివరాలను నాంపల్లి పోలీసులు గురువారం వెల్లడించారు. ఏపీ ప్రకాశం జిల్లా అంబవరం గ్రామానికి చెందిన రాజశేఖర్, శ్రీకాంత్, మధు స్నేహితులు. ఈ ముగ్గురూ కూకట్‌పల్లిలోని ఓ హాస్టల్లో ఉంటూ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్నారు. వీరితో పాటు ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో డ్రైవర్‌గా పనిచేస్తున్న అంజనేయులు అనే యువకుడు ఉంటున్నాడు. ఈనెల 9న రాజశేఖర్ పుట్టినరోజు కావడంతో వేడుకగా జరుపుకొనేందుకు అంతా కలిసి చార్మినార్ వెళ్లాలనుకున్నారు. అంజనేయులు తన కారులో రాజశేఖర్, శ్రీకాంత్‌ను ఎక్కించుకొని అర్ధరాత్రి 12గంటలకు చార్మినార్ వెళ్లాడు. దారిలోనే ఓ వైన్‌షాపులో ఎనిమిది బీర్లు కొనుక్కొని ముగ్గురూ కారులోనే తాగారు. చార్మినార్ వద్ద రాజశేఖర్ కేక్ కట్ చేశాడు. తిరుగు ప్రయాణంలో అఫ్జల్‌గంజ్ వద్ద మరో మూడు బీర్లు కొని తాగారు. తర్వాత కూకట్‌పల్లి హాస్టల్‌కు కారులో మితిమీరిన వేగంతో వెళుతూ నాంపల్లి మెట్రో స్టేషన్ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతున్న ఆటోను ఢీకొట్టారు. ఈ ప్రమాదం ధాటికి ఆటో పల్టీకొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కారును నడుపుతున్న అంజనేయులు వాహనాన్ని ఆపకపోగా మరింత వేగంతో ముందుకు దూకించాడు. అదే సమయంలో.. కోఠిలోని ఓ హోటల్లో డిన్నర్ చేసిన నేరేడ్‌మెట్ వాస్తవ్యుడు అజయ్ (36) అనే యువకుడు అతడి స్నేహితులు, నాంపల్లి దగ్గర టీ తాగేందుకు ఆగారు. ఆటోను కారు ఢీకొట్టడాన్ని చూసిన అజయ్, వేగంగా దూసుకొస్తున్న కారును ఆపేందుకు ఆ వాహనానికి ఎదురెళ్లాడు. ఇది చూసి.. కారు లోపల ఉన్న రాజశేఖర్, శ్రీకాంత్.. వాహనం స్పీడును మరింతగా పెంచి, అతడ్ని ఢీకొట్టాలని అంజనేయులును ప్రోత్సహించారు. మద్యం మత్తులో ఉన్న అంజనేయులు వెనుకాముందూ ఆలోచించకుండా అలాగే ముందుకు దూకించి కారుతో అజయ్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అజయ్ ఎగిరి కింద పడ్డాడు. అతడికి తలకు, ఇతర చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. తర్వాతా అంజనేయులు కారు ఆపకుండా మాసబ్ ట్యాంక్ వైపు కారును తిప్పాడు. ప్రమాదాన్ని చూసిన అజయ్ స్నేహితులు బైక్‌తో కారును వెంబడించి మాసబ్‌ట్యాంక్ ఫ్లై ఓవర్‌పైన అడ్డుకున్నారు. అక్కడ కారును ఆపిన ముగ్గురూ అందులోంచి దిగి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన అజయ్‌ను, ఆటోడ్రైవర్‌ను నిమ్స్‌లో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఇద్దరిలో అజయ్ గురువారం మృతిచెందాడు. ఆటోడ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంని వైద్యులు చెప్పారు. ప్రమాదం జరిగిన మర్నాడే ముగ్గురు నిందితులు అంజనేయులు, రాజశేఖర్, శ్రీకాంత్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

హత్యానేరం ఒప్పుకొనేందుకు నటుడు దర్శన్ 30 లక్షల డీల్

బెంగళూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నటుడు దర్శన్‌పై నమోదైన హత్యకేసు విచారణలో పలు విషయాలు బహిర్గతమవుతున్నాయి. బహచిత్రదుర్గ నివాసి రేణుకాస్వామిని హత్య చేసి, ఆ నేరాన్ని ఒప్పుకొనేందుకు నలుగురు యువకులకు రూ.30లక్షలు ఇచ్చేలా డీల్ కుదిరినట్లు పోలీసుల విచారణలో తేలింది. దర్శన్‌ను కేసు నుంచి తప్పించేందుకు ఈ వ్యూహం పన్నినట్లు గుర్తించారు. బెంగళూరులో హత్య చేసి, చిక్కమగళూరు జిల్లా చార్మాడిఘాట్‌లోగానీ, తమిళనాడులోని అటవీప్రాంతంలో గానీ మృతదేహాన్ని పడేయాలని కుట్రపన్నారు. మృతదేహాన్ని తరలించేందుకు భయపడి బెంగళూరు సుమనహళ్లి సమీపంలోని ఓ కాలువలో పడేశారు. హత్యకేసులో నిందితుల సంఖ్య 17కి చేరింది. ఓ మహిళ సహా నలుగురు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. దర్శన్ అభిమానుల సంఘం చిత్రదుర్గ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర.. నలుగురు యువకులకు రూ.30 లక్షలు చెల్లించి, డీల్ కుదిర్చేందుకు యత్నించినట్లు పోలీసులు గుర్తించారు. కాగా హత్యకేసులో నటుడు దర్శన్ అరెస్టుకావడంపై జేడీఎస్ యువనేత నిఖిల్ స్పందించారు. చట్టం ముందు అందరూ ఒక్కటేనన్నారు.

ఉక్కు ఉద్యోగులకు అందని జీతాలు

- మేలో రిటైరైన వారికి దక్కని పీఎఫ్ మొత్తాలు
- 'అమరావతి'కి స్టీల్ సరఫరా కాంట్రాక్టు ఇప్పించాలని సీఎంను కోరాలని భావిస్తున్న ఉద్యోగ, కార్మిక సంఘాలు

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని ఆర్థిక సమస్యలు వీడడం లేదు. అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు మే నెల జీతాలను ఇప్పటివరకూ ఇవ్వలేదు. పెన్షనర్లతో కలుపుకొని సుమారు రూ.100 కోట్లు చెల్లించాల్సి ఉంది. మే నెలాఖరున 120 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేశారు. పీఎఫ్ కంట్రిబ్యూషన్ మొత్తం ఒక్కొక్కరికి రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షలు ఇవ్వాల్సి ఉంది. వారు రోజూ అడ్మిన్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. జీతాల చెల్లింపులకు యాజమాన్యం కొన్ని నెలలుగా ఇబ్బంది పడుతున్న సంగతి తెలిసిందే. గత నెలాఖరు వరకు గంగవరం పోర్టు కార్మికుల సమ్మె వల్ల బొగ్గు సరఫరా ఆగిపోయింది. అది పునరుద్ధరణ జరిగినా మిగిలిన ముడి పదార్థాల సేకరణకు నిధులు తగినన్ని లేవు. వివిధ సంస్థల నుంచి అడ్వాన్సుల రూపేణా రూ.1,500 కోట్లు తీసుకున్నారు. వారికి స్టీల్ ఉత్పత్తులు ఇవ్వాల్సి ఉంది. సామర్థ్యం మేరకు అవసరమైన ముడి పదార్థాలు లేకపోవడం వల్ల ఉత్పత్తి పూర్తిస్థాయిలో చేయలేకపోతున్నారు. రోజుకు మూడు బ్లాస్ట్ ఫర్నేసుల ద్వారా 15 వేల నుంచి 16 వేల టన్నులు ఉత్పత్తి కావాలి. కానీ ఇప్పుడు 11 వేల టన్నులు దాటడం లేదు. మరో వైపు జిందాల్ తాను అందిస్తున్న సాయం మేరకు వెంటనే ఉత్పత్తులు తీసుకుపోతోంది. నిల్వలు ఏమీ ఉండడం లేదు. మార్కెట్‌లో స్టీల్ రేటు బాగున్నా తగిన ఉత్పత్తి చేయలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో సీఎండీ అతుల్ భట్ ఢిల్లీ వెళ్లి కొత్త ఉక్కు శాఖ మంత్రిని కలిశారు. స్టీల్‌ప్లాంటు కోలుకోవడానికి రూ.3 వేల కోట్లు ఆర్థిక సాయం చేయాలని కోరారు. అక్కడి నుంచి సరైన భరోసా లభించలేదు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం అమరావతి రాజధాని నిర్మాణ పనులు వెంటనే చేపట్టే అవకాశం ఉన్నందున, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి, స్టీల్ సరఫరా చేసే కాంట్రాక్టు ఇవ్వాలని, దానికి కొంత అడ్వాన్స్ ఇవ్వాలని కోరాలని అధికారుల సంఘం, కార్మికుల సంఘం భావిస్తున్నాయి. ఎవరో ఒకరు ఆర్థిక సాయం చేస్తే తప్ప ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది.

ట్రాన్స్‌కో జేఎండీ మల్లారెడ్డి రాజీనామా ఆమోదం

- చక్రధరబాబుకు అదనపు బాధ్యతలు

అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (విజిలెన్స్) టీ మాల్లారెడ్డి ఆమోదించారు. మాజీ సీఎం జగన్‌కు సన్నిహితుడైన మల్లారెడ్డి 2021, అక్టోబరు 17న ట్రాన్స్‌కో జేఎండీగా నియమితులయ్యారు. తెలంగాణ కేడర్ ఐపీఎస్ అధికారిగా పదవీ విరమణ చేసిన ఆయన వైసీపీ అధికారంలోకి వచ్చాక ట్రాన్స్‌కోలో బాధ్యతలు చేపట్టారు. 4న ఎన్నికల ఫలితలు వచ్చిన తరువాత నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారందరూ రాజీనామా చేశారు. మల్లారెడ్డి కూడా ఎనిమిదినే రాజీనామా చేశారు. ఆయన పదవి నామినేటెడ్ అవునా, కాదా? అన్నదానిపై స్పష్టత లేకపోవడంతో రాజీనామా ఆమోదాన్ని వాయిదా వేశారు. నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారినందరినీ తప్పించాలంటూ ఆదేశాలు జారీ చేసిన సాధారణ పరిపాలనా శాఖ... మల్లారెడ్డి గురించి ఆరా తీసింది. ఆయన రాజీనామా చేస్తే ఆమోదించాలని ట్రాన్స్‌కోకు సూచించింది. దీంతో మల్లారెడ్డి రాజీనామాను ట్రాన్స్‌కో సీఎండీ కే విజయానంద్ ఆమోదించారు. మల్లారెడ్డి రాజీనామాను 11న ఆమోదించామని ఆంధ్రజ్యోతికి విజయానంద్ తెలిపారు. ట్రాన్స్‌కో జేఎండీ చక్రధరబాబుకు అదనంగా విజిలెన్స్ బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వు జారీ చేసినట్లు చెప్పారు.

సచివాలయంలో ఉద్యానవనం పునరుద్ధరణ



సచివాలయంలో పునరుద్ధరించిన ఫౌంటెయిన్

విజయవాడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతల స్వీకారం నేపథ్యంలో రాష్ట్ర సచివాలయ ఆవరణలోని ఉద్యానవనాన్ని అన్ని హంగులతో సీఆర్‌డీఏ అధికారులు పునరుద్ధరించారు. సచివాలయ నిర్వహణ అంతా సీఆర్‌డీఏనే చూస్తుంది. అయితే గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సచివాలయంలోని ఉద్యానవనం నిరాదరణకు గురై కళ తప్పింది. తాజాగా ఇక్కడి ఫౌంటెయిన్ పునరుద్ధరణతో సచివాలయానికి కళ వచ్చింది. ఉద్యానవనాన్ని మొత్తం పునరుద్ధరించారు. నీడనిచ్చే చెట్లు, పూలమొక్కలు, లాన్‌ను సరికొత్తగా ముస్తాబు చేశారు.

మార్పు మొదలైంది!

పరదాల పాలనకు స్వస్తి

మితిమీరిన ఆంక్షలకు సెలవు

రాజధాని ప్రాంతంలో మారిన చిత్రం

బారికేడ్లు, పోలీసు పహరా మాయం

జనంతో మమేకమైన ముఖ్యమంత్రి

జగన్ ఫొటోలున్నా 'స్టూడెంట్ కిట్' పంపిణీ

విద్యార్థులకు ఇబ్బంది ఉండొద్దనే!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

బటన్ నొక్కుడుకు మాత్రమే బయటికి వచ్చి... వచ్చిన ప్రతిసారీ పరదాలు కట్టి, బారికేడ్లు పెట్టి, చెట్లు కొట్టే పాలనకు తెర పడింది. రాష్ట్రంలో మార్పు మొదలైంది. బుధవారం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు నాయుడు పరదాల పాలనకు తెర దించారు. ప్రమాణ స్వీకారానికి ముందే చంద్రబాబు ఈ విషయం స్పష్టం చేశారు. అయితే... చంద్రబాబు తిరుమల పర్యటన సందర్భంగా పరదాలు కట్టడం కనిపించింది. దీనిపై మంత్రి లోకేశ్ అప్పుడే స్పందించారు. 'పరదాలు కట్టొద్దని చెప్పాం కదా' అని ప్రశ్నించగా... 'అలవాటులో పొరపాటు జరిగిందనే సమాధానం రావడంతో ఆయన సరదాగా నవ్వారు. ఇకపై పరదాలు, బారికేడ్లు వద్దని స్పష్టం చేశారు. ప్రజలకూ తమకూ మధ్య అడ్డంకులు వద్దని చంద్రబాబు కూడా అధికారులకు సూచించారు. గురువారం ఆయన తిరుమల శ్రీవారిని, బెజవాడలో కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆ సమయంలో... సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా వీలైనంత తక్కువ స్థాయిలో మాత్రమే ఆంక్షలు అమలయ్యాయి. 'ముఖ్యమంత్రి వస్తున్నారు' అంటూ గంటల తరబడి సామాన్య భక్తులను నిలిపివేసే పరిస్థితికి తెరపడింది. ఇక... జగన్ ముఖ్యమంత్రి హోదాలో సచివాలయం వైపు వెళ్లేందుకే ఇష్టపడలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో కేబినెట్ సమావేశాలు జరిగినప్పుడు మాత్రం సచివాలయానికి వెళ్లేవారు. ఆ సమయంలో... దారి పొడవునా వందలాది మంది పోలీసులను మోహరించేవారు. రాజధాని గ్రామాల్లో ఇంటికొక పోలీసును కాపలా పెట్టేవారు. వలలు, బారికేడ్లు, పరదాలు సరేసరి! అసెంబ్లీ సమావేశాలప్పుడూ ఇదే పరిస్థితి. ఇప్పుడు ఆ చిత్రం మారిపోయింది. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారానంతరం గురువారం తొలిసారి సచివాలయానికి వెళ్లిన చంద్రబాబుకు దారిపొడవునా ఘన స్వాగతం లభించింది. ప్రజలతో ఆయన మమేకమయ్యారు.

జగన్ బొమ్మ ఉన్నా ఆపొద్దు

చంద్రబాబు మాట, ముద్రను జగన్ ఒక్క క్షణం కూడా సహించలేకపోయారు. 'ప్రజా వేదిక'నే కూల్చి వేయించారు. కానీ... ఇలాంటి విద్వేషపూరిత విధానాలను తాము అమలు చేయబోమని చంద్రబాబు సంకేతాలు పంపారు. 'విద్యా కానుక'పై జగన్ ఫొటో ఉన్నప్పటికీ పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. "ఎవరి బొమ్మ ఉందనేది ముఖ్యం కాదు. విద్యార్థులు ఇబ్బంది పడకూడదు. మాజీ సీఎం జగన్ బొమ్మలున్నా ఫరవాలేదు. విద్యార్థులకు ఇచ్చే స్టూడెంట్ కిట్ల పంపిణీ ఆపొద్దు' అని స్పష్టం చేశారు. బడులు పునఃప్రారంభమైనందున విద్యార్థులకు కిట్లు పంపిణీ చేయాలన్నారు. జగన్ ఫొటోలున్న పుస్తకాలు పంపిణీ చేయొద్దంటారేమోనని అధికారులు భావించారు. కానీ... ఎలా ఉన్నా కిట్లు ఇవ్వాలని, ప్రజాధనం వృథా చేయొద్దని సీఎం ఆదేశించారు.



అమరావతిలోని సచివాలయంలో చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఉద్యోగులు



రాజధానిలో పూల రహదారిపై బాబు

'మెగా' ముందడుగు!

- **16,347 పోస్టులతో మెగా డీఎస్సీకి ఆమోదం**
- **చెప్పినట్లుగానే తొలి సంతకం చేసి ఎన్నికల హామీని నిలబెట్టుకున్న చంద్రబాబు**
- **గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు**
- **జీవో 117పై పాఠశాల విద్యాశాఖ కసరత్తు**
- **ఈ ఏడాది డిసెంబరు 31లోగా ప్రక్రియ పూర్తి**

అమరావతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్న నిరుద్యోగుల కల నెరవేరే దిశగా 'మెగా' ముందడుగు పడింది. ఎన్నికల హామీలో భాగంగా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీకి ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే చంద్రబాబు డీఎస్సీ ఫైలు పైనే తొలి సంతకం చేశారు. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపారు. ఇందులో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) 6,371, స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ) 7,725, ట్రైయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ) 1,781, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) 286, ప్రిన్సిపాల్ 52, వ్యాయమ విద్య టీచర్ (పీఈటీ) 132 పోస్టులు ఉన్నాయి. కాగా, ఈ భర్తీ ప్రక్రియను ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీలోగా పూర్తిచేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌ను ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

గత డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు..

గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు హడావిడిగా ఇచ్చిన 6,100 పోస్టుల డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దు చేయనున్నారు. 4 సంవత్సరాల 9 నెలల పాటు నిరుద్యోగులను పట్టించుకోని జగన్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు హడావుడిగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. కానీ, ఎన్నికల కోడ్ కారణంగా పరీక్షలు కూడా ఆగిపోయాయి. కోడ్ అనంతరం పరీక్షలు నిర్వహించుకోవచ్చని ఈసీ సూచించినప్పటికీ.. ఇప్పుడు ప్రభుత్వమే మారిపోవడంతో ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని నిర్ణయించారు. కాగా, త్వరలో ఇవ్వబోయే మెగా డీఎస్సీ కోసం పాఠశాల విద్యాశాఖ జీవో 117పై కసరత్తు చేస్తోంది. ఆ జీవో ప్రకారం వైసీపీ ప్రభుత్వం పోస్టులను భారీగా తగ్గించింది. 20 మంది విద్యార్థులకు ఒక్క టీచర్ చాలని, 60 మంది వరకు ఇద్దరితోనే నడపాలని షరతులు పెట్టింది. 98 మంది కంటే తక్కువ విద్యార్థులుంటే ప్రాథమికోన్నత పాఠశాలలకు సబ్జెక్టు టీచర్లు అవసరం లేదని మరో మెలిక పెట్టింది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రిన్సిపాల్ పోస్టులనూ రద్దుచేసింది. చివరికి మినీ డీఎస్సీ వేసి నిరుద్యోగులను నిరాశపరిచింది.

అన్న క్యాంటీన్లకు కూడా విరాళాల అవకాశం

తిరుమలలో అన్న వితరణను నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ప్రారంభించారని, దాతల విరాళాలతో అది నిర్విఘ్నంగా నడుస్తోందని.. అటువంటి విరాళాల నిధి అన్న క్యాంటీన్లకు కూడా కల్పిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన ఉందని చంద్రబాబు తెలిపారు. తమ పుట్టిన రోజునో.. మంచి రోజునో కొందరు దాతలు గతంలో అన్న క్యాంటీన్లలో తమ విరాళాలతో భోజనాలు పెట్టారని, దానిని మరింత విస్తరించి విరాళాల నిధి రూపొందిస్తే బాగుంటుందన్న సూచన ఒకటి ఉందని చెప్పారు. జగన్ ప్రభుత్వం పైశాచిక ఆనందంతో వాటిని మూసివేసిందని ఆయన వ్యాఖ్యానించారు.



జగన్ చేయలేనిది బాబు చేశారు

అధికారంలోకి రాగానే 23 వేల టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ వేస్తామని 2019 ఎన్నికలకు ముందు జగన్ హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక అన్ని ఖాళీలు లేవని మాట మార్చారు. ఒక దశలో అసలు డీఎస్సీ అవసరమే లేదని అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శాసనమండలిలో ప్రకటించారు. మొత్తం ఖాళీలు 700 మాత్రమేనని తేల్చారు. నిరుద్యోగుల నుంచి ఒత్తిడి, ఎన్నికల సమయం కావడంతో మరో మూడు నెలల్లో ఎన్నికలనగా ఈ ఏడాది ఫిబ్రవరి 12న 6,100 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. అది కూడా సక్రమంగా ముందుకు సాగకుండా ఎస్జీటీ పోస్టులకు అర్హతపై పిల్లిమొగ్గలు వేశారు. అందుకు భిన్నంగా చంద్రబాబు మొదటి రోజే మెగా డీఎస్సీ ఫైలుపై సంతకం చేశారు. విభజిత ఆంధ్రలో ఇదే పెద్ద నోటిఫికేషన్. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక ఒకసారి 9 వేలు, మరొకసారి 7,729 పోస్టులతో రెండు నోటిఫికేషన్లు ఇచ్చింది. ఇక మెగా డీఎస్సీ వేస్తానన్న జగన్ ఎన్నికల ముందు వరకూ డీఎస్సీని పట్టించుకోలేదు. ఇప్పుడు చంద్రబాబు ఒకేసారి 16,347 పోస్టులతో పెద్ద డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. వీలైనంత త్వరగా నోటిఫికేషన్ ఇచ్చేందుకు పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. గత ప్రభుత్వంలో ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ సమయంలో టెట్ నిర్వహించింది. అయితే ఇప్పుడు మళ్లీ టెట్ నిర్వహించాలా? నేరుగా డీఎస్సీ ఇవ్వాలా? అనే ప్రశ్న తలెత్తుతోంది.

మాట నిలబెట్టుకున్నారు: నిరుద్యోగ జేఏసీ

గత వైసీపీ సర్కారు మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను నిండా ముంచిందని, చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తొలిరోజే ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభించిందని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్ధిక్ అన్నారు. హామీల అమలులో నిజమైన చిత్తశుద్ధి అంటే ఇలా ఉంటుందన్నారు. మెగా డీఎస్సీ ఫైలుపై తొలి సంతంకం చేసిన చంద్రబాబును గురువారం సచివాలయంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. పది లక్షల మంది నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.



అవనిగడ్డలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

చంద్రబాబు, పవన్‌కు పాలాభిషేకం

అవనిగడ్డ, జూన్ 13: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీపై చంద్రబాబు తొలి సంతకం చేయడం పట్ల అవనిగడ్డలో శిక్షణ పొందుతున్న డీఎస్సీ ఆశావాహులు హర్షం వ్యక్తం చేశారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నేతృత్వంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. డీఎస్సీ ఆశావాహులు జయ జయ ధ్వానాల నడుమ బుద్ధప్రసాద్ ఇంటి వద్ద నుంచి వంతెన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి.. వంతెన సెంటర్‌లో పాలాభిషేకం నిర్వహించారు.

అమరావతి నిర్మాతకు



రోడ్డంతా పూలు పరిచి చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న అమరావతి ప్రజలు

అపూర్వ స్వాగతం!

సీఎం చంద్రబాబుపై రాజధానిలో పూలవర్షం

- **టన్నులకొద్దీ పూలతో బాటలు పరిచిన రైతులు**
- **మంగళహారతులతో స్వాగతం పలికిన మహిళలు**
- **ఓపెన్ టాప్ వాహనంపై నుంచి వారందరికీ ముఖ్యమంత్రి అభివాదం**

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల అవమానాల తాలూకా బాధ ఒకవైపు.. ఆ కష్టాలు, కడగండ్లు, అవమానాలన్నీ తొలగిపోయాయన్న భరోసా మరోవైపు..! ఐదేళ్లుగా ఆవరించిన అంధకారపు ఆవేదన ఒకవైపు.. ఆ చీకటిని పారదోలే చంద్రోదయం ఇంకోవైపు.. ఇలా ఎన్నో భావోద్వేగాలు.. భరోసాల సమాహారంగా గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు రాజధాని పర్యటన సాగింది. నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతి రూపశిల్పి అయిన ఆయన రాకతో రాజధాని ప్రాంతం పులకించింది. ఆయన్ను పూలవానలో ముంచెత్తి.. జయజయ ధ్వానాలతో ఘనంగా స్వాగతించింది. జగన్ ఐదేళ్ల ఏలుబడిలో పాడుబెట్టిన రాజధానిలో గూడుకట్టుకున్న ఆవేదనంతా ఒక్కసారిగా మాయమై ఆనందం తాండవించింది. ఐదేళ్లుగా పండగలకు, పర్వదినాలకు దూరమైన తమకు ఇదే అసలైన పండగంటూ రాజధాని గ్రామాల రైతులు, మహిళలు, సాధారణ ప్రజలు వీధుల్లోకి వచ్చి సంతోషంతో సంబరాలు చేసుకున్నారు. ఉండవల్లిలోని తన నివాసం నుంచి సీఎం హోదాలో సచివాలయానికి గురువారం బయల్దేరిన చంద్రబాబుకు వారంతా అడుగడుగునా పూలబాటలు పరచి అపూర్వ స్వాగతం పలికారు. పూల వర్షం కురిపించారు. ఐదేళ్లుగా అనుభవించిన అవమానాలు, వేధింపులు, కష్టాలు మరిచిపోయి మంగళ హారతులతో ఆయన్ను స్వాగతించారు. మధ్యాహ్నం 3 గంటలకు నూతన ముఖ్యమంత్రి సచివాలయానికి వస్తున్నారన్న విషయం గురువారం ఉదయం తెలియగానే రైతులు ఒక్కసారిగా ఆనందంతో రోడ్లపైకి వచ్చారు. ట్రాక్టర్లలో బంతిపూలు, గులాబీలు తెచ్చి వెంకటపాలెం సీడ్ రోడ్డు మొదలు సచివాలయం వరకు పదుల కిలోమీటర్ల మేర పూలను రోడ్లపై పరిచి చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు. జై బాబు.. జైజై బాబు అంటూ నినాదాలతో హోరెత్తించారు. మహిళలు రైతు శిబిరాల్లో టన్నుల కొద్దీ బంతి పూలు, గులాబీ పూలు వలిచే పనిలో పడ్డారు. 2019లో వైసీపీ మూకలు ఎక్కడైతే రాళ్లదాడి చేసి చంద్రబాబును అవమానించారో.. అదే చోట జనం ఆయనపై పూలవర్షం కురిపించి గౌరవించారు. 'జై చంద్రబాబు'.. 'సీఎం చంద్రబాబు..' 'న్యాయం గెలిచింది.. అమరావతి నిలిచింది' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. బాబు కాన్వాయ్ సీడ్ యాక్సిస్ రోడ్డులో ప్రవేశించగానే రాజధాని రైతులు కూడా వెంట వచ్చారు. ఆ రోడ్డుకు ఇరువైపులా భారీ వాహనశ్రేణితో వారు చంద్రబాబు కాన్వాయ్ వెంట ప్రదర్శన చేపట్టడం విశేషం. అనేక మంది రైతులు పూలు జల్లుతూ ఆయన కాన్వాయ్ వెంట పరుగులు పెట్టారు. కొంతమంది రైతులు కాన్వాయ్‌కు ఎదురువెళ్లి ఆయనకు చేతులెత్తి మొక్కారు. రోడ్డుకు ఇరువైపులా నిలబడి నమస్కారాలు చేస్తున్న మహిళలకు, రైతులు, రైతు కూలీలకు చంద్రబాబు ఓపెన్ టాప్ కారులో నిలబడి అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

పెద్ద కొడుకులా ఆదుకున్నారు



ఎన్నికల్లో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకున్నారు. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రూ.4 వేలు పింఛన్ పెంపుపై సంతకం చేయడం చంద్రబాబుకే సాధ్యమైంది. పెద్దకొడుకులా ఆదుకున్నారు.

- మలిగేని రామక్క, వృద్ధురాలు, కోసిగి

చంద్రబాబుకు రుణపడి ఉంటాం



దివ్యాంగులకు ఇచ్చిన హామీల్లో భాగంగా సీఎం చంద్రబాబు గురువారం పింఛన్ పెంపుపై సంతకం పెట్టడం చాలా సంతోషంగా ఉంది.ఆయనకు రుణపడి ఉంటాం. ఎవరిపైనా ఆధారపడకుండా మమ్మల్ని తల ఎత్తుకునేలా చేశారు.

- దుర్నిగేని మాణికమ్మ, దివ్యాంగురాలు, కోసిగి



ప్రజాస్వామ్యం గెలిచింది... అమరావతి నిలిచింది అని రాసి ఉన్న ప్లకార్డులతో చంద్రబాబుకు అమరావతి ప్రజల స్వాగతం



అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సీఎం చంద్రబాబును ఆశీర్వదిస్తున్న వేద పండితులు

పాస్ పుస్తకాలపై జగన్ ఫొటో ఉండదు

పట్టాదార్ పాస్ పుస్తకాలపై సైకో జగన్ ఫొటో తీసివేయాలని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు ఈ సందర్భంగా చంద్రబాబుకు సూచించారు. ఆయన వెంటనే అంగీకరించారు. వాటిపై ఆ ఫొటోలు ఉండవని, వాటిని తీసివేయిస్తానని ప్రకటించారు. లాండ్ టైటిలింగ్ చట్టాన్ని అడ్డు పెట్టుకుని భూములు ఆక్రమించుకోవడం, సెటిల్మెంట్లకు తెరదీయాలని చూడడం వల్లే దానిని రద్దు చేయాలని నిర్ణయించామన్నారు. వైసీపీ రౌడీలు తమ స్థలాలు ఆక్రమించుకున్నారని గుడివాడకు చెందిన కొందరు సామాన్యులు ఈ సమావేశంలో చంద్రబాబుకు విన్నవించారు. ఎవరు ఆక్రమణలకు పాల్పడినా వాటిని వెంటనే తొలగిస్తామని, కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హామీఇచ్చారు.

ఇక పెన్షన్ 4 వేలు

- **మాట ప్రకారం చంద్రబాబు సంతకం**
- **ఏప్రిల్ నుంచే పెంపుదల అమల్లోకి**
- **జూలై 1న చేతికి రూ.7 వేలు పెన్షన్**
- **65 లక్షల మందికి ప్రయోజనం**
- **ఎన్టీఆర్ భరోసా పేరిట సామాజిక పెన్షన్లు**
- **బాబు నిర్ణయంపై సర్వత్రా హర్షం**

(అమరావతి-ఆంధ్రజ్యోతి)


సామాజిక పెన్షన్‌దారులకు తీపికబురు. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే సామాజిక పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతామన్న ఎన్నికల హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేర్చారు. గురువారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. పెన్షన్ పెంపు ఫైలుపై సంతకం చేశారు. దీంతో ఇక నుంచి ప్రతి నెలా అదనంగా రూ.1000తో కలిపి మొత్తం రూ.4 వేలు ఎన్టీఆర్ భరోసా పేరిట పెన్షన్ అందనుంది. పెంచిన పెన్షన్ మొత్తాన్ని ఏప్రిల్ నుంచే అమలు చేస్తామని కూటమి మేనిఫెస్టోలో పేర్కొన్నారు. ఈ లెక్కన ఏప్రిల్, మే, జూన్‌కు సంబంధించి నెలకు రూ.1000 చొప్పున 3 నెలలకు బకాయి రూ.3 వేలతో పాటు జూలై నెలలో ఇచ్చే కొత్త పెన్షన్ రూ.4 వేలు కలిపి మొత్తం రూ.7 వేలును జూలై 1న ఇవ్వనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 65 లక్షల మంది పెన్షన్‌దారులు లబ్ధి పొందనున్నారు. పెన్షన్ మొత్తం పెంచడంతో రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతి నెలా రూ.650 కోట్ల దాకా అదనపు భారం పడనుంది.

బాబు హయాంలోనే భారీగా పెంపు

పెన్షన్ల విషయంలో టీడీపీ, ఇతర పార్టీల ప్రభుత్వాలతో పోలిస్తే టీడీపీ హయాంలోనే ఎక్కువ మేలు జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో 2014కు ముందు వృద్ధాప్య, వితంతువులకు రూ.200, దివ్యాంగులకు రూ.500 పెన్షన్ ఇచ్చేవారు. నవ్యాంధ్రలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెన్షన్లను ఐదురెట్లు పెంచారు. వృద్ధాప్య, వితంతువులు, చేనేత, కల్లు గీత, కళాకారులు, 40-79 శాతం మధ్య అంగవైకల్యం ఉన్నవారికి రూ.1000, దివ్యాంగులకు రూ.1500 చేశారు. ఆ తర్వాత సామాజిక పెన్షన్ల మొత్తాన్ని రూ.2 వేలు, దివ్యాంగులకు రూ.3 వేలకు పెంచారు. మిగతా ప్రభుత్వాలతో పోలిస్తే టీడీపీ హయాంలోనే పెన్షన్ల సంఖ్య భారీగా పెరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో సామాజిక పెన్షన్లు 69 లక్షలు ఇచ్చేవారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో 35.32 లక్షలు పంపిణీ చేసేవారు. నవ్యాంధ్రలో చంద్రబాబు ప్రభుత్వం 2014 అక్టోబరులో కొత్తగా 3.72 లక్షల పెన్షన్లను మంజూరు చేశారు. ఆ తర్వాత 2014 డిసెంబరు 1న మరో 3.46 లక్షల పెన్షన్లు మంజూరు చేస్తూ జీఓ విడుదల చేశారు. గిరిజనుల్లో ప్రిమిటివ్ ట్రైబల్స్ గ్రూప్ తెగకు శారీరకంగా చిన్న వయసులోనే వృద్ధాప్యం సంక్రమిస్తున్నందున 50 ఏళ్లకే పెన్షన్ ఇచ్చారు. 2015 ఏప్రిల్‌లో ట్రాన్స్‌జెండర్లకు పెన్షన్లు మంజూరు చేశారు. 2015 జూన్‌లో మరో 1.50 లక్షల పెన్షన్లు మంజూరు చేశారు. చంద్రబాబు ఐదేళ్ల కాలంలో మొత్తం 19 లక్షలకు పైగా పెన్షన్లు మంజూరు చేశారు. జగన్ వచ్చిన తర్వాత పెన్షన్‌దారులకు వయోపరిమితి 60 ఏళ్లకు తగ్గించినప్పటికీ 11 లక్షలు మాత్రమే కొత్తగా మంజూరు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 65 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నారు.

జగన్ హయాంలో మోసం

పెన్షన్ల మంజూరు, పెన్షన్ల మొత్తం పెంపుదల విషయంలో జగన్ మోసం చేశారు. అధికారంలోకి వస్తే పెన్షన్ మొత్తాన్ని రూ.2 వేలు నుంచి రూ.3 వేలకు పెంచుతామన్న హామీపై మాట తప్పారు. ఏటా రూ.250 పెంచుతామని మెలికపెట్టారు. ఆ మాట కూడా నిలబెట్టుకోలేదు. చివరకు ఎన్నికల ముందు పెన్షన్‌ను 3 వేలు చేశారు. 2024 జనవరి నుంచి అమల్లోకి తెచ్చారు. ఇక పెన్షన్ల మంజూరులో భారీగా కోత పెట్టారు. అనేక నిబంధనల పేరిట పెన్షన్లు రద్దు చేశారు. పాత పెన్షన్లు రద్దు చేసి కొత్తవి మంజూరు చేశారు.



కోసిగిలో క్షీరాభిషేకం చేస్తున్న వృద్ధులు, దివ్యాంగులు

చంద్రబాబుకు క్షీరాభిషేకం

కోసిగి, జూన్ 13: మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సామాజిక పెన్షన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.4 వేలుకు పెంచడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు జిల్లా కోసిగిలో 3వ వార్డులో చింతలగేని కాలనీలో అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పెద్ద కొడుకులాగా ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఏదైనా చేయాలంటే చంద్రబాబుకే సాధ్యమని, నిండు నూరేళ్ల జీవించాలని ఆశీర్వదించారు. అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

సీఎం చంద్రబాబుకు సచివాలయంలో రెడ్ కార్పెట్

- **ఉద్యోగుల ఘన స్వాగతం**

అమరావతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత గురువారం తొలిసారిగా రాష్ట్ర సచివాలయానికి వచ్చిన సీఎం చంద్రబాబుకు సచివాలయ ఉద్యోగులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. జై బాబు అంటూ నినాదాలతో హోరెత్తించారు. 4వ బ్లాక్ నుంచి ఒకటో బ్లాక్‌వరకు బారులు తీరి స్వాగతం పలికారు. జై బాబు అంటూ నినాదాలు చేశారు. మొదటి బ్లాక్ వెలుపల నుంచి లోపలి వరకు రెడ్ కార్పెట్ వేసి సీఎంకు స్వాగతం పలికారు. చంద్రబాబు ఉద్యోగులకు అభివాదం చేస్తూ, విక్టరీ సంకేతం చూపుతూ చిరునవ్వులు చిందిస్తూ ముందుకు కదిలారు. ఆయన వాహనంపై అభివాదం చేస్తూ వెళుతుండగానే పలువురు ఉద్యోగులు సెల్ఫీలు దిగడానికి పోటీపడ్డారు. ఆయన ఉద్యోగులకు అభివాదం చేస్తూ తన చాంబర్‌లోకి వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ కార్యదర్శి రామకృష్ణ, మాజీ అధ్యక్షుడు మురళీ కృష్ణ సీఎంకు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు రెడ్ కార్పెట్ స్వాగతంలో ఎస్‌వోస్ అసోసియేషన్ అధ్యక్షులు రంగస్వామి, రాఘవ, మహిళా ఉద్యోగుల సంఘం నుంచి అధ్యక్షురాలు వైదూరి దేవి, సహాధ్యక్షులు లక్ష్మణకుమారి, ఆఫీసర్స్ అసోసియేషన్ తరపు నుంచి నూతలపాటి శ్రీనివాస్, అప్సా ప్రధాన కార్యదర్శి శ్రీకృష, సచివాలయ ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు. మరోవైపు సీఎం చంద్రబాబు కోసం సచివాలయ ఉద్యోగులు పోటీ పడి మరీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మందడం సెంటర్ నుంచి సచివాలయం రెండో గేటు సమీపం వరకు రోడ్డు కిరువైపులా స్వాగతం పలుకుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

బాబు రాకతో సచివాలయంలో సందడి

అమరావతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి):గత ఐదేళ్ల నుంచి నిశ్శబ్ద వాతావరణం నెలకొన్న అమరావతి సచివాలయంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఆయన రాకతో సచివాలయానికే వెలుగొచ్చింది. ఉద్యోగులంతా చాలా సంతోషంగా కనిపించారు. స్వేచ్ఛగా బయటికి వచ్చి బాబును చూసేందుకు బారులు తీరారు. నినాదాలు చేశారు. సచివాలయానికి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేల వెంట రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో సందడి వాతావరణం నెలకొంది. పరిసరాలు జనంతో కిటకిటలాడాయి. సచివాలయంలోని ఐదు బ్లాకులు విద్యుత్ దీపాలతో అలంకరించడంతో ధగధగ మెరిసిపోయాయి.

చేయాల్సిందంతా చేస్తా!

- **ఉపాధి కల్పనపై చంద్రబాబు హామీ**
- **స్కిల్ సెన్సస్‌పై సంతకం సందర్భంగా విద్యార్థులతో మాటామంతీ**



అమరావతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కొందరు విద్యార్థులు తమ భవిష్యత్ ఉపాధి అవకాశాలపై ఇచ్చిన సలహాలు, వినతులను ఆసక్తిగా విన్న ముఖ్యమంత్రి చంద్రబాబు వారి ఆలోచనలను స్వాగతించారు. మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ఎంత చేయాలో అంతా చేస్తానని విస్పష్ట హామీ ఇచ్చారు. గురువారం సాయంత్రం ఇక్కడి అమరావతి సచివాలయంలో ఆయన ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంలో ఈ సన్నివేశం జరిగింది. స్కిల్ సెన్సస్ (నైపుణ్య గణన) నిర్వహణపై సంతకం పెడుతున్న సందర్భంగా కొందరు విద్యార్థులను ఆయన తన కార్యాలయానికి పిలిపించుకున్నారు. వారి అభిప్రాయాలు చెప్పాలని కోరారు. ఇంటర్మీడియట్ చదువుతున్న ఒక విద్యార్థి మొదట మాట్లాడాడు. 'అందరికీ ఐటీ అంటే ఆసక్తి ఉండదు. దానితోపాటు మీరు హోటల్ మేనేజ్‌మెంట్, ఫిల్మ్ మేకింగ్ వంటి ఇతర రంగాల్లో కూడా అవకాశాలు అందుకునేలా ప్రోత్సహిస్తే బాగుంటుంది. ఒకటే రంగంపై కాకుండా అన్ని రంగాల్లో ఈ ప్రోత్సాహం ఉండాలి' అని సూచించాడు. ఇది మంచి ఆలోచన అని చంద్రబాబు ప్రశంసించారు. 'పవన్ కల్యాణ్ నాతో ఒకసారి ఒక విషయం చెప్పాడు. సినిమాల్లో హీరోగా ఉన్న తన అన్న తనకు కొద్దిగా నటన నేర్పాడని.. దానిని అందిపుచ్చుకుని స్వయంకృషితో పైకి ఎదిగానని చెప్పాడు. కుటుంబంలో ఒకరు ఒక రంగంలో ఉండి చేయూత ఇవ్వడం మిగిలినవారికి బాగా ఉపయోగపడింది. అందరికీ అటువంటి ఆసరా దొరకదు. ఆ పని ప్రభుత్వం చేయాలి. మేం చేస్తాం. ఒక్క ఐటీనే కాకుండా ఏ రంగంలో అవకాశాలు బాగుంటే ఆ రంగంలో నైపుణ్య శిక్షణ ఇప్పించి వాటిని అందుకునేలా చేస్తాం. ఉదాహరణకు విదేశాల్లో నర్సు ఉద్యోగాలకు బాగా డిమాండ్ ఉంది. మంచి వేతనాలు ఉన్నాయి. దానిని కూడా ప్రోత్సహిస్తాం' అని ఆయన అన్నారు. మరో ఇంటర్ విద్యార్థిని మాట్లాడుతూ.. తాను ఇంజనీరింగ్ చదవాలనుకుంటున్నానని, అదే సమయంలో తనకు ఒక చిన్న ఉద్యోగం కూడా ఉంటే బాగా ఉపయోగపడుతుందని, అటువంటి అవకాశాలను తనవంటి విద్యార్థులకు కల్పించాలని కోరారు. ఇది కూడా మంచి ఆలోచనేనని సీఎం తెలిపారు. 'ఇంట్లో ఉండి పనిచేసుకునే రిమోట్ ఉద్యోగాలు అందుబాటులో ఉంటే నువ్వు అనుకుంటున్నట్లు చదువుకుంటూ పనిచేసుకోవడానికి ఉపయోగపడతాయి. వాటికి అవసరమైన శిక్షణ మేం కల్పిస్తాం. రిమోట్ ఉద్యోగాల వల్ల ఇంట్లో తల్లిదండ్రుల వద్దే ఉండి పనిచేసుకోవచ్చు. ఇటువంటి వారి కోసం మండల కేంద్రాలు, పట్టణాల్లో రిమోట్ వర్క్ స్టేషన్ల పేరుతో కొన్ని సెంటర్లు ఏర్పాటు చేయాలని కూడా భావిస్తున్నాం. ఇంట్లో కుదరకపోతే అక్కడకు వెళ్లి పనిచేయవచ్చు. ఎకానమీ పెరిగితే చిన్న ఉద్యోగాలు కూడా పెరుగుతాయి. ఉద్యోగ అవకాశాలు పెంచడమే మా మొదటి లక్ష్యం' అని ఆయన ఆ అమ్మాయితో అన్నారు. యువత సొంతంగా స్టార్టప్ కంపెనీలు పెట్టుకోవడానికి సాయం చేయాలన్న మరో విద్యార్థి విజ్ఞప్తికి కూడా ఆయన సానుకూలంగా స్పందించారు. సరైన శిక్షణ, చేయూత లేకపోవడం వల్ల స్టార్టప్‌లు అనేకం విఫలమవుతున్నాయని, ఆ లోపం పూరించేలా ప్రణాళిక రూపొందించి సాయం అందిస్తామని తెలిపారు. అవకాశాలు అందిస్తే అందుకోవడంలో మన యువతకు ఉన్న చొరవ మరెవరికీ లేదని, ఐటీ విషయంలో అది రుజువైందని చంద్రబాబు చెప్పారు. 'ఐటీ కంపెనీలు తేవడంతోపాటు మంచి విద్య కోసం రాష్ట్రమంతా ఇంజనీరింగ్ కళాశాలలు పెంచాం. వీటి ఆసరాతో మన వాళ్లు ప్రపంచమంతా విస్తరించారు. నా వల్ల, టీడీపీ వల్ల తమకు మంచి జరిగిందని భావించి ఇటీవలి ఎన్నికల్లో లక్షలు ఖర్చు పెట్టుకుని వచ్చి ఇక్కడ ఓట్లు వేశారు. పార్టీ కోసం పనిచేశారు. ఈ రాష్ట్రాన్ని బాగు చేసుకోవాలన్న కసి నాకు వారిలో కనిపించింది. దానినెప్పుడూ మరచిపోను' అని అన్నారు.

సీఎం ముఖ్య కార్యదర్శిగా ముద్దాడ బాధ్యతలు

సీఎం ముఖ్య కార్యదర్శిగా ముద్దాడ రవిచంద్ర బాధ్యతలు స్వీకరించారు. గురువారం ఉదయం 11.43 నిమిషాలకు ముహూర్తం ఖరారు చేసుకుని మరీ సీఎం కార్యాలయంలో ఆయన బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఆయనకు తిరుమల తిరుపతి, కనకదుర్గమ్మ దేవస్థానాల వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు.. సీఎంవో, జీఏడీ అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు.



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కార్యకర్తల సంక్షేమ విభాగం కో- ఆర్డినేటర్ శిష్టా లోహిత్

సివిల్ ఏవియేషన్‌లో ఆదర్శంగా ఏపీ

- సామాన్యులకు అందుబాటులో విమానయానం
- పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు



బాధ్యతలు స్వీకరిస్తున్న కింజరాపు రామ్మోహన్‌నాయుడు

న్యూఢిల్లీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పౌర విమానయాన రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శ రాష్ట్రం(మోడల్ స్టేట్)గా తీర్చిదిద్దుతానని పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చెప్పారు. రాష్ట్రంలోని భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం ఐదేళ్లుగా కుంటుపడిందని, తక్షణమే దాన్ని రికార్డు స్థాయిలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఆ అంశంపై సీఎం చంద్రబాబు, అధికారులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విజయవాడ, తిరుపతి ఎయిర్‌పోర్టులకు డొమెస్టిక్, ఇంటర్నేషనల్ కనెక్టివిటీని పెంచేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాజమండ్రి, కడప, కర్నూలు విమానాశ్రయాలలో వసతులు కల్పిస్తామన్నారు. గురువారం, ఇక్కడి రాజీవ్‌గాంధీ భవన్‌లో పౌర విమానయాన మంత్రిగా రామ్మోహన్‌నాయుడు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భారత విమానయాన రంగాన్ని ప్రపంచస్థాయిలో అగ్రపథాన నిలిపేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కాగా, దేశప్రజలు గర్వించే విధంగా తన శాఖలో కార్యక్రమాలు చేపడతానని చెప్పారు. విమానయాన రంగంలో నైపుణ్యాభివృద్ధిపై దృష్టిపెడతానని చెప్పారు. ఈ అంశంలో ఏపీకి అధిక ప్రాధాన్యమిస్తామని తెలిపారు. తెలంగాణలోని ఎయిర్‌పోర్టులపై ఆ రాష్ట్రప్రభుత్వంతో చర్చించి అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. విజయవాడ ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. పెరుగుతున్న విమాన చార్జీలను సమీక్షించి, ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, విమానప్రయాణాన్ని సామాన్యులకు అందుబాటులోకి తెచ్చేందుకు 100 రోజుల ప్రణాళిక రూపొందించి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యంగా 2047 వరకూ సివిల్ ఏవియేషన్ శాఖలో ఏయే కార్యక్రమాలు చేయాలనేదానిపై దృష్టి పెట్టి, ఈ ఐదేండ్లలో పౌరవిమానయాన రంగాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని మంత్రి చెప్పారు.

21 సార్లు ఓం శ్రీరాం అని రాసిన మంత్రి!

గతంలో విమానయాన శాఖ మంత్రిగా అశోక్‌గజపతిరాజు.. ప్రయాణికులకు సదుపాయాలు కల్పించడంతోపాటు, ఏపీలో సివిల్ ఏవియేషన్ అభివృద్ధికి పునాదులు వేశారని మంత్రి అన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్, తెలుగు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కాగా, బాధ్యతలు స్వీకరించే సమయంలో 21 సార్లు ఓం శ్రీరామ్ అని రాశారు. బాధ్యతలు స్వీకరించాక సీఎం చంద్రబాబుతో పాటు తన తల్లికి, భార్యకు ఫోన్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు.

అన్ని వర్గాలకు భద్రత, భరోసా

- మంత్రులు నిమ్మల, డోలా, సవిత

అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన వెంటనే ఐదు ముఖ్యమైన ఫైళ్లపై సంతకాలు చేసి, రాష్ట్రంలో అన్ని వర్గాలకు భద్రత, భరోసా కల్పించారని నూతన మంత్రులు నిమ్మల రామానాయుడు, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎస్.సవిత చెప్పారు. అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో గురువారం రాత్రి మంత్రులు మీడియాతో మాట్లాడారు. ఈ ఐదు సంతకాలతో నిరుద్యోగ యువత, రైతులు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, నిరుపేదలకు భరోసా కల్పించారని అని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాల అమలుపై రోడ్ మ్యాప్ తయారు చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. 'వలంటీర్ల వ్యవస్థ రద్దు కాలేదు. ఎంత మంది వలంటీర్లు రాజీనామా చేశారో, ఎంత మంది పని చేస్తున్నారో సమీక్షిస్తామన్నారు. వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తూ, వారికి రూ.10వేల వేతనమిచ్చి, పింఛన్లు ఇంటి వద్దే పంపిణీ చేయిస్తామని చేస్తామని తెలిపారు.

రాష్ట్రంలో ప్రజా పాలన ప్రారంభం: పయ్యావుల

ప్రజలకిచ్చిన వాగ్దానాలపై చంద్రబాబు సీఎంగా బాధ్యతలు స్వీకరించగానే తొలి సంతకం పెట్టి నెరవేర్చారని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు రాగానే సచివాలయంలో పండగ వాతావరణం నెలకొందన్నారు. ఇది రాబోయే మంచిరోజులకు సంకేతమన్నారు. రైతులు, ఉద్యోగులు పలికిన స్వాగతం అద్భుతమని, 6 కిలోమీటర్లు రైతులు రోడ్డుకు ఇరువైపులా నిలబడి పూలు జల్లుతూ, నాట్యాలు చేశారని తెలిపారు.

రాష్ట్ర హితం కోసం పని చేస్తా: సత్యకుమార్

అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హితం కోసం శక్తి వంచన లేకుండా పని చేస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ ఇచ్చిన హామీలపై తొలి సంతకం చేశారన్నారు. కేంద్రం నుంచి పూర్తి సహకారం రాష్ట్రానికి ఉంటుందన్నారు.

బీసీలకు బాబు ప్రాధాన్యం: మంత్రి సుభాష్

అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం బీసీలను వెనక్కి పెడితే, ఈ ప్రభుత్వం బీసీలకు ప్రాధాన్యం ఇచ్చిందని మంత్రి వాసంశెట్టి సుభాష్ చెప్పారు. ఈ ఎన్నికల్లో 60 నుంచి 70 శాతం వరకు బీసీలు చంద్రబాబు వెంటే ఉన్నారన్నారు. బీసీల్లో 80 శాతంపైగా తమ వెంటే వచ్చేలా కృషి చేస్తానన్నారు. నారా లోకేశ్‌కు, పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ చేతకానితనం వల్లే పోలవరం ఆగింది: పార్థసారధి

ఏలూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కేవలం చంద్రబాబుకు, టీడీపీకి ఇమేజ్ వస్తుందన్న కారణంతోనే పోలవరం ప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వం అడ్డుకుందని, నిర్మాణం ముందుకు సాగకుండా నిలిచిపోయేలా చేసిందని మంత్రి కొలుసు పార్థసారథి విమర్శించారు. అహంకారం, నీచ ఆలోచనలతోనే పోలవరం, చింతలపూడి ఎత్తిపోతల పనులు కొనసాగకుండా చేశారని దుయ్యబట్టారు. గురువారం మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన ఏలూరులో మీడియా సమావేశంలో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు వైసీపీ చేతకానితనం వల్లనే నిలిచిపోయిందన్నారు. పామాయిల్ రైతులు దారుణంగా దెబ్బ తిన్నారని, చంద్రబాబు హయాంలో హార్టికల్చర్ అభివృద్ధికి ఉచితంగా డ్రిప్ సౌకర్యం కల్పించగా, దానిని వైసీపీ నిలిపివేసిందని చెప్పారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు, నాయకులను వైసీపీ తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని, కేసులతో వేధించిందని విమర్శించారు. పోలవరం సహా మిగతా పెండింగ్ పనులన్నింటినీ సమీక్షించి తగు నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

భ్రష్టు పట్టించారు!

- ఏం చేశారో ఆత్మ విమర్శ చేసుకోండి
- సీనియర్ బ్యూరోక్రాట్లకు సీఎం 'క్లాస్'

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

మూడంటే మూడు నిమిషాలు! అయితేనేం... చంద్రబాబు సూటిగా, ఘాటుగా మాట్లాడారు. సీనియర్ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లకు క్లాస్ తీసుకున్నారు. మరీ ముఖ్యంగా... జగన్ ప్రభుత్వ హయాంలో గీతదాటి వ్యవహరించిన ఉన్నతాధికారులు భుజాలు తడుముకునేలా చేశారు. 'మీపట్ల గతంలో ఉన్న గౌరవం పోయింది' అని చెప్పకనే చెప్పారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం గురువారం తొలిసారి సచివాలయానికి వచ్చిన చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు చెప్పేందుకు అఖిలభారత సర్వీసు అధికారులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. వారందరినీ ఒక హాలులో కూర్చోబెట్టారు. సీఎం చంద్రబాబు అక్కడికే వెళ్లి క్లుప్తంగా మాట్లాడారు. "నేను ఉమ్మడి రాష్ట్రానికీ, నవ్యాంధ్రకూ ముఖ్యమంత్రిగా పని చేశాను. ఇప్పుడు మరోసారి ముఖ్యమంత్రిని అయ్యాను. నేను తొలిసారి సీఎం అయినప్పుడు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు నిబద్ధతతో పని చేసేవారు. నాకూ ఐఏఎస్, ఐపీఎస్‌లంటే గౌరవం ఉండేది. వ్యవస్థల్ని బాగా నడుపుతున్నారనే భావన ఉండేది. కానీ... గత ఐదేళ్లలో ఏం చేశారో ఆత్మ విమర్శ చేసుకోండి. వ్యవస్థల్ని భ్రష్టుపట్టించారు. నిబంధనలు పక్కన పెట్టి, ఒక అజెండాతో పని చేసి మొత్తం డ్యామేజ్ చేశారు. అడ్మినిస్ట్రేషన్ పూర్తిగా దెబ్బతింది. వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయి. పరిపాలన ఇంత అన్యాయంగా తయారవుతుందని నేను ఊహించలేదు. గత ప్రభుత్వంపై ప్రజల్లో ఎన్నడూ లేనంత కసి కనిపించడానికి కారణం... ఐదేళ్లలో జరిగిన దారుణాలే. నాకు జరిగిన అన్యాయం గురించి నేను మాట్లాడటంలేదు. ఎప్పుడూ మాట్లాడను కూడా. రాష్ట్రానికి జరిగిన అన్యాయం గురించే నా బాధ. ఇప్పుడు వ్యవస్థల్ని మళ్లీ గాడిలో పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. అందుకు కొన్ని నిర్ణయాలు తీసుకుంటాను" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో అధికారులంతా గంభీరంగా, మౌనంగా ఉండిపోయారు. ఇప్పుడు తనకు సమయం లేదని రెండు, మూడు రోజుల్లో మరోసారి అందరితో సమావేశం ఏర్పాటు చేస్తానని చంద్రబాబు చెప్పారు. అప్పుడు అన్ని అంశాలపైనా సుదీర్ఘంగా చర్చిద్దామని అక్కడి నుంచి వచ్చేశారు.

గుబులు... బెంబేలు...

బ్యూరోక్రాట్లకు చంద్రబాబు అత్యంత గౌరవం, విలువ ఇస్తారు. వారిని గౌరవంగా చూసుకుంటారు. అలాంటిది ఆయనే ప్రస్తుత పరిస్థితిపై ఆగ్రహంతో కూడిన ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. చట్టాలు, నిబంధనలు పాటించకుండా... 'తాడేపల్లి' ఆదేశాలనే శాసనంగా భావించి అమలు చేసిన ఐఏఎస్‌లు... ఐపీసీ పక్కనపెట్టి 'వైసీపీ'కి జైకొట్టిన ఐపీఎస్‌లు అనేకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. చంద్రబాబు ఘాటు వ్యాఖ్యలతో వీళ్లందరిలోనూ గుబులు మొదలైందని అధికార వర్గాలు చెబుతున్నాయి. గత ప్రభుత్వంలో చట్టాన్ని మీరి పని చేసి, వివాదాస్పదమైన అధికారులు ఇప్పుడు చంద్రబాబును ప్రసన్నం చేసుకునేందుకు పోటీ పడ్డారు. అక్రమాస్తుల కేసులో నిందితురాలు, జగన్ సీఎం కాగానే తెలంగాణ నుంచి ఏపీకి వచ్చేసిన ఐఏఎస్ శ్రీలక్ష్మి గురువారం బొకేతో సచివాలయంలో ప్రత్యక్షమయ్యారు. తాను బాధ్యతలు స్వీకరిస్తున్న సమయంలో ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్, సీఎం ముఖ్య కార్యదర్శి మినహా ఇతర అధికారులు చాంబర్‌లో ఉండొద్దని చంద్రబాబు ముందే చెప్పారు. ఇతర అధికారులంతా సమావేశ మందిరంలో ఉండాలని, తానే అక్కడి వస్తానని స్పష్టం చేశారు. కానీ... శ్రీలక్ష్మి బొకే తీసుకుని తలుపు తోసుకుని సీఎం చాంబర్‌లో అడుగుపెట్టారు. సీఎం కొంత అసహనంతో ఆమె వైపు చూశారు. సీఎస్ నీరబ్ కుమార్ ఆమె వద్దకు వెళ్లి... అక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పినట్లు తెలిసింది. ఇక... ఐదేళ్లు జగన్‌కు వీర విధేయుడిగా, టీడీపీ నేతలను వేధించడమే లక్ష్యంగా పని చేసిన ఐపీఎస్ అధికారి పీఎస్సార్ ఆంజనేయులు కూడా సీఎం చాంబర్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఆయన తలుపు వద్ద వేచి చూస్తుండగానే.. ఇంటెలిజెన్స్ చీఫ్ కుమార్ విశ్వజీత్ వెళ్లి, మీటింగ్ హాలులోకి వెళ్లాలని అక్కడి నుంచి పంపించేశారు. గత ప్రభుత్వంలో స్వామి భక్తి పరాయణులుగా గుర్తింపు పొందిన అధికారులు సీఎంకంటే ముందుగా వచ్చి, ఆయన కుర్చీకి బాగా దగ్గరగా కూర్చున్నారు. ముందుగా అనుకున్నదాని ప్రకారం ఒక్కో అధికారి వరుసలో ఆయన వద్దకు వచ్చి పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఫొటోలు దిగాల్సి ఉంది. చంద్రబాబు వారికి ఆ అవకాశం ఇవ్వలేదు. తన సీటుకు దగ్గరగా కూర్చున్నవారు ఇద్దరు ముగ్గురు ఇచ్చిన బొకేలను ముభావంగా తీసుకొని టేబుల్ మీద పెట్టేశారు. సునీల్ కుమార్ కూడా పుష్ప గుచ్ఛం ఇవ్వగలిగారు. ఆయన వైపు కనీసం చూడకుండా చంద్రబాబు దానిని తీసుకొని టేబుల్ మీద పెట్టేశారు. తాను కొత్త సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఫొటోను సునీల్ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అక్కడి నుంచి తిరిగి వెళుతుండగా గనుల శాఖ ముఖ్య కార్యదర్శి గోపాల కృష్ణ ద్వివేది ఆయనకు పుష్ప గుచ్ఛం ఇవ్వడానికి గబగబా దగ్గరకు రాగా... చంద్రబాబు ఆయన వైపు చూడకుండానే వెళ్లిపోయారు.



సచివాలయంలో ఐఏఎస్, ఐపీఎస్, ఇతర ఉన్నతాధికారులతో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

వారి పేర్లు కనపడొద్దు!

ఐదు సంతకాలకు సంబంధించిన జీవోలను సంబంధిత శాఖల కార్యదర్శులు జారీ చేయాల్సి ఉంది. కానీ.. ఆ అధికారుల పేర్లు కనిపించకూడదనే ఉద్దేశంతో కాబోలు, సీఎస్ సంతకాలతోనే అవి వెలువడ్డాయి. డీఎస్సీపై ప్రవీణ్ ప్రకాశ్, అన్న క్యాంటీన్లపై శ్రీలక్ష్మి, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై అజయ్ జైన్, పింఛన్ల పెంపుపై శశిభూషణ్ సంతకాలతో జీవోలు జారీ చేయాల్సి ఉంది. కానీ... కొత్త ప్రభుత్వం వీరెవరికీ ఆ అవకాశం ఇవ్వలేదు. సీఎస్ పేరిటే సంబంధిత జీవోలు వెలువడ్డాయి.

వాసుదేవరెడ్డి కారులో ఆరు కేజీల బంగారం కొనుగోళ్ల రసీదులు

- ప్రాథమిక దశలో 'బేవరేజెస్' కేసు విచారణ
- అరెస్ట్ నుంచి రక్షణకు హైకోర్టు నో
- విచారణ ఈ నెల 18కి వాయిదా



అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి కారులో జరిపిన సోదాల్లో సుమారు ఆరు కేజీల బంగారం కొనుగోళ్లకు సంబంధించి రశీదులు దొరికాయని సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు హైకోర్టుకు నివేదించారు. వాటి విలువ సుమారు రూ.నాలుగు కోట్లు ఉంటుందన్నారు. కారులో వాసుదేవరెడ్డి ఐడీ కార్డు కూడా దొరికిందన్నారు. వాసుదేవరెడ్డి కింద పనిచేసిన అధికారులు ఇప్పటికీ కార్పొరేషన్‌లోనే కొనసాగుతున్నారని, ఈ దశలో వాసుదేవరెడ్డికి అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తే సాక్షులను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని తెలిపారు. పిటిషనర్‌పై మొదట ఐపీసీ సెక్షన్లు 427, 379, 120(బీ)కింద కేసు నమోదు చేశామని, ఆ తరువాత ఐపీసీ 420, 409, 467, 471 వంటి అదనపు సెక్షన్లను ఎఫ్ఐఆర్‌లో చేరుస్తూ సంబంధిత మేజిస్ట్రేట్ ముందు మెమో వేశామని తెలిపారు. అర్నేశ్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు వాసుదేవరెడ్డికి వర్తించవన్నారు. మరోవైపు విజయవాడలోని వాసుదేవరెడ్డి ఇంటిని తెరిచి సోదాలు చేసేందుకు దిగువకోర్టు అనుమతి కోరామని, పూర్తి వివరాలు కోర్టు ముందు ఉంచేందుకు సమయమివ్వాలని కోరారు. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవద్దని అభ్యర్థించారు. ఈ వాదనలు న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ వాసుదేవరెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఈ నెల 18కి వాయిదా వేసింది. అరెస్టుతోపాటు ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోకుండా మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలన్న అభ్యర్థనను తోసిపుచ్చింది. కేసుకు సంబంధించి పూర్తి వివరాలు కోర్టు ముందు ఉంచాలని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ న్యాపతి విజయ్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. 'ఏపీ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్' కేసులో తనకు ముందస్తు బెయిల్ కోరుతూ వాసుదేవరెడ్డి హైకోర్టును ఆశ్రయించగా ఈ వ్యాజ్యం గురువారం విచారణకు వచ్చింది. ఆయన తరఫున న్యాయవాది నగేశ్‌రెడ్డి వాదనలు వినిపించారు. మరోవైపు సీఐడీ తరఫున ఈ కేసులో వాదనలు వినిపించేందుకు న్యాయవాది ఎం.లక్ష్మీనారాయణ, సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

'సాఫ్ట్'గానే 350కోట్లు దోచేశారు

- ఖనిజాల వేలంలో భారీ గోల్‌మాల్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గనుల శాఖలో మరో భారీ గోల్‌మాల్ బయటపడింది. రెండున్నరేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 300కుపైగా భారీ, చిన్న తరహా ఖనిజాలు(మినరల్స్) వేలం వేశారు. జగన్ ప్రభుత్వ పెద్దలు చెప్పిన వారికే ఈ వేలంలో ఖనిజాలు కట్టబెట్టారు. దీనికోసం బిడ్ 'అసలు విలువ'ను ముందే లీకు చేయడం ద్వారా సర్కారుకు సుమారు 500 కోట్లపైనే గండికొట్టారు. అధికారులు అక్షరాలా రూ.350 కోట్లపైనే జేబులో వేసుకున్నారు. సాంకేతికతను అడ్డంపెట్టుకొని అధికారులు భారీ గోల్‌మాల్‌కు పాల్పడిన తీరు ఇదీ. ఈ దందాలో ఓ ఉన్నతాధికారి, మరో ముగ్గురు సీనియర్, జూనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈవ్యవహారంలో సాఫ్ట్‌వేర్ తాళం చేతులు కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి సిఫారసు చేసిన వ్యక్తికే ఇచ్చారు. అంతే.. 'మీది కడపే... మాది కడపే' అంటూ అందినకాడికి దండుకున్నారు. సర్కారు ప్రయోజనాలను పణంగాపెట్టి జేబులు నింపుకొన్నారు. అసలేం జరిగిందంటే...

వేర్వేరు పేర్లతో ఒక్కరితోనే పలు బిడ్లు

గనుల శాఖలో ఇంతకు ముందు భారీ ఖనిజాల తవ్వకం కాంట్రాక్టు కట్టబెట్టేందుకు ఎవరు ముందు దరఖాస్తు చేసుకుంటే వారికే ప్రాధాన్యత ఇచ్చేవారు. దీంతో అస్మదీయులు, అయిన వారికి లీజులు దక్కేవికావు. అయితే, 2022లో కేంద్రం భారీ ఖనిజాల లీజులకు వేలం (ఆక్షన్) విధానం తీసుకొచ్చింది. ఇదే విధానం ఆంధ్రాలోనూ అమలుచేశారు. అయితే, కేంద్రం చెప్పిన పారదర్శక పద్ధతిలో కాకుండా కుమ్మక్కు విధానంలో నడిపించారు. అదెలా గంటే... గనుల శాఖ డైరెక్టర్ (డీఎంజీ) నిర్వహించే ఖనిజాల లీజుల వేలంలో ఐటీ విభాగానిదే కీలకపాత్ర. ఇందుకోసం ప్రత్యేకసాఫ్ట్‌వేర్‌ను, అప్లికేషన్‌ను రూపొందించారు. ఎవరెవరు వేలంలో పాల్గొన్నారు, బిడ్ విలువ ఏ మేరకు కోట్ చేశారు? అందులో ఎక్కువ విలువ కోట్ చేసిందెవరో తెలుసుకునేలా సాఫ్ట్‌వేర్‌ను తయారుచేశారు. ఎలాగూ వేలం పద్ధతే కాబట్టి, లీజు దక్కించుకునేందుకు సొంత మనుషులతోనే ఐదారు బిడ్‌లు వేయించేవారు. వారికి ముందుగానే ఎంత బిడ్ వేయాలో చెప్పారు. వారితోనే వేర్వేరు వ్యక్తులు, సంస్థల పేరిట ఐదారు బిడ్లు వేయించారు. ఒకరు రెండు కోట్లు, మరొకరు నాలుగు కోట్లు, ఇంకా ఆరు కోట్లమేర బిడ్‌లు వేయించేవారు. వేలానికి అవసరమైన టాప్ ఐదులో వారి మనుషులే ఉండేలా చూసేవారు. ఆ తర్వాత ఆ ఐదుగురితోనే వేలం నిర్వహించేవారు. ఇక ఎలాగూ ఆ ఐదు బిడ్‌లు ఒక్కరివే కావడంతో వేలంలో వారికే లీజులు వచ్చేవి. ఈ విధానం పక్కాగా సాగేందుకు ఐటీ విభాగంలో తమ సొంత మనిషినే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఏర్పాటు చేసుకున్నారు. ఆయన మరెవరో కాదు...కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి సిఫారసు చేసిన వ్యక్తే. డీఎంజీ కార్యాలయంలో ఐటీ విభాగానికి ప్రత్యేకంగా ఓ అధికారి ఉన్నారు. అయినా, సాఫ్ట్‌వేర్, టెండర్లు, మినరల్స్ లీజుల వేలం నిర్వహించే అప్లికేషన్ల తాళాలు, డాంగిల్స్ అన్నీ కడపనుంచి వచ్చిన శేఖర్ వద్దనే ఉండేవి. బిడ్డింగ్‌కు ముందు, వేలంలో టాప్-5గా నిలిచే కంపెనీలకు ముందుగానే ఈయన ద్వారా అసలు విలువను(ఇంటర్నల్ బెంచ్‌మార్క్-ఐబీఎం) తెలియజేసేవారు. ఒక్కో వేలానికి రూ.10 లక్షలపైనే శేఖర్‌కు ముట్టచెప్పేవారు. ఆ తర్వాత బిడ్ గెలుచుకున్న కంపెనీ తమకు సహకరించిన పెద్ద అధికారికి, తెరచాటున సహకరించిన మరో ముగ్గురు జూనియర్ అధికారులకు భారీగానే సమర్పించుకునేది. వీరందరికీ 350 కోట్లపైనే కమిషన్, వాటాల రూపంలో వెళ్లిందని తెలిసింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న ఓ కీలక అధికారి నేతృత్వంలో సాఫ్ట్‌వేర్ శేఖర్‌తోపాటు కిషోర్, రాజు తదితర ఏడుగురు డబ్బు తరలింపులో పాల్గొన్నట్లు తెలిసింది. ఇచ్చిన మాటకు కట్టుబడకుండా తక్కువ సొమ్ము ఇచ్చిన కాంట్రాక్టర్లు, కంపెనీలపై ప్రకాశం జిల్లాకే చెందిన ఓ విజిలెన్స్ అధికారితో దాడులు చేయించిన సందర్భాలున్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

పరారీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

గనుల శాఖ టెండర్లు, వేలంలో లీజు విలువను ముందుగానే లీక్‌చేసిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శేఖర్ పరారీలో ఉన్నారని తెలిసింది. మాంగనీస్ టెండర్లలో పాల్గొన్న ఓ కాంట్రాక్టర్ సెక్యూరిటీ డిపాజిట్ సొమ్మును దారిమళ్లించి దోచుకున్న వ్యవహారంతోపాటు, మరికొన్ని దందాలో ఆయన పాత్ర ఉందని పోలీసు విచారణలో తేలింది. దీంతో గత వారం రోజులుగా పరారీలో ఉన్నారని ఉద్యోగవర్గాలు చెబుతున్నాయి. ఆయనను పట్టుకొని విచారిస్తే పెద్ద అధికారుల అవినీతి గుట్టు, మినరల్స్ లీజుల వేలం దందా బయటపడతాయని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, ఆయన తన భార్య పోస్టును అడ్డంపెట్టుకొని పోలీసులు తనదాకా రాకుండా చూసుకుంటున్నారని తెలిసింది.



బీజేపీ సమావేశానికి హాజరైన నేతలు, మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

జగన్ ఎదుర్కొన్న ఛీత్కారాలు మనకొద్దు

- ప్రజోపయోగ పనులపై శ్రద్ధ పెట్టాలి
- ప్రజాప్రతినిధులు, నేతలతో సమీక్షలో పురందేశ్వరి

అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): 'ఎన్నికల్లో గెలిచాక జగన్ ఏ తప్పిదాలు చేసి ప్రజల ఛీత్కారానికి గురయ్యారో ఆ తప్పిదాలు జరగకుండా మనం జాగ్రత్త పడాలి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నాలుగు విభాగాలపై పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులతో జాతీయ సహసంఘటన ప్రధాన కార్యదర్శి శివ ప్రకాశ్ సమక్షంలో ఆమె సమీక్షించారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ పోటీ చేసిన పార్లమెంటు, అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా పార్టీ బలోపేతం, ఎన్నికల నిర్వహణపై వేర్వేరుగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె శాసన సభ్యులతో మాట్లాడారు. 'ప్రజల్లోకి ఓట్ల కోసం వెళ్లాం. వాళ్ల సమస్యలు మనకు తెలిశాయి. ఎక్కువ మంది ఇబ్బందుల్ని పరిష్కరించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఎక్కువ మంది ప్రజలకు ఉపయోగకరమైన పనులపై శ్రద్ధ పెట్టాలి. ప్రభుత్వంతో సమన్వయం చేసుకొంటూ ప్రజల్లోకి మరింత చొచ్చుకెళ్లాలి' అని సూచించారు. పార్లమెంటు స్థానాల సమీక్షలో మాట్లాడుతూ... 'ఎన్ని గెలిచాం, ఎన్ని ఓడాం అనేది పక్కన బెట్టి ప్రతి చోటా ప్రజల్లో ఉండేందుకే ప్రాధాన్యం ఇవ్వాలి. అసెంబ్లీ స్థానాల్లో మంచి గెలుపు సాధించినట్లే రాబోవు రోజుల్లో పార్లమెంటు స్థానాల్లోనూ సత్తా చాటేందుకు పని చేయాలి' అని అన్నారు. పార్టీ నేతలతో మాట్లాడుతూ... 'జూలై నుంచి పార్టీ సంస్థాగత నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. క్షేత్ర స్థాయిలో పార్టీ బలపడాలి. ఎన్నికల్లో అన్ని విధాలా కష్టపడినా కొన్ని చోట్ల ఓడిపోయాం. అందుకు కారణాలు విశ్లేషిస్తూ ఎన్నికల నిర్వహణ కమిటీ ద్వారా డాక్యుమెంటరీ రూపంలో కేంద్ర పార్టీకి పంపి భవిష్యత్తులో తప్పులు సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉంది' అని అన్నారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి సత్యకుమార్, పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు పాల్గొన్నారు.


జగన్ నోట మళ్లీ వింత మాటలు

(మొదటి పేజీ తరువాయి)

తాడేపల్లి ప్యాలెస్‌లో వైసీపీ ఎమ్మెల్సీలతో ఆయన సమావేశమయ్యారు. 'కళ్లు మూసుకుంటే ఐదేళ్ల కాలం గడిచిపోతుంది' అని మభ్యపెట్టే మాటలు చెప్పారు. "ప్రజల మన్ననలు పొందిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాం. ఎన్నికల్లో ఏమైందో తెలీదు. కళ్లు మూసుకుంటే చాలు ఐదు సంవత్సరాలు అయిపోయింది. మళ్లీ అదే మాదిరి కళ్లు మూసుకుంటే 2029 సంవత్సరం వచ్చేస్తుంది. సినిమాలో ఓన్లీ ఫస్ట్ హాఫ్ మాత్రమే అయింది. ఇంటింటికీ మనం చేసిన మంచి ప్రజల్లో ఇంకా బతికే ఉంది. కాబట్టి మనం మళ్లీ పైకిలేవడం తథ్యం. కాకపోతే కొంచెం సమయం పడుతుంది. అన్నిటికన్నా ముఖ్యమైన విషయం.. విలువలు, విశ్వసనీయత. రాజకీయాల్లో ఈ పదాలకు అర్థం తెలిసి ఉండడం చాలా అవసరం. విలువలు, విశ్వసనీయత లేని మనిషిగా రాజకీయాలు చేద్దామా? లేదా కష్టాలు వచ్చినప్పుడు వాటిని ఎదుర్కొన్ని హుందాగా నిలబడి.. ఐదు సంవత్సరాలు కళ్లు మూసుకుంటే మళ్లీ మన ప్రభుత్వం వస్తుందని గుర్తుపెట్టుకుని అడుగులు వేద్దామా అన్నది కూడా ఆలోచన చేసుకోవాలి" అని జగన్ వ్యాఖ్యానించారు. ఆయన చేశానంటున్న మంచి కంటే.. చేసిన చెడే ఎక్కువని జనం ఈ ఎన్నికల్లో తేల్చేశారు. గద్దెదించి... ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా మూలన కూర్చోబెట్టారు. అయినా సరే... 'చేసిన మంచి బతికే ఉంది. మళ్లీ పైకి లేస్తాం' అని జగన్ పేర్కొనడం గమనార్హం. ఇక... ఐదేళ్లపాటు వైసీపీ మూకలు చేసిన దాడులు, దౌర్జన్యాలు, హత్యలను మరిచిపోయి, 'ఈ రోజు వాళ్ల పార్టీకి ఓటు వేయకపోవడమే పాపం అన్నట్టుగా కొడతా ఉన్నారు. ఈ పాపం ఊరికే పోదు' అని జగన్ వాపోయారు. ఐదేళ్లు 'ప్రత్యేక హోదా'ను అటకెక్కించిన జగన్... ఇప్పుడు మళ్లీ ఆ పాట అందుకున్నారు. కొత్త ప్రభుత్వం కొలువు తీరి రెండు రోజులైనా కాకమునుపే... 'ఎన్డీయేలో చక్రం తిప్పే పరిస్థితి వచ్చినా కూడా ప్రత్యేక హోదా అడగకపోవడం చంద్రబాబు చేసిన మరో పాపం' అని నిందించారు. ప్రతిపక్ష నేతగా 14 నెలల పాటు పాదయాత్ర చేశానని, ఆనాటి ఓపిక ఇంకా తనకు ఉందంటూ... మళ్లీ కాళ్లకు పని చెప్పే అవకాశముందని సంకేతాలు పంపారు.

జూనియర్లకు మంత్రి పదవులను స్వాగతిస్తున్నా!

- నాపై అకారణంగా 16 కేసులు పెట్టారు
- వారిని చంద్రబాబు వదిలినా... నేను వదల: అయ్యన్న



అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు జూనియర్లకు మంత్రి పదవులు ఇవ్వడాన్ని తాను స్వాగతిస్తానని టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు చెప్పారు. గురువారం అమరావతి సచివాలయంలో తనను కలిసిన మీడియాతో ఆయన మాట్లాడారు. కేబినెట్ కూర్పుపై ప్రశ్నించగా... 'సీనియర్లకు పదవులు రాలేదని బాధ ఉండొచ్చు. ఇంత మెజార్టీ వచ్చినప్పుడు అందరికీ మంత్రి కావాలని ఆశ ఉంటుంది. కానీ ఉన్న 26లో ఎంతమందికని ఇస్తారు? ముందు 'హూ ఈజ్ బెస్ట్?' అని చూస్తాం. తర్వాత సీనియర్, జూనియర్ చూస్తారు. చంద్రబాబు సీనియర్, జూనియర్ మేళవింపుగా ఎంపిక చేశారు. ఎన్టీ రామారావు 1988లో నాకు మొట్టమొదటిసారి మంత్రి పదవి ఇచ్చారు. అప్పుడు నా వయస్సు 27. అప్పుడు నేను జూనియర్‌నే కదా? చంద్రబాబు తీసుకున్న నిర్ణయం మంచిదే' అని స్పష్టం చేశారు. 'గత ప్రభుత్వంలో జరిగిన దోపిడీ, అవినీతి విషయంలో రాజీ లేకుండా, తప్పు చేసిన వారిని తప్పించాల్సిందే. కారణం లేకుండా పోలీసులు అరెస్టులు చేస్తారా? మాట్లాడితే అరెస్టు చేసే అధికారం జగన్‌కు ఎవరిచ్చారు? ఎంత మంది పీకలు కోసేసారు? కారణం లేకుండా నాపైనే 16 కేసులు పెట్టారు. చంద్రబాబు వదిలినా.. నేను వదలను. సైకో బొమ్మ పట్టాదారు పాసు పుస్తకాలపై తీసేయమని సూచించా' అని అయ్యన్న చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● శుక్రవారం 14 జూన్ 2024

సివిల్స్ ప్రిలిమ్స్

GS Mock Questions

నిన్నటి తరువాయి

71. Consider the following statements regarding Loss and Damage (L&D) Fund:

1. It was first announced in COP26(Glasgow).
2. Warsaw International Mechanism (WIM) for L&D was established at COP 19 in 2013.
3. It will focus upon mitigation of losses caused due to climate change.

Select the correct answer using the code given below:
a. 1 and 3 b. 2 only
c. 2 and 3 only d. 1, 2 and 3

72. Consider the following statements Regarding Global Renewables and Energy Efficiency pledge initiative recently launched in COP 28, which of the following statements is/are correct?

1. Double the global energy efficiency improvement rate to more than 4% by 2030.
2. Triple the global installed renewable energy capacity by 2030.
3. India is a signatory.

Select the correct answer using the code below:
a. 1 and 2 only b. 3 only
c. 2 and 3 d. 1, 2 and 3

73. Consider the following statements regarding India's Panchamrit commitments declared in COP26 held at Glasgow:

1. Meet 40% of its energy requirements from renewable energy by 2030.
2. Reach 500GW non-fossil energy capacity by 2045.
3. Reduction of the carbon intensity of the economy by 45% by 2030,over 2005 levels.
4. Reduction of total projected carbon emissions by three billion tonnes from now to 2030.
5. Achieving the target of net zero emissions by 2070.

How many of the statements given above are correct?
a. Only two b. Only three
c. Only four d. All five

74. Global Greenhouse Gas Watch (GGGW) is an initiative launched by
a. The UNEP Secretariat
b.The Intergovernmental panel on Climate change
c. The UNFCCC secretariat
d. The World Meteorological Congress

75. Methylotuvimicrobium Buryatense 5GB1C a methane eating microorganism, recently in news, is a
a. Bacteria b. Virus
c. Fungi d. Protozoa

76. How many of the following pollutants are used to measure the Air Quality Index (AQI)?
1. Lead 2. Ammonia
3. Ozone 4. Carbon Monoxide

Select the correct answer using the code given below:
a. 1 and 2 only b. 1, 2 and 4 only
c. 2,3 and 4 only d. All four

77. Consider the following statements regarding "BAD OZONE":

1. It is ground level ozone formed in the Troposphere.
2. It is formed when two primary pollutants(sulphur oxides and volatile organic compounds) react in sunlight and stagnant air.
3. It damages vegetation.

Which of the statements given above is /are correct?
a. Only 1 b. 2 and 3 Only
c. 1 and 3 Only d. 1, 2 and 3

78. Consider the following statements regarding Minamata Convention on Mercury:

1. It is a global legally binding treaty to protect human health and environment from adverse effects of mercury.
2. India ratified it in 2017 with flexibility for continued use of mercury-based products and processes involving mercury compounds up to 2030.
3. It requires that party nations to reduce and eliminate use and release of mercury from Artisanal and small scale Gold mining.

Which of the statements given is correct?
A. Only 1 b. 1 and 3 only
c. 2 and 3 only d. 1, 2 and 3

79. Consider the following pairs:

S. No	Reports seen in news	Published by
1.	Emission Gap report	UNEP
2.	Global stocktake (GST) technical synthesis report	World Economic Forum
3.	Paris Agreement Synthesis report	UNFCCC
4.	Adaptation gap report	IPCC

How many of the above pairs are correctly matched?
a. Only one b. Only two
c. Only three d. All four

80. Consider the following statements about the Kunming-Montreal Global Biodiversity Framework (KMGBF):

1. It was adopted at COP 28 to the United Nations Framework Con vention on climate change (UNFCCC).
2. It replaced the Aichi Biodiversity Targets that expired in 2020.
3. It is not an international treaty and is therefore not legally binding on Parties.
4. It establishes four goals to achieve by 2050 and 23 targets to meet by 2030.

How many of the statements given above are not correct?
a. Only one b. Only two
c.Only three d. All Four

81. Consider the following statements regarding AUKUS:


1. It is a three way strategic defense alliance between Australia, UK and US which,was signed in 2020.
2. It involves supporting Australia in acquiring nuclear armed submarines.

Which of the statements given above are correct?
a. Only 1 b. Only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

82. Consider the following pairs:

S.no	Exercises	Countries
1.	Shinyuu Maitri	India and Japan
2.	DUSTLIK-2023	India and Kazakhstan
3.	Bold Kurukshetra	India and France

Which of the following a pairs given above correctly matched?
a. 1, 2 Only b. 1 and 3
c. 1 only d. 2 and 3 only



83. 'The Skyes -Picot Agreement' which was recently seen in news is related to:

1. **Statement-I:** It is secret treaty between drawn up in 1916 between Russia and Great Britain.
2. **Statement-II:** The major issue of the treaty divided up the Arab lands of the ottoman Empire into British and French zones of control following the end of world war I.

Select the correct statements from the given above:
a. Both Statement-I and Statement -II are correct and Statement -II is the correct explanation for statement-I
b. Both Statement I and Statement-II are correct and Statement -II is not the correct explanation for Statement-I
statement _I is correct but Statement-II is incorrect.
statement -I is incorrect but Statement-II is correct

84. Consider the following statements regarding the Five Eyes Intelligence Alliance:

1. It is an intelligence alliance comprising the US, UK, Australia, Canada, and New Zealand.
2. It originated from the 1946 UK-USA agreement for sharing signals intelligence.

Which of the statements given above is correct?
a. Only 1 2. Only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

85. Consider the following statements regarding the International Criminal Court (ICC):

1. It was established by the Rome Statute in 1998.
2. It investigates individuals accused of serious international crimes.
3. The Court has fifteen judges, each from a different country, elected to nonrenewable nine-year terms.
4. India is not a member of the ICC.

How many statements given above are correct?
a. Only One b. Only two
c. Only three d. All four

86. How many of the above-mentioned countries are part of the Indian ocean Rim Association?
1. India 2. Iran
3. Mauritius 4. Somalia 5. Yemen
a. Only two b. Only three
c. Only four d. All five

87. Consider the following statements regarding the Indo-Pacific Economic Framework for Prosperity (IPEF):

1. India has joined all four pillars of IPEF.
2. It was jointly launched by the India and USA.
3. All the partner countries represent 40% of world GDP.
4. The US trade Representative (USTR) is lead agency for the trade pillar, while the Indian Ministry of Commerce is leading the other three pillars.

How many statements given above are correct?
a. Only one b. Only two
c. Only three d. All four

88. Which of the following statements is not correct about the Voice of Global South Summit (VOGSS)?
a. It focused on ways to sustain the momentum generated toward a more inclusive, representative, and progressive world order.
b. India previously hosted the first VOGSS, where 125 Global South countries came together with the theme "Unity of Voice, Unity of Purpose."
c. The term "Global South "refers to various countries often described as "developing "," less developed "or "underdeveloped."
d. South Africa hosted the second Voice of Global South Summit.

89. Consider the following statements regarding the Genocide Convention:

1. It was the first human rights treaty adopted by the UN General Assembly.
2. According to the convention, genocide is a crime that can take place only in time of war.
3. India has signed the treaty.

How many of the above statements are correct?
a. Only one b. Only two
c. All three d. None

90. Consider the following statements regarding Kampala declaration:

1. It was adopted at the recent summit of the Non-Aligned Movement (NAM).
2. It strongly condemned the Russian aggression against Ukraine.

Which of the statements given above are correct?
a. Only 1 b. Only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

91. Consider the following statements with reference to GM crops:

1. Bt. Mustard (DMH 11) and Bt. cotton are only two crops that have been approved for commercial cultivation.
2. Bt Cotton has shown strong resistance to pink Bollworm attack in recent times.

Which of the statements given above is correct?
a. Only 1 b. Only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

92. Consider the following statements regarding the recently adopted Bletchley Declaration recently seen in news:

1. It aims to regulate Artificial intelligence through international collaboration.
2. It includes all the member countries of the United Nations.

Which of the statements given above is correct?
a. Only 1 b. Only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

93. Consider the following statements with reference to Chandrayaan 3 payloads:

1. The propulsion module has Spectro-polarimetry of Habitable Planet Earth (SHAPE) payload to measure the thermal conductivity and temperature.
2. The Lander module has Chandra's Surface Thermophysical Experiment (ChaSTE) to study the spectral and Polari metric measurements of Earth from the lunar orbit.
3. The Rover payloads are Alpha Particle X-ray Spectrometer (APXS) and Laser Induced Breakdown Spectroscope (LIBS) for deriving the elemental composition in the vicinity of landing site.

How many of the statements given above is correct?
a. Only one b. Only two
c. All three d. None

94. Consider the following statements regarding the AIRAWAT supercomputer recently seen in news:

1. It is India's largest and fastest AI supercomputing system.
2. It is installed at IIT Bombay under the National program on Artificial intelligence.
3. It is top 50 in the top 500 Global supercomputing list.

How many statements given above are correct?
a. Only one b. Only two
c. All three d. None

95. With reference to satellite communications technology,'Nabhmitra' is:
a. Navigation tool for private airlines
b. Meteorological data collection unit
c. Laser technology used in the tourism industry.
d. Satellite communication service for fisherman

96. Consider the following statements:

Statement-I: August 23 is declared as the National Space Day.
Statement-II: August 23 is the birthday of Vikram Sarabhai, an eminent space scientist regarded as the father of space program in India.

Which one of the following is correct in respect of the above statements?
a. Both Statements-I and Statement-II are correct, and Statement-II is the correct explanation for Statement-I
b. Both statements-I and Statement-II are correct and Statement -II is not the correct explanation for Statement-I
c. Statement-I is correct, but Statement-II is incorrect.
d. Statement-I is incorrect but Statement -II is correct.

97. Consider the following pairs:

S.No.	Moon mission	Country
1.	Danuri	South Korea
2.	Hakuto -R	Japan
3.	Luna 25	France
4.	Beresheet 2	UAE

How many pairs given above are correctly matches?
a. Only one b. Only two
c. Only three d. All four

98. Consider the following statements regarding a Black Hole:

1. It is a place in space where gravity pulls so much that even light cannot get out.
2. Most black holes are formed from the remnants of a large star dies in a supernova explosion.
3. It cannot be directly observed as it does not emit or radiate light.

How many statements given above are correct?
a. Only one b. Only two
c. All three d. None

99. Research found the presence of tantalum in the Sutlej River sand. In this context consider the following properties of the tantalum:

1. Grey, heavy, ductile metal.
2. Very hard metal.
3. Possess high corrosion resistance.
4. Immune to chemical attacks at any range of temperature.
5. Extremely high melting point.

How many of the above are properties of tantalum?
a. Only two b. Only three
c. Only four d. All five

100. ISRO's Project NETRA aims to
a. Explore planets outside the solar system.
b. Aid detection and mapping of ocean bed resources.
c. Provide early warning system in space to detect debris and other hazards to Indian satellites.
d. Ease navigation in metropolitan cities.

ANSWERS

71. b			93. a
72. a	79. b	86. d	94. a
73. c	80. c	87. b	95. d
74. d	81. b	88. d	96. c
75. a	82. c	89. b	97. b
76. d	83. d	90. d	98. c
77. c	84. c	91. d	99. c
78. b	85. b	92. a	100. c

Prepared by : CSB Academy, Hyderabad



తెలివైన దుప్పి

అనగనగా ఒక అడవిలో అందమైన,తెలివైన దుప్పి ఉండేది. ఒక రోజు అది ఓక గుహ దగ్గర ఆహారం కోసం వెతుక్కుంటూ ఉండగా దూరాన ఒక పులి దానికి కనిపించింది. వెంటనే దుప్పి గుహలోనికి దూరిపోయింది కానీ పులి కూడా అదే గుహలోకిరావచ్చేమో అని భయపడింది. పులి ఆ గుహ దగ్గరికి రాగానే లోపల ఉన్న దుప్పి గంభీరంగా గొంతు మార్చి,' గత కొన్ని రోజులుగా పులి గుండెకాయ తినలేదు కదా మనం, ఇవాళ ఏదైనా పులి కంటబడితే చూద్దాం' అన్నది. ఆ మాటలు విన్న పులి గుహ లోపల ఏదో తనకంటే భయంకరమైన పెద్ద జ.ంతువు ఉందనుకోని భయపడింది. ఇంతలో అక్కడికి ఒక తోడేలు వచ్చి ఏమైంది నువ్వు భయపడ్డట్టు కనబడుతున్నావు? అని అడిగింది. పులి తాను విన్న మాటలు తోడేలుతో చెప్పింది. ఈలోగా గుహ నుండి బయటకు రాబోయిన దుప్పికి.. పులి, తోడేలు రెండూ కనబడ్డాయి. వెంటనే తప్పుకుని లోపలికి వెళ్లి, పులి కనబడక పోతే ఈ రోజుకి ఏదైనా తోడేలును వేటాడి, దాని గుండెకాయ తిందాంలే అన్నది. ఆ మాటలు బయటనుండి విన్న పులీ తోడేలు రెండూ ఆ ప్రాంతాన్ని వదిలి అక్కడినుండి దూరంగా వెళ్లిపోయాయి. అలా దుప్పి తన ప్రాణాలను కాపాడుకుంది.



సరైన నీడ ఏది?




ఎన్ని కుక్కలు, పిల్లులు ఉన్నాయి?



7 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 332

6		8		2				7
	4	2					5	
	9				8			1
4			9				3	
			7		2			
	6				3			9
3			5				7	
	7					5	1	
5				1		9		4

సుడోకు - 331 సమాధానం

8	7	6	2	1	9	3	4	5
5	3	9	6	7	4	1	8	2
4	1	2	5	8	3	6	9	7
7	6	5	1	4	8	2	3	9
9	8	3	7	2	6	5	1	4
1	2	4	3	9	5	8	7	6
2	5	1	4	3	7	9	6	8
6	4	8	9	5	1	7	2	3
3	9	7	8	6	2	4	5	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.